సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్), హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



గత ఏడాది ప్రభుత్వ సంస్థలపై 70వేల అవినీతి ఫిర్యాదులు 07
అమెరికాకు శిక్ష తప్పదు : ఇరాన్
నేపాల్‌కు తొలగని ముప్పు 08



సంపుటి 09, సంచిక: 274 | గురువారం | 03-09-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## బిజెపిని గెలిపించడమే 'సర్' లక్ష్యం

భారీ సంఖ్యలో ఓటర్ల పేర్ల తొలగింపు ప్రక్రియను నిలిపివేయాలని సుప్రీంకోర్టుకు కపిల్ సిబల్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ విరుచుకుపడ్డారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ బిజెపికి ఎన్నికల్లో విజయం చేకూర్చేందుకేనని ఆరోపించారు. సర్ పేరుతో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్ల తొలగింపు ప్రక్రియను నిలిపివేయాలని ఆయన సుప్రీంకోర్టును కోరారు. బుధవారం కపిల్ సిబల్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ బిజెపికి ఎన్నికల్లో తరువాయి 12లో

## విమానాశ్రయాల పనులు వేగిరపరచండి





ప్రజాపక్షం/హైదరాబాద్

**విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**

- వరంగల్‌లోని మామూనూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూసేకరణ పూర్తిచేశామని వెల్లడి
- రెండువారాల్లో టెండర్లు పిలిచి డిసెంబర్‌లో శంకుస్థాపన చేస్తామన్న కేంద్ర మంత్రి
- గ్లోబల్ సమ్మిట్ రక్షణ ఎక్స్‌పోలో భాగస్వాములు కావాలని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఆహ్వానం

తెలంగాణలో ఆదిలాబాద్, మామూనూరు (వరంగల్) విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను పూర్తి చేసి ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్‌గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌ఓ (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో రన్‌వే ఫైనలైజ్ చేయడానికి సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. మామునూరు (వరంగల్) విమానాశ్రయం టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేసి తరువాయి 8లో

## నా కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యులను చేయొద్దు

- అన్ని వివరాలూ అధిష్ఠానానికి వివరించా
- నా రాజీనామా కోరలేదు
- ఢిల్లీలో 'మీడియా'తో కొండా సురేఖ



**న్యూఢిల్లీ :** తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చానన్నారు. బుధవారం ఆమె ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరలేదని, జరిగిన పరిణామాలన్నింటినీ రాతపూర్వకంగా హైకమాండ్‌కు నివేదించినట్లు తెలిపారు. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారన్నారు. తన బిడ్డ స్వతంత్రంగా ఉందని వివరించారు. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నానన్నారు. ఆమె జీవితం ఆమె ఇష్టమని సురేఖ పేర్కొన్నారు. తనతో పాటు తన భర్త రాజకీయ జీవితం మా ఇష్టం అని తెలిపారు. తాను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నానని కొండా సురేఖ చెప్పారు. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని వివరించారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నానని తెలిపారు. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరానని ఆమె వివరించారు. తన కుమార్తె వ్యాఖ్యలపై తాను స్పందించనని కొండా సురేఖ తెలిపారు. సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదన్నారు. రోజూ ఎంతో మంది తరువాయి 12లో

## వైఎస్ ప్రారంభించిన ప్రాజెక్టులు పూర్తి చేస్తా

- ఆగిపోయిన ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బిసి, కల్వకుర్తి పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం ఇస్తాం
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవార్డ్స్ 2026 కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి
- రానున్న రోజుల్లో రాహుల్‌ను ప్రధానిని చేయాలని పిలుపు

08



## అక్రమ దత్తత అవునో కాదో తేల్చండి

హైకోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

అక్రమ దత్తత కేసుల్లో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసులు ఎందుకు వెనుకబడుతున్నారని హైకోర్టు ప్రశ్నించింది. పిల్లలను స్వాధీనం చేసుకున్న తర్వాత దత్తత తీసుకున్నామని చెబుతున్న వారిని సమగ్రంగా విచారించాలని, అవసరమైతే డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించి తల్లిదండ్రులను గుర్తించాలని ఆదేశించింది. తల్లిదండ్రులను గుర్తించిన తర్వాతే దత్తత చట్టబద్ధమైనదా, పిల్లల కొనుగోలు, విక్రయాలు జరిగాయా అన్నది తెలుతుందని పేర్కొంది. దీనిపై వారంలోగా పూర్తి నివేదిక ఇవ్వాలని హోంశాఖను ఆదేశిస్తూ, చట్టబద్ధమైన దత్తత ప్రక్రియను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం. వెంకన్న దంపతులు 2023లో దత్తత తీసుకున్న చిన్నారిని తరువాయి 12లో

## బావిలోకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాపక్షం/చిగురుమామిడి

- తప్పిన పెను ప్రమాదం
- హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తుండగా గుంతలమయమైన రోడ్డుపై స్టీరింగ్ రాడ్ ఊడిపోవడంతో ఘటన



కరీంనగర్ జిల్లాలో ఆర్టీసీ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా సుందరగిరి గ్రామ శివారులో ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో బస్సులో 54 మంది ప్రయాణికులు ఉన్నారు. నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు జరుగుతుండటంతో, తీవ్ర గుంతలమయమైన రోడ్డుపై బస్సు ఒక్కసారిగా ఎగిరిపడింది. ఈనేపథ్యంలో స్టీరింగ్ రాడ్ ఊడిపోయింది. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోగా, బస్సు రహదారి పక్కనే ఉన్న స్థానిక రైతు కావటి బక్కయ్యకు చెందిన వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో తక్కువ వేగంతో ప్రయాణిస్తుండడం, వ్యవసాయి భావికి చుట్టూ సిమెంట్ కట్టడం ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో పెనుప్రమాదం సంభవించకుండ స్వల్ప గాయాలతో బయటపడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనను గమనించిన గ్రామస్థులు ప్రయాణికులను బస్సులో నుంచి బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఆర్టీసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## ఒకే జలభద్రతా ప్రణాళికలోకి జల సంరక్షణ పనులు



ప్రజాపక్షం/హైదరాబాద్

- కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి
- ప్రతి జలసంరక్షణ ఆస్తికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య
- నిర్వహణ బాధ్యత నిర్దిష్ట సంస్థకు అప్పగించాలని సూచన
- 'జలసంచయ్ – జన్ భాగీదారీ' సదస్సులో పాల్గొన్న ఉత్తమ్

దేశవ్యాప్తంగా చేపట్టే జల సంరక్షణ పనులన్నింటినీ ఒకే జలభద్రతా ప్రణాళిక పరిధిలోకి తీసుకురావాలని తెలంగాణ నీటిపారుదల, శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ప్రతి జల సంరక్షణ ఆస్తికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి, దాని నిర్వహణ బాధ్యతను ఒక నిర్దిష్ట సంస్థకు అప్పగించాలని సూచించారు. న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి శాఖాపరమైన 'జల్ సంచయ్–జన్ భాగీదారీ' సదస్సులో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. జలభద్రతను కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యతగా కాకుండా తాగునీరు, వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధులు, పట్టణ భద్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ, ప్రధాన మంత్రి కృషి సించాయీయోజన, ఆర్థిక సంఘం నిధులు, కాంపా, వాటర్‌షెడ్ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, స్థానిక సంస్థలు, సిఎస్ఆర్ నిధుల ద్వారా జల సంరక్షణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అయితే వీటి మధ్య సమన్వయం లేకపోతే పనుల పునరావృతం, అనువుకాని ప్రాంతాల ఎంపిక, నిర్వహణ లోపాలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అందువల్ల అన్ని తరువాయి 8లో

## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పూర్తి విధ్వంసం



- మా వెయ్యిరోజుల పాలనలో అప్పులకు వడ్డీలు, పెండింగ్ బిల్లులు చెల్లిస్తూ అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతున్నాం
- మేనిఫెస్టోలోని హామీలను ఒక్కొక్కటిగా చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం
- ప్రజాపాలనపై విమర్శలు చేస్తే బిఆర్ఎస్ అక్రమాలు మాసిపోవు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ 3475 రోజుల పాలనలో విధ్వంసాన్ని సృష్టించిందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, కనీసం నిరసన వ్యక్తం చేయకుండా ధర్నాచౌక్‌ను ఎత్తివేస్తే, తమ వెయ్యిరోజుల ప్రజా పాలనలో ఆ అప్పులకు వడ్డీలను, అసలును, పెండింగ్ బిల్లును చెల్లిస్తూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నామని, ధర్నాచౌక్‌ను పునరుద్ధరించామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీలను ఒక్కొక్కటిగా చిత్తశుద్ధితో అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రధానప్రతిపక్ష నేత (కెసిఆర్) ఆ పాత్రను పోషించడంలేదని, ఆయన ఆ పాత్రకు అర్హులు కాదని అభిప్రాయపడ్డారు. '22ఎ' అంశంపైన మాజీ మంత్రి హరీశ్ రావు అసెంబ్లీలో ఏం ఇరగదీస్తారో తాను చూస్తానన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, ఎంపి వేం నరేందర్ రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం తరువాయి 8లో

## సామాజిక సంక్షోభం.. సాంస్కృతిక విద్రోహం



ప్రజాపక్షం/హైదరాబాద్

- కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టో శతాబ్దపు అతిపెద్ద మోసం
- కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలనపై బిఆర్ఎస్ విమర్శలు

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ఆర్థిక విధ్వంసం, సామాజిక సంక్షోభం, సాంస్కృతిక విద్రోహం జరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ అభయహస్తం మ్యానిఫెస్టో శతాబ్దపు అతిపెద్ద మోసమన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'కాంగ్రెస్ పార్టీ అసమర్థ అరాచక వెయ్యి రోజుల పాలన ఛార్జ్ ట్' ను కెటిఆర్ బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ఎల్పి ఉప నాయకులు తన్నీరు హరీశ్ రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య,సత్యవతిరాథోడ్,మాజీ ఎంపి కె.ఆర్. సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీఎల్.రమణ, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అంటే ప్రజా ప్రజాపీడన అని అన్నారు. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వమని, అన్ని రంగాల్లో అట్టర్ ఫ్లాప్ అయిందని ఆరోపించారు. 30 కమీషన్లు పర్సెంటేజీలు తీసుకుంటున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన కార్యక్రమాలకు సున్నాలు వేస్తూ, రిబ్బన్ కటింగ్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ఒక అసమర్థత ప్రో మాక్స్, అవినీతి అల్ట్రా మాక్స్, అరాచకం ఐమాక్స్ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని,ద్రోహాన్ని అవినీతిని, అరాచకంపైన తిరగబడాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఒక్క బ్యారేజ్‌ను, ఒక్క ప్రాజెక్టును, ఒక్క చెరువును కూడా నిర్మించలేదని, తరువాయి 12లో






న్యూఢిల్లీ అజయ్‌భవన్‌లో బుధవారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సమితి సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, పక్క చిత్రంలో తెలంగాణ రాష్ట్ర నేతలు

## రామాలయ తొలి సిఇఒగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా



08

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
03-09-2026
www.prajapaksham.in
ఎడిట్
PEOPLE'S VIEWS

# 'సర్' 'భళారే' విచిత్రం

ఓటర్ల జాబితాలు తాజా పరచటం పేరుతో భారత ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్ – సర్) మూడవ దశ ముసాయిదా జాబితాలు మరోసారి ఆశ్చర్యకర సంఖ్యలు వెల్లడించాయి. 16 రాష్ట్రాలు, 3కేంద్ర పాలిత ప్రాంతాల ముసాయిదా జాబితాలు అంతకు ముందు ఉన్న 29కోట్ల 93లక్షల ఓటర్లలో 6కోట్ల 15లక్షలు తొలగించాయి. అంటే 17.04 శాతం ఓట్లు తొలగింపుకు గురైనాయి. 24 సంవత్సరాల తదుపరి ముమ్మర సవరణ చేబట్టినందున ఈ కాలంలో మరణించినవారు, శాశ్వతంగా వలసవెళ్లిన వారు, ఇళ్లు మారిన వారు, డూప్లికేట్ ఓటర్లు కొంత ఎక్కువగానే ఉంటారనే వాదన అంగీకరించవచ్చు. అడ్రసు దొరకని వారు అనే కేటగిరి ఎన్నికల కమిషన్ యంత్రాంగం వైఫల్యాన్ని చాటుతోంది. పై కేటగిరీల్లో మరణించినవారిని మినహాయిస్తే మిగతా కేటగిరీల క్రింద ప్రస్తుత జాబితాల్లో తొలగించబడిన కోట్లమందిలో అత్యధికులు మరోచోటనైనా ఓటరుగా రిజిష్టర్ అయి వుండాలి కదా! ఎక్కడ? ఎన్యూమరేషన్ ఫార్మ్స్ పంపిణీ చేసామంటున్నారు. ఇది పాక్షిక సత్యం. ఇంటింటికీ వెళ్లి ఫార్మ్స్ పంపిణీ చేయాల్సిన, మళ్లీ ఓటర్లను కలిసి ఫార్మ్స్ నింపి వాటిని సేకరించాల్సిన బిఎల్ఓలు, ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు వారి విధులు సక్రమంగా నిర్వర్తించలేదన్నది యధార్థం.

చాలామంది కమ్యూనిటీ హాల్స్‌లో కూర్చుని తమ వద్దకు వచ్చిన వారికి ఫారాలు పంచారు. పంపిణీ కాని వాటిని ఏమి చేశారో వారికే తెలియాలి. ఈ కర్తవ్య నిర్వహణలో విఫలమైన యంత్రాంగం తప్పులు దిద్దుకోవలసిన (2022 నాటి జాబితాతో సరిపోల్చి), ముసాయిదాలో పేరులేకపోతే కొత్తగా చేరాల్సిన బాధ్యతను ఓటర్లపై పెట్టారు. అభ్యంతరాలు–ఫిర్యాదుల గడువులో ఆ పనిచేస్తే, అవి ఆధారాలతో సరిగ్గా ఉంటే తుది జాబితాలో చేర్చుతారట. లక్షలు, కోట్లతో తొలగింపులు ఉండగా, ఒక వేళ వారిలో అత్యధికులు కొత్త పత్రాలు దాఖలు చేస్తే వాటిని పరిశీలించటం యంత్రాంగానికి సాధ్యమా? ఈ ప్రహసనానికి పశ్చిమబెంగాలే ఉదాహరణ. 90లక్షలకు పైగా ఓటర్ల పేర్లు తొలగిస్తే, టిఎంసి సుప్రీంకోర్టుకెళ్లి కొట్లాడితే వాటి పరిశీలనకు ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేశారు. ఎన్నికలలోపు వాటిలో నాల్గవవంతుకూడా పరిష్కారం కాలేదు. పరిష్కారం అయిన వాటిలో ఎక్కువశాతం చెల్లుబాటు ఓట్లే. ఈ జాబితాలు బిజెపి విజయానికి సహాయకారికాగా, ఎన్నికల అనంతరం పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం నత్తనడక నడుస్తోంది. ప్రస్తుత మూడవ దశ సర్ రాష్ట్రాల్లో త్వరలో ఎన్నికలు లేకపోయినా తొలగించబడిన ఓటర్లందరికీ న్యాయం జరుగుతుందని భావించలేము.

తాజా ముసాయిదా గణాంకాలు చూస్తే ఓటర్లను – ముఖ్యంగా పేదలు, ముస్లిం మహిళలు, వలస కార్మికులను తొలగించటమే ప్రధానంగా కనిపిస్తున్నది. ఢిల్లీలో 42.56 లక్షల ఓటర్లలో 32.78 శాతాన్ని – అంటే ప్రతి ముగ్గురిలో ఒక ఓటు తొలగించారు. మహారాష్ట్రలో మరీ ఆశ్చర్యకరంగా 2కోట్ల 6లక్షల ఓట్లు తొలగింపుకు గురైనాయి. సర్‌కు ముందు 9కోట్ల 78లక్షలుగా ఉన్న ఓటర్ల సంఖ్య సర్ ముసాయిదాలో 7.71 కోట్లకు పడిపోయింది. మహారాష్ట్రలో లోక్‌సభ – అసెంబ్లీ ఎన్నికల మధ్య ఆకస్మికంగా 39లక్షల ఓటర్లు పెరిగారు. అంటే బిజెపి వారు ఎంచుకున్న నియోజకవర్గాల్లో గుండుగుత్తగా చేర్చిన ఈ ఓట్లు వారి పరాజయాలను విజయాలుగా మార్చాయి. ఇప్పుడు 2.07 కోట్లు – అనగా ప్రతి ఐదుగురిలో ఒకరి పేరును ఓటర్ల జాబితానుంచి తొలగించారు. దీన్నే రాహుల్‌గాంధి ఓటు చోరీ అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు 9.29 కోట్లు, అదే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు 9కోట్ల 70లక్షలు, 2026 సర్ ముసాయిదాలో ఓటర్లు 7.71 కోట్లు. ఏది సరైంది అని రాహుల్‌గాంధి ప్రశ్నించారు. ''బిజెపి, ఓటు చోరీ కమిషన్ ఎత్తుగడలు మారుస్తున్నాయి, కొనసాగిస్తాయి. కాని వారి లక్ష్యం ఒకటే – ఏది ఏమైనా బిజెపి గెలుపు, భారత ప్రజాస్వామ్యం నాశనం'' అని అన్నారాయన.

కర్నాటకలో 1కోటి 7లక్షలు ఓట్లు తొలగించారు. తెలంగాణలో 'సర్'కు ముందు 3.38 కోట్ల ఓటర్లు ఉండగా, సర్ ముసాయిదాలో 73,39,235 తగ్గిపోయారు. 90లక్షలకు పైగా నోటీసులు జారీ చేశామంటున్నారు. ఒక విశ్లేషణ ప్రకారం, హైదరాబాద్‌లో తొలగించిన 19,41,444 ఓట్లలో 47.8 శాతం మహిళలు. వారిలో అత్యధికులు హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్నారు. తొలగించబడిన మహిళా ఓటర్లలో బహదూర్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో 62,885 మంది, చాంద్రాయణగుట్టలో 76,099 మంది, కార్వాన్‌లో 69,391మంది, యాకుత్‌పురలో 75,315 మంది, మలక్ పేటలో 71,644 మంది, నాంపల్లిలో 65,212 మంది ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 44,89,512, చిన్న రాష్ట్రాలు జార్ఖండ్‌లో 43,61,987, పంజాబ్‌లో 20.66 లక్షలు, ఒడిసాలో 20.12 లక్షల పేర్లు ఓటర్ల జాబితాలనుంచి తొలగించారు. ఈ తొలగింపులు, చేర్పులు, ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతాయి. అభ్యంతరాల దాఖలుకు వ్యవధి పొడిగించాలని కర్నాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాశారు. వెంటనే ఎన్నికలు లేవు కాబట్టి ఎన్నికల కమిషన్ తగినంత సమయం తీసుకుని తప్పులను గరిష్టంగా నివారించేందుకు కృషి చేయాలి. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకూడదన్న ప్రకటిత లక్ష్యానికి అది బద్ధురాలు కావాలి. ●



## నక్సల్స్ ముప్పు నుంచి బయటపడిన ఛత్తీస్‌గఢ్

**ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాలు దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యుఇ) విసిరిన తీవ్ర సవాల్‌ను ఎదుర్కొన్నాయి. అయితే, ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఆ ముప్పును అధిగమించి అభివృద్ధి, ప్రగతి, శ్రేయస్సులతో కూడిన ఒక నూతన శకానికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఒకప్పుడు హింసతో దెబ్బతిన్న ప్రాంతాలు ఇప్పుడు రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రుల అనుసంధానం, పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలతో ఎక్కుగా గుర్తింపు పొందుతున్నాయి. ఎయిమ్స్ రాయ్‌పూర్‌లో పురుషుల కంటే ఎక్కువమంది మహిళలు డిగ్రీలు పొందుతున్నారు. దశాబ్దాలుగా ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాలు ఇబ్బందులు, సరిపోనంతగాలేని కనెక్టివిటీ వామపక్ష తీవ్రవాదం నుంచి తీవ్ర సవాల్‌ను ఎదుర్కొన్నది, దారిలోని అనేక గిరిజన ప్రాంతాలలో భయం, హింస అభివృద్ధికి ఆటంకాలుగా మారాయి.** ●

– ఉపరాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్

## తెలంగాణ సర్దార్.. జమలాపురం కేశవ రావు

నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతుకుతున్న వారి స్వేచ్ఛకోసం, తమ జీవితాన్ని త్యజించిన వారిలో 'సర్దార్ జమలాపురం కేశవరావు' ముందు వరుసలో నిలుస్తారు..

కళ్లెదుట జరుగుతున్న అన్యాయాలకు చూస్తూ, సహిస్తూ ఉండలేక ప్రజల్లో ధైర్య సాహసాలను నూరిపోయడమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం ముందుకు సాగారు. హైదరాబాద్ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి జీవంపోసి, ప్రజా శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిబద్ధత కలిగిన నేత, త్యాగశీలి సర్దార్ జమలాపురం కేశవరావు. సత్యాగ్రహిగా, క్విట్ ఇండియా ఉద్యమ కార్యకర్తగా, ఆంధ్ర మహాసభ నిర్వాహకుడిగా, గ్రంథాలయోద్యమ నిర్మాతగా, ఆదివాసీ, దళిత జనోద్ధారకుడిగా, పత్రిక స్థాపకుడిగా ఇలా ఎన్నో కార్యకలాపాలు చేపట్టి హైదరాబాద్ రాజ్య ప్రజల్లో చైతన్యాన్ని, ధైర్యాన్ని నింపిన మహోన్నతుడు కేశవరావు. అందుకే ఆయన్ను అందరూ తెలంగాణ 'సర్దార్'గా పిలుచుకుంటారు. తెలంగాణ కేసరిగా, 'దక్కన్ సర్దార్'గా బిరుదులందుకున్న జమలాపురం కేశవరావు తనదైన శైలిలో ఉద్యమాలు నడిపి కాంగ్రెస్‌కు, తెలుగు వారి ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోశారు.

కేశవరావు నిజాం సంస్థానంలో తూర్పు భాగాన ఉన్న ఖమ్మం (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908, సెప్టెంబర్ 3న జమలాపురం వెంకట రామారావు, వెంకట నరసమ్మలకు తొలి సంతానంగా జన్మించారు. సంపన్న జమీందారీ వంశంలో పుట్టినా, నాటి దేశ రాజకీయాలు అతనిని తీవ్రంగా కలవరపరచాయి. ఎర్రుపాలెంలో ప్రాథమిక విద్య అనంతరం, హైదరాబాదులోని నిజాం కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1923లో రాజమండ్రిలో మొదటిసారి మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు, 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనాడు. ఆంధ్రపితామహుడుగా మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయ ఉద్యమంను తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు నడపడంలో కేశవరావు కృషి చేశారు. 1938లో దీపావళి సందర్భంగా ఆవిర్భవించిన 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కేశవరావు కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు.

1938 సెప్టెంబర్ 24 మధ్యాహ్నం మధిరలో గోవిందరావు నానక్, జనార్ధనరావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లో సర్దార్‌ను దీక్ష చేయనివ్వొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి నివ్వలేదు. మధిరలో అడుగడుగునా పోలీసులను మోహరించిం ది. ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు. వెంటనే మహాత్మాగాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జై అని దిక్కులు పెక్కటిల్లేలా నినాదించారు. అరెస్టు చేసి నిషేధాన్ని ఉల్లఘించి సత్యాగ్రహ దీక్ష చేశారంటూ కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైలులో ఎనిమిది నెలల శిక్షను అనుభవించిన తర్వాత కేశవరావుతో సహా రాజకీయ ఖైదీలందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా అదే పోరాట పంథాను కేశవరావు కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ సభలు, సమావేశాలు జరిగినపుడు ఒక సామాన్య కార్యకర్త మాదిరిగా పందిళ్ళు వేయడానికి, కర్రలు కూడా నాటి నిరాడంబరతకు, పార్టీ పట్ల అంకితభావంకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, అంతలా పార్టీకి సేవచేసిన ఆయనకు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల మూలంగా రావాల్సినంత పేరు, దొరకాల్సిన గౌరవం రాలేదు. జైలు జీవితం, ఉద్యమ సమయంలో భోజనం లేకపోవడం, పార్టీలో ఒత్తిళ్లు కలగలిసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయిన కేశవరావు1953, మార్చి 29న తన 46వ ఏట మరణించారు.

*(సెప్టెంబర్ 3 న జమలాపురం కేశవ రావు జయంతి సందర్భంగా)*

కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా
9848445134

# వర్షం కోసం సర్కారు భగీరథ ప్రయత్నం



ఎస్.బాబు
అధ్యక్షుడు, టిజిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

మేఘాల నుండి భూమిపై నీటి బిందువుల రూపంలో కురిసే జలధారనే వర్షం అంటున్నాం. నైరుతి, ఈశాన్య ఋతుపవనాలు ఏర్పడినప్పుడు, సముద్రాలలో అల్పపీడనాలు ఏర్పడినపుడు సహజంగానే వర్షాలు కురుస్తాయి. జీవరాశి మనుగడకు నీరు అత్యంత అవసరం. మన దశావతారాలలోని మొదటి మత్స్యావతారం నీటిలో పుట్టిందేనని పురాణాలు చెప్తున్నాయి. ఇది మత పరమైన నమ్మకం. మతమనేది మనిషి నమ్మకం. రాజకీయ పార్టీలు మత విశ్వాసాలు కాకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ప్రభుత్వాన్ని నడిపించాలి. కానీ వాస్తవంలో అలా జరగడంలేదు. 2014 నుండి 2023 వరకు కెసిఆర్ ముఖ్యమంత్రిగా సుమారు 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపించారు. 2 సంవత్సరాలు వర్షాలు రాకపోవడంతో అనావృష్టి ఏర్పడింది. ఫలితంగా నేలలు బీటలు వారాయి. పంటలు పండక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నీరు లేని గ్రామాలు, సేద్యం లేని పొలాలు దర్శనమిచ్చాయి. ఆయన 70 వేల పుస్తకాలు చదివిన దిమాగీ నక్సల్ కనుక తాన్ సేన్ తన రాగాలతో వర్షం కురిపించిన విషయం గుర్తుకొచ్చింది. సహజంగానే ఆయన కూడా కవి కనుక భావావేశం పొంగి ''జాలిగుండెల మేఘమాలా వానజల్లుగ కురిసిపోవా, నీలాల ఓ మేఘమాలా'' అంటూ పాట అందుకున్నారు. అయినా మేఘం వర్షించక పోవడంతో ఆయన ఇగో హర్టయి 2015 డిసెంబర్ మాసంలో ఆయుత చండీ మహాయాగాన్ని 5 రోజుల పాటు చాలా ఘనంగా నిర్వహించారు. దేశంలో నిర్వహించిన యాగాలలో ఇది అతి పెద్దదని ఆనాడు పత్రికలు పతాక శీర్షికలలో ప్రచారం చేశాయి. దాదాపు 7 నుంచి 8 కోట్ల రూపాయలు ఖర్చయింది. అయినా వర్షాలు అనుకున్నంతగా కురవలేదు. 20 నుండి 25 శాతం వర్షపాతం మాత్రమే రికార్డయింది. ఆనాడు కూడా ఎల్ నినో ఏర్పడటం, 231 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. ఆ సంవత్సరం సాధారణంగా 752 మిల్లీమీటర్ల వర్షపాతం ఉండాలి. కాని 661 మిల్లీమీటర్లు వర్షపాతం మాత్రమే రికార్డయింది. భూగర్భ జలాలు పడిపోయాయి. సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ యాగం యొక్క కాన్సెప్ట్ వర్షాలు కురవాలని, పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని. ఆయన యాగం నిర్వహించినా వరుణ దేవుడు తమ ప్లాస్టిక్ డ్రమ్ములను నీటితో నింపలేదని, యాగం చేసినా చివరకు ట్యాంకర్ నీళ్ళతోనే దాహం తీర్చుకోవలసి వచ్చిందని మహిళలు ఆవేదన చెందారు.

ఆనాటి ముఖ్యమంత్రికి మత విశ్వాసాలపై పూర్తి నమ్మకం ఉండేది. సహజంగానే భక్తిభావం కూడా ఎక్కువగా ఉండటంతో ఆయన ఆలోచన యజ్ఞ యాగాదులు, క్రతువుల చుట్టూ తిరుగుతూ ఉండేది. 2019 లో కూడా వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయేమోనని ''కరుణించవా వరుణదేవా'' అంటూ సరాగాల పల్లకిలో ఊరేగుతూ జనవరి మాసంలో సహస్ర చండీయాగం నిర్వహించారు. ఈ యాగం కాన్సెప్ట్ ఏమిటంటే వానలు బాగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరికతో తమ ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో మళ్ళీ 5 రోజులు యాగాన్ని నిర్వహించారు. ఆ యాగ ఫలమో లేక సహజంగానే ఏర్పడ్డ తుఫాను ప్రభావమో కానీ సముద్రం లేని హైదరాబాద్ లో పడవలు వేసుకుని డిజాస్టర్ మేనేజిమెంట్ టీమ్‌లు తిరగాల్సి వచ్చింది. ఎక్కడ చూసినా అతివృష్టి. గ్రామాల్లో పంట నష్టం. ఫలితంగా రైతులు ఆత్మహత్యలు. 2014 నుండి 2019 వరకు 29 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవటం జరిగింది. అందులో ప్రకృతి ప్రకోపించిన కారణాలే ఎక్కువ. 54 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోవడంతో మంచిర్యాల్, సూర్యాపేట, భూపాలపల్లి, జగిత్యాల లాంటి ప్రదేశాలలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. హైదరాబాద్‌లో వర్షం కురిస్తే రోడ్ల మీద చేరిన వరదనీరు మురికి కాలువల పాలవుతుం దే తప్ప ఆ నీటిని ఒడిసిపట్టి వినియోగించుకునే యంత్రాంగాన్ని ప్రభు త్వం చేయలేకపోతోంది. ఇది ప్రభుత్వ వైఫల్యమే. ఇలాంటి ప్రకృతి విపత్తుల నుండి ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకోకపోవడం ఆత్మహత్యా సదృశం.


అయినా పట్టువదలని విక్రమార్కుడిలా యజ్ఞ యాగాదుల్లో ఎలాగైనా హాట్రిక్ కొట్టాలనే ఉద్దేశంతో ఆనాటి ముఖ్యమంత్రి 2023 నవంబర్ లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగం చేశారు. ఈ యాగం ముఖ్య ఉద్దేశం ప్రజా సంక్షేమం, అధిక వర్షపాతం, ప్రజల ఆయురారోగ్యాలు, తెలంగాణ ప్రాంతం పాడిపంటలతో విలసిల్లటం కాదు. రాజశ్యామల యాగం ఉద్దేశం కేవలం మూడవసారి తను అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టటమే. కాబట్టి వర్షం గురించి వరుణ దేవుడిని గాని, మేఘాలను గాని రాగాలతో బాదాల్సిన అవసరం ఆయనకు రాలేదు. సహజంగా రాజరిక వ్యవస్థలో ఒక రాజు మరో రాజుపై యుద్ధానికి వెళ్ళే సమయంలో విజయం కోసం ఈ రాజశ్యామల యాగాన్ని పూర్తి చేసి పూర్ణాహుతితో ముగించేవారని పురాణ ఇతిహాసాలు చెప్తున్నాయి. కాని ఈ హాట్రిక్ కోసం చేసిన రాజశ్యామల యాగం తరువాత తెలంగాణ ప్రజలిచ్చిన తీర్పు పాఠకులకు బాగా తెలుసు. రాజశ్యామల యాగం కూడా ఆయన ఓటమిని ఆపలేకపోయింది. ''అనుకున్నది ఒకటి, అయినది ఒక్కటి, బోల్తా కొట్టిందిలే బుల్ బుల్ పిట్ట'' అంటూ తెలంగాణ ప్రజానీకం రాగాలందుకున్నారు.



మళ్ళీ 2026 లో తెలంగాణలో ఎల్ నినో ప్రభావం ఏర్పడిందని, ఆ ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ప్రభుత్వానికి తెలిపారు. ఇదే విషయాన్ని ఇండియన్ మెటీరియారోలాజికల్ డిపార్టుమెంట్ కూడా ప్రకటించింది. చినుకు కినుక వహించింది. వర్షం కురవనంటూ అలక బూనింది. వరుణుడు తన భార్యా బిడ్డలతో నవగ్రహ సంచారంలో ఉన్నాడు. ఆయన టూర్ ప్రోగ్రాం పూర్తి అయితే గానీ ఇక్కడకు రాడు. తెలంగాణ ముఖ్యమంత్రి అమెరికా టూర్ ప్రోగ్రాంని కేంద్రం అడ్డుకున్నట్లు వరుణుడి ప్రోగ్రాంని ఎవరూ అడ్డుకోలేరు కదా. ఆయన వచ్చేసరికి పరిస్థితులు చేజారిపోతాయేమోనని 10–08–2026న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్షాలు కురవటం కోసం నాగార్జున సాగర్ వద్ద అధికారికంగా వేద పండితులను, ఋత్విజులను పిలిపించి ''ఓం జల బింబాయ విద్మహే నీల పురుషాయ ధీమహీ, తన్నో వరుణః ప్రచోదయాత్'' అంటూ వర్షాన్ని ఆహ్వానిస్తూ ప్రధాన వరుణ మంత్రం జపించి వరుణ యాగాన్ని నిర్వహించారు. కానీ వరుణుడు మాత్రం కరుణించలేదు. ఎలా కరుణిస్తాడు? ఆయన భార్యా బిడ్డలతో టూర్ ప్రోగ్రాం చేస్తున్నాడు కదా? అందువల్ల ఏదో అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయే తప్ప, కుంభవృష్టి కురవలేదు. ముఖ్యమంత్రి చేసిన ఈ వరుణ యాగం కాన్సెప్ట్ ప్రాజెక్టులు, జలాశయాలు నీటితో నిండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతాంగం శ్రేయస్సు కోసం కృష్ణా గోదావరి నదులు జల కళను సంతరించుకోవాలని సంకల్పించుకుంటూ ముఖ్యమంత్రి పూర్ణాహుతి ఇస్తూ యాగాన్ని సమాప్తం చేశారు. ఈ యాగంలో ఆయన స్వార్థం లేదు. అంతా ప్రజా బాహుళ్యమే. అయినా నాగార్జున సాగర్ లో ఉన్న 145.65 టిఎంసిల డెడ్ స్టోరేజి నుండి 312.045 టిఎంసిలకు పెరగలేదు. గత సంవత్సరం ఇదే నెలలో 300 టిఎంసిల నీరు డ్యామ్ లోకి చేరింది. ఏ వరుణ యాగం లేకుండానే, ఏ యజ్ఞ యాగాలు చేయకుండానే జలాశయం జలకళను సంతరించుకుంది.

నేపాల్‌లోని బొటికోషి నది ఉప్పొంగి పరిసరాలను తుడిచి పెట్టటం చూశాం. ఇండోనేషియాలో తుఫాన్ల ప్రభావం చూశాం. అమెరికా హరికేన్స్‌తో అతలాకుతలం అవటం చూశాం. కాని అక్కడెక్కడా యజ్ఞ యాగాదులు జరిపిన దాఖలాలు లేవు. కాని ఈ పుణ్యభూమిలో నీటికి కరువు ఏర్పడటం అత్యంత విచారకరం. ప్రభుత్వ అధినేతలు ఎంతసేపు మతాచారాలతో ప్రభుత్వాలను నడిపించాలనే ఉద్దేశమే తప్ప శాస్త్రీయమైన దృక్పథం లోపించింది. ఇప్పటికిప్పుడు వర్షం పడితే ఆ నీటిని ఒడిసిపట్టడం కోసం ప్రభుత్వం వద్ద ఎటువంటి ప్రణాళికలు ఉన్నట్టు కనిపించడం లేదు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, అపార్టుమెంటులు లాంటి ప్రదేశాల నుండి పడే వాన నీటిని నిలవ చేసే మార్గాలు తయారు చేయాలి. గొలుసుకట్టు చెరువులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబళించకుండా అడ్డుకోవాలి. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు తప్పనిసరి చేయాలి. చెరువులను పూడిక తీసి నీటితో నింపడం వల్ల భూగర్భ జలాలు ఎండిపోకుండా ఉంటాయి. హైదరాబాద్ పరిసరాల్లో ఉండే చెరువులైన ఇబ్రహీంపట్నం, మీర్ ఆలం ట్యాంక్, గండిపేట, హిమాయత్ సాగర్ లలో పూడిక తీసి వరదనీటితో నింపడం వలన నగర ప్రజల దాహార్తి తీరుతుంది. ఆ పరిసరాలలో ఉన్న వారికి తాగునీరు, సాగునీటి కష్టాలుండవు. బిఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చెరువులు పూడికలు తీయించే ప్రయత్నం కొంతమేరకు జరిగింది. కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ 3 సంవత్సరాల కాలంలో ఏ ఒక్క చెరువు కూడా పూడిక తీసిన దాఖలా లు లేవు. అసలు ఆ ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించలేదు. కాకతీయ రాజుల కాలంలో గొలుసుకట్టు చెరువులు తవ్వించి, ఒక చెరువు నిండిన తరువాత మరొక చెరువుకు నీటిని మళ్ళించే జాగ్రత్తలు తీసుకుని, రైతులు ఇబ్బంది పడకుండా, నేల బీటలు వారకుండా, భూగర్భజలాలు ఇంకిపోకుండా వారు చర్యలు తీసుకున్నారు. కాని నేటి మన ప్రభుత్వాలకు ఆ ఆలోచన లేకపోవడం విచారకరం.

# యుద్ధాల కంటే ప్రమాదం...కాలుష్యం



సుంకవల్లి సత్తిరాజు
9704903463

ఎల్‌నినో ప్రభావం వలన మన దేశంలోని పలు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితులు ఏర్పడడానికి గల కారణాలను అధ్యయనం చేసి విరుగు కనిపెట్టవలసిన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉంది. వర్తమాన ప్రపంచంలో కాలు ష్యం ప్రధాన సమస్యగా మారిన నేపథ్యంలో కాలుష్యాన్ని కనీస స్థాయికి తగ్గించాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి. పర్యావర ణ పరిరక్షణ యొక్క ఆవశ్యకతను వివరిస్తూ ఎన్నో అవగాహనా సదస్సులు, ఎన్నో అంతర్జాతీయ సమావేశాలు జరుగుతున్నా పర్యావరణ విధ్వంసం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. పర్యావరణ విధ్వంసంతో మానవ ప్రపంచం విలపిస్తున్నది. ప్రపంచాన్ని పచ్చదనంతో నింపితేనే భూగ్రహాన్ని కాపాడగలం. స్వీడన్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, ఐస్‌లాండ్, డెన్మార్క్, యు.కె, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ వంటి దేశాలు హరిత దేశాలుగా పేర్కొనబడుతున్నాయి. సహజ వనరులను పరిరక్షించి, కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా డెన్మార్క్ గ్రీనెస్ట్ కంట్రీ దిశగా పయనిస్తున్నది. ఖతార్, నైజర్, గ్రీన్‌లాండ్ వంటి దేశాల్లో పచ్చదనం తక్కువగా ఉంది. ధరిత్రిని కలుషిత వ్యర్థాల నుండి కాపాడడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు ప్రపంచాన్ని మళ్ళించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం, అడవులను సంరక్షించడం,పచ్చదనాన్ని పెంపొందించడం వంటి చర్యలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. కాలుష్యాన్ని అరికట్టవచ్చు.

పచ్చదనమే కాలుష్యానికి విరుగుడన్న అవగాహన ప్రజల్లో కలగాలి. పర్యావరణం శరవేగంగా విధ్వంసమౌతూనే ఉంది. మానవ ప్రపంచాన్ని కాలుష్యమనే భూతం వెంటాడుతూనే ఉంది. పెను ప్రమాదం మన ముంగిట్లోనే ఉంది. మన చుట్టూ పంచభూతాలతో ఆవరించి ఉన్న సహజసిద్ధమైన పర్యావరణాన్ని మానవ స్వార్థంతో, తప్పిదాలతో విధ్వంసం చేస్తున్నాం. కాలుష్యాన్ని కొని తెచ్చుకుంటున్నాం. అడవులను నరికి నివాసాలను ఏర్పాటు చేసుకోవడం, పంటభూములను మానవావసరాలకు వినియోగించడం, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఏర్పాటు చేయడం, శిలాజ ఇంధనాలను ఇబ్బడి ముబ్బడిగా వినియోగించడం వలన ధరిత్రిపై కాలుష్యపు క్రీనీడలు కమ్ముకుంటున్నాయి. శిలాజ ఇంధనాల వాడకం వలన, అడవులను ధ్వంసం చేయడం వలన,పారిశ్రామిక విప్లవం వలన వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ మిథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి గ్రీన్ హౌస్ వాయువుల శాతం పెరిగి, భూ ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే 'గ్లోబల్ వార్మింగ్' సమస్య పెరిగి భూమిపై మనుగడ సాగిస్తున్న పలు జీవరాశుల భవిష్యత్తు ప్రశ్నార్థకమౌతుంది.

భూఉష్ణోగ్రతలు పెరగడానికి మానవ తప్పిదాలే కారణం. ప్రకృతిలో లభ్యమయ్యే వనరులను అవసరాలకు మించి వినియోగించడం, ధనాశతో, దురాశతో దూరదృష్టి కోల్పోయి, పర్యావరణానికి చేటుతేవడం మానవ మనుగడకు పెను ముప్పు. కాలుష్యం మధ్య జీవిస్తూ,కలుషితాలను ఆరగిస్తూ, సుఖసౌఖ్యాలను ఆస్వాదిస్తున్నామని భ్రమించడం దురదృష్టకరం. పంచభూతాలు కలుషితమైపోయాయి. పర్యావరణం కాలుష్యంతో నిండిపోయింది. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రాబోవు ప్రళయానికి సంకేతాలు. భూమండలంలో నివసిస్తున్న జీవరాశులు, ఇతర భౌతిక,రసాయనిక సంబంధిత పదార్థాలన్నీ మానవాళి చేత సృష్టించబడలేదు. ఇవన్నీ సహజసిద్ధంగా ఏర్పడి మన చుట్టూ ఆవరించబడి ఉన్నాయి. మానవాళి మనుగడకు మూలాధారమైన ధరిత్రి పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే కాలుష్యాన్ని పారద్రోలాలి. ఇప్పటికే కాలుష్యం వలన మానవాళి ఆరోగ్యం పడకేసింది. ప్రకృతి ప్రకోపించింది. పర్యావరణ విధ్వంసంతో మానవ జీవనం అల్లకల్లోలంగా మారిపోయింది. ప్రపంచంలోను, భారత్‌లోను ఆకస్మాత్తుగా ప్రకృతి ప్రళయాలు సంభవిస్తున్నాయి. రుతురాగాలు అపస్వరాలు వినిపిస్తున్నాయి.

అరణ్యాలు స్థానభ్రంశం చెంది కాంక్రీటు కట్టడాలతో ఆధునిక అరణ్యాలుగా రూపాంతరం చెందుతున్నాయి. సహజ సిద్ధమైన జీవన శైలి నశించింది. భూమిపై మనం వినియోగించే ప్రతీ వస్తువు కాలుష్యానికి కారణభూతం కావడం ఆందోళనకరం. ఇలాంటి పరిస్థితులనుండి మానవాళిని కాపాడడానికి పర్యావరణ పరిరక్షణ ఒక్కటే మార్గం.పర్యావరణ వ్యవస్థను పచ్చదనంతో పునః ప్రతిష్ఠించడానికి ప్రపంచ దేశాలన్నీ చిత్తశుద్ధితో ప్రణాళికలను రూపొందించి, అమలు చేయాలి. మన నిత్య జీవితంలో ఇంధనాల ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇంధనం లేనిదే జన జీవితం దుర్భరం దుర్లభం. అయితే మితిమీరిన ఇంధనాల వాడకం వలన వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కాలుష్య సంబంధిత సమస్యలకు మూలం శిలాజ ఇంధనాల వాడకం విపరీతంగా పెరగడమే. సౌరశక్తి వాడకంపై దృష్టి సారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికం చేయడం పర్యావరణానికి పెద్ద దెబ్బ. ఇప్పుడిప్పుడే 'క్లీన్ ఎనర్జీ' పై దృష్టి సారిస్తున్న దేశాలను ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకోవాలి. బాధ్యతారాహిత్యంగా శిలాజ ఇంధనాలను వినియోగిస్తే ప్రపంచం అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

పెరుగుతున్న భూ ఉష్ణోగ్రతలను రెండు డిగ్రీల సెల్సియస్ దిగువ స్థాయికి తగ్గించడం, సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ కి పరిమితి చేయాలన్న ఆలోచనతో గతంలో పారిస్ ఒప్పందం కుదిరింది. ఐక్యరాజ్య సమితి లోని మెజారిటీ సభ్య దేశాలు వాతావరణ మార్పులపై ఆందోళన చెంది, గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించి, ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి ఫ్రాన్స్ రాజధాని పారిస్ లో ఆమోదించిన ఒప్పందం 2016 వ సంవత్సరం నుండి అమల్లోకి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందాన్ని వ్యతిరేకించడం బాధ్యతారాహిత్యం. బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు మొదలైనవి శిలాజ ఇంధనాలు. భారతదేశంలో బొగ్గు తర్వాత ప్రధాన ఇంధన వనరు పెట్రోలియం. పెట్రోలియం అనే పదం పెట్రా, ఓలియం అనే లాటిన్ పదాల నుండి ఏర్పడింది. పెట్రోలియం అనగా రాతి నూనె అని అర్థం. శిలాజ ఇంధనాలు చెట్లు, జంతువుల అవశేషాల నుండి ఏర్పడతాయి. బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు వంటి శిలాజ ఇంధనాలను వినియోగించిన తర్వాత తిరిగి భర్తీ కావడానికి వేలాది సంవత్సరాల కాలం పట్టవచ్చు. ఇవి తరిగే పోయే శక్తి వనరులు. శిలాజ ఇంధనాల వినియోగంలో చైనా ప్రపంచంలోనే అత్యధిక శాతం వాటా కలిగి ఉంది. అమెరికా కూడా చైనాతో సమానంగా శిలాజ ఇంధనాలు వినియోగిస్తున్నది. ఈ విషయంలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. ఈ మూడు దేశాలు ప్రపంచంలో శిలాజ ఇంధనాల వినియోగంలో సగభాగం కలిగి ఉన్నాయి. కాలుష్య కారకంగా భావిస్తున్న చమురు వినియోగంలో భారత్ చైనా స్థానాన్ని అధిగమించబోతుందనే అంచనాలున్నాయి. బొగ్గు వినియోగంలో భారత్ ఇప్పటికే యూరప్, ఉత్తర అమెరికా దేశాలను అధిగమించింది.

భారత దేశం గ్రీన్ ఎనర్జీ పై దృష్టి సారించాలని నిర్ణయించినా దీనికి తగ్గ కార్యాచరణ పూర్తి స్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. ప్రపంచ ఇంధన వినియోగంలో 80 శాతం పైగా చమురు, బొగ్గు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. చైనా, అమెరికా, భారత్‌ల తర్వాత శిలాజ ఇంధనాల వినియోగంలో రష్యా, జపాన్, ఇరాన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, ఇండోనేషియా, కెనడా, యు. కె లు పోటాపోటీగా ముందుకు సాగుతున్నాయి. కర్బన ఉద్గారాలు గరిష్ఠ స్థాయిలో విడుదలవుతున్నాయి. సూర్య రశ్మి, గాలి, నీరు మొదలైన వనరులను పునరుత్పాదక శక్తి వనరులుగా పిలుస్తారు.

జంతువుల, మొక్కల వ్యర్థాల నుండి ఉత్పత్తి కాబడే ఇంధనాన్ని బయోమాస్ ఎనర్జీ అంటారు. ఇది కూడా పునరుత్పాదక ఎనర్జీ. పునరుత్పాదక శక్తి వనరులను వినియోగించే కొద్దీ తిరిగి భర్తీ చేయబడతాయి.

సౌరశక్తి, గాలి వంటి సహజసిద్ధమైన వనరులను వినియోగించుకుని కాలుష్యాన్ని తగ్గించవచ్చు. వీటి వలన పర్యావరణం కూడా పరిరక్షించబడుతుంది. సూర్యరశ్మి, గాలి వంటి ప్రకృతి సిద్ధమైన వనరుల నుండి లభ్యమ య్యే శక్తి కారకాలను ఇబ్బడి ముబ్బడిగా వినియోగించినా తిరిగి పొందగలం. వీటిని వినియోగించడం వలన కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పునరుత్పాదక శక్తి వనరులతో వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించి, కాలుష్యాన్ని అరికట్టవచ్చు.'క్లీన్ ఎనర్జీ' వలన కాలుష్యాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన ప్రపంచాన్ని నిర్మించవచ్చు

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి..
# ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వానికి సేవలందిస్తున్నారని, వారిని పర్మినెంట్ చేయడం ద్వారానే సరైన న్యాయం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం 'కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి కా ర్మికులను పర్మినెంట్ చేయాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చంద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, నాయకులు వి.ఎస్. బోస్, పి.ప్రేం పావని, ఎన్.కరుణకుమారి తదితరులు పాల్గొని, ప్రసంగించారు.

### ఏజెన్సీలపై క్రిమినల్ కేసులు పెట్టాలి..

ప్రభుత్వానికి యంత్రాంగం, నిధులు, సామర్థ్యం ఉన్నప్పటికీ మధ్యవర్తి ఏజెన్సీలను కొనసాగించడం వల్ల కార్మికులకు నష్టం జరుగుతోందని వెంకట్‌రెడ్డి అన్నారు. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో అక్రమాలు జరుగుతున్నాయని, విధుల్లో లేని వారి పేర్లతో కూడా వేతనాలు స్వాహా చేస్తున్న ఏజెన్సీలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు రుజువైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**లేనివారి పేర్లతో జీతాలు స్వాహా చేస్తున్న ఏజెన్సీలపై క్రిమినల్ కేసులు పెట్టాలి**
**కరీంనగర్ గడ్డ నుంచి సమర శంఖం పూరిద్దాం: చాడ వెంకటరెడ్డి**




### సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి..

కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆయన విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పుల స్ఫూర్తికి అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

### కరీంనగర్ నుంచి సమర శంఖం..

ప్రతి ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను సేకరించి, రెగ్యులర్ ఉద్యోగులతో పోల్చి వేతనాలు, సదుపాయాలపై అధ్యయనం చేయాలని వెంకట్‌రెడ్డి సూచించారు. కరీంనగర్‌లో జరగనున్న ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల్లో వేలాది మంది కార్మికులను ఐక్యం చేసి సమర శంఖం పూరిద్దామని పిలుపునిచ్చారు. ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం తక్కువ వేతనాలు ప్రకటించడం పట్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర 4వ మహాసభల్లో కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

# తెలంగాణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు, ఆయిల్‌పామ్ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి

- ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ్ కింద తెలంగాణకు అదనంగా ఇళ్లు కేటాయించాలి
- కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, డాక్టర్.పెమ్మసాని చంద్రశేఖర్‌లకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రైతుల ప్రయోజనాలు లక్ష్యంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు కీలక డిమాండ్లను కేంద్ర మంత్రుల ముందుంచారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం వ్యవసాయ రంగం, రైతుల సమస్యలపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు , ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ కింద తెలంగాణకు అదనంగా ఇళ్ల కేటాయింపులకు సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్.పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు.ఆయిల్‌పామ్ రైతులకు క్వింటాల్‌కు రూ.25 వేల కనీస హామీ ధర, పప్పుధాన్యాలు–నూనెగింజల 100 శాతం సేకరణ, జొన్న–మొక్కజొన్నల కేంద్ర సేకరణతో పాటు రాష్ట్రానికి అదనపు వ్యవసాయ నిధులు, పరిశోధనా సదుపాయాలు కల్పించాలని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. తెలంగాణలో కొబ్బరి సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాంతీయ



కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని దీంతో రైతులకు నాణ్యమైన నాటు సరకులు, సాంకేతిక మార్గదర్శకత్వం, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపడతాయని వివరించారు. అలాగే ఐసిఎఆర్–ఐఐఒపిఆర్‌కు అనుబంధంగా తెలంగాణలో ప్రాంతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు ధరల భద్రత కల్పించేందుకు తాజా పండ్ల గెలలకు కనీస హామీ ధరను క్వింటాల్‌కు రూ.25 వేలుగా నిర్ణయించాలని కేంద్ర మంత్రిని కోరారు. తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే పప్పుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రస్తుతం కేంద్ర పథకాల కింద పప్పుధాన్యాలు, నూనెగింజల సేకరణపై ఉన్న 25 శాతం పరిమితిని 100 శాతానికి పెంచాలని కోరారు. కందులు, పెసలు, మినుములు, శనగలతో పాటు నూనెగింజలను పూర్తిస్థాయిలో సేకరించడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర, మార్కెట్ భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు. పప్పుధాన్యాల సేకరణపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించగా, జొన్న, మొక్కజొన్న సేకరణ అంశాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పిఎంఆర్‌కెవివై–పర్ డ్రాప్ మోర్ క్రాప్ కార్యక్రమం కింద తెలంగాణకు కేటాయింపులను పెంచాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. కేంద్రం ముసాయిదా విత్తన చట్టాన్ని తీసుకొచ్చి తొమ్మిది నెలలు గడిచిన నేపథ్యంలో, తెలంగాణ సూచించిన సవరణలను పరిగణనలోకి తీసుకుని నకిలీ, నాసిరకం విత్తనాలను అరికట్టేలా సమగ్ర విత్తన చట్టాన్ని త్వరితగతిన అమలులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ కింద తెలంగాణకు అదనంగా ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో తొలి దశలో 1,300 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని, మండలంలో దాదాపు 9 వేల ఎస్‌టి కుటుంబాలతో పాటు ఇతర పేద, అర్హులైన కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నందున అదనపు ఇళ్లు కేటాయించాలని కోరారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు.

## 4న మాంసం దుకాణాలు బంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 4న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గొర్రెలు, మేకలు, పశువుల కబేళాలతో పా టు రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని జిహెచ్‌ఎంసి ఆదేశించింది. జిహెచ్‌ఎంసి చట్టం 1955 లోని సెక్షన్ 533(బి) కింద ఈ మేరకు నోటీసు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. జన్మాష్టమి పర్వదిన ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆదేశాలను సమర్థవంతం గా అమలు చేసేందుకు మున్సిపల్ అధికారులకు సహకరించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్లను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా రహస్యంగా మాంసం విక్రయాలు జరిపినా, పశువధకు పాల్పడినా కఠిన చర్యలు ఉం టాయని హెచ్చరించారు.

## ట్రాఫిక్ రద్దీ శాశ్వత పరిష్కారానికి మరో కీలక అడుగు

నేడు సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న నల్గొండ ఎక్స్‌రోడ్స్-సైదాబాద్-ఒవైసి జంక్షన్ కారిడార్ : మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం దిశగా మరో కీలక అడుగు పడనుంది. నల్గొండ 'ఎక్స్' రోడ్స్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ మీదుగా ఓవైసి జంక్షన్ వరకు రూ. 620 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన కాన్ఫ్లిక్ట్ ఫ్రీ కారిడార్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేడు (సెప్టెంబర్ 3) ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొత్తం 3.23 కిలోమీటర్ల పొడవుతో ఈ కారిడార్‌ను నిర్మించారు. ఇందులో 2.53 కిలోమీటర్ల ప్రధాన వయాడక్ట్‌తో పా టు ఐఎస్ సదన్ జంక్షన్ నుంచి 200 మీటర్ల అప్ ర్యాంప్ నిర్మించారు. చంచల్‌గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ ప్రాంతాలను కలుపుతూ ఈ కారిడార్ ఏర్పాటు చేశారు. ఈ మార్గం అందుబాటులోకి రావడంతో నల్గొండ 'ఎక్స్' రోడ్స్ నుంచి ఓవైసి ఆసుపత్రి వరకు సిగ్నల్ రహిత ప్రయాణం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రా ఫిక్ అవసరాలకు అనుగుణంగా ఫ్లైఓవర్లు, వంతెనలు, కాన్ఫ్లిక్ట్ ఫ్రీ కారిడార్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్య త ఇస్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# వైద్య కళాశాల, జిజిహెచ్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి
- సింగూరు కాలువల లైనింగ్ కట్ట మరమ్మతు పనులను వేగవంతం చేయాలి : మంతి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నర్సింగ్ కళాశాలల్లో అవసరమై మౌలిక వసతులు సౌకర్యాలను కల్పించి ప్రజలకు విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రభుత్వ మెడికల్ కళాశాల సంగారెడ్డి, జోగిపేట, నర్సింగ్ కళాశాలలు ఆర్ అండ్ బి నీటి పారుదల శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపనులు ,మౌలిక వసతులు అవసరమైన పరికరాలు నిర్వహణ పెండింగ్ పనులు భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, గర్ల్స్ ,బాయ్స్ హాస్టళ్లో అవసరమైన సౌకర్యాలు పరికరాలు చేపట్టాల్సిన అదనపు పనులపై కళాశాల ప్రిన్సిపాల్‌ను మంత్రి అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసానికి అనుకూలమైన ఆహ్లాదకరమైన వాతీవరణాన్ని కల్పించాలని సూచించారు. జిజిహెచ్‌లో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, వాటి నిర్వహణ భవన నిర్వహణ ,రోగుల సంరక్షణ, పారిశుద్ధ్యం,సెక్యూరిటీ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను జిజిహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల హాస్టళ్లు జిజిహెచ్‌కు సంబంధించిన వార్షిక నిర్వహణ అవసరాలను కళాశాల ప్రిన్సిపాల్ జిజిహెచ్ అధికారలతో సమన్వయం చేసుకుని ఒక్కో అంశాన్ని గుర్తించి అవసరమైన పనులకు ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. సంగారెడ్డి జోగిపేట నర్సింగ్ కళాశాలల అభివృద్ధి పనులు నర్సింగ్ హాస్టళ్ల పురోగతి విద్యార్థుల సంఖ్య టీచింగ్ ప్యాకల్టీ అవసరమైన పరికరాలు, వసతి సౌకర్యాలు తదితర అంశాలపై సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లను మంత్రి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన పరికరాలు మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు ప్రశాంతమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా నర్సింగ్ మెడికల్ కళాశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ నెల 17న సంగారెడ్డి నర్సింగ్ కళాశాల నిర్సింగ్ హాస్టల్ మెడికల్ కళాశాల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులతో సింగూరు ప్రాజెక్టు పరిధిలోని కాలువల లైనింగ్ పనులు కట్ట మరమ్మతులు ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్ ఫ్లో డెడ్ స్టోరేజ్ సగటు నీటి మట్టం నీటీ నిల్వ సామ ర్థ్యం పూర్తియిన పనులు ఇంకా అవసరమైన నిధులపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. కాలువల లైనింగ్ ,కట్టమరమ్మతు పనుల్లో ఏలాంటి జాప్యం లేకుండా వేగవంతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు , సబ్ కలెక్టర్ ఉమా హారతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, జిజిహెచ్ సూపరింటెండెం ట్ మురళీకృష్ణ, మెడికల్ నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆర్అండ్ బీ నీటిపారుదల శాఖల అధికారులు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

**1000 రోజుల కాంగ్రెస్ పాలనలో**

# విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు

**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి1000 రోజులు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఉచిత వైఫై, రూ.5లక్షల విద్యా భరోసా కార్డు, బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధుల కేటాయింపు, ఒకేసారి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిలను ఒకేసారి విడుదల చేస్తాం అని ప్రకటించిందన్నారు. విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూస్తున్నా ఇందులో ఏ ఒక్కటిని కూడ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ అయి, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని, హాస్టల్లో పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రవేట్ విద్యాసంస్థల ఫీజుల అరికట్టాలని, పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయవద్దని విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నా రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం కాక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయినా ప్రభుత్వం మాత్రం ప్రకటనలకే పరిమితమువతోంది తప్ప హామీల అమలుపై స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. 1000 రోజుల పాలన పూర్తైనా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని,వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు ఇచ్చిన అన్ని ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## వెయ్యి రోజుల్లో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

**ఆరు గ్యారంటీల పేరుతో చీటింగ్.. 420 హామీల అమలులో విఫలం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి, 420 హామీల అమలులోనూ విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు, పిఆర్‌సి, డిఎలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఏటా రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల భృతి, జాబ్ క్యాలెండర్ హామీలను అమలు చేయలేదన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ హామీల్లోనూ ప్రభు త్వం విఫలమైందన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమ పథకాల విషయంలో నూ హామీలకు, అమలుకు పొంతన లేదన్నారు. తెలంగాణ అమరవీరుల కు టుంబాలు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. వెయ్యి రోజుల్లో ఎన్ని హామీలు అమలు చేశారో, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నారాయణగూడలోని బిజెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి బి.కాం. (ఫైనాన్స్) సబ్జెక్టులో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కెప్టెన్ ఎం.విజయకుమార్ తెలిపారు.కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 3 వ తేదీ (గురువారం) లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ప్రిన్సిపల్ కోరారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (ఎల్ఎ) శాఖ
జిల్లా కలెక్టర్ :: మహబూబ్‌నగర్
ఫారం-VII
డిక్లరేషన్
రూల్-25 యొక్క సబ్ రూల్ (1) మరియు 2013 నాటి యాక్ట్-30 యొక్క సెక్షన్ 19 (1) చూడండి.

No. REV/LAG/0019/2026-G-Section తేదీ: 28.07.2026

మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఘన్‌పూర్ బ్రాంచ్ కెనాల్‌పై Minor-15R తవ్వకం అనే ప్రజాప్రయోజనం కోసం మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ మండలం కప్పెట గ్రామంలో మొత్తం విస్తీర్ణం ఎ.11.17 గుంటల భూమి అవసరమని తెలంగాణ ప్రభుత్వం / కలెక్టర్‌కు తోచింది.

కాబట్టి మహబూబ్‌నగర్ జిల్లా, భూత్‌పూర్ మండలం, కప్పెట గ్రామంలో పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం సేకరించబడుతున్న ప్రామాణిక కొలత ప్రకారం దాదాపు ఎ.11.17 గుంటల భూమికి సంబంధించిన పూర్తి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

గ్రామం : కప్పెట మండల్ : భూత్‌పూర్ జిల్లా : మహబూబ్‌నగర్

| క్ర.సం. | సర్వే నం. | మెట్ట/తరి/మాగాణి | భూమి రకం | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం (ఎ.గుంటలు) | ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 304 | మెట్ట | పట్టా | 0.20 | M. నాగయ్య S/o కర్రెన్న | 305 | 302 | 301 | 304 | | |
| 2 | 304 | మెట్ట | పట్టా | 0.16 | కర్రెన్న S/o నర్సయ్య | 305 | 302 | 301 | 304 | | |
| 4 | 305 | మెట్ట | పట్టా | 0.04 | కర్రెన్న S/o నర్సయ్య | 306 | 304 | 315 | VB | | |
| 5 | 315 | మెట్ట | పట్టా | 0.28 | బి. పార్వతమ్మ W/o రాములు | 306 | 304 | 315 | VB | | |
| 6 | 315 | మెట్ట | పట్టా | 0.06 | బి. చెన్నయ్య S/o కూర్మయ్య | 306 | 304 | 315 | VB | | |
| 7 | 316 | మెట్ట | పట్టా | 0.20 | బి. నాగయ్య S/o బుచ్చన్న | 320 | 301 | 317 | 315 | | |
| 8 | 316 | మెట్ట | పట్టా | 0.04 | చౌదయ్య S/o చంద్రయ్య | 320 | 301 | 317 | 315 | మర్రి | |
| 9 | 317 | మెట్ట | పట్టా | 0.01 | బి. ఖాదరమ్మ W/o వెంకటయ్య | 319 | 300 | 296 | 316 | | |
| 10 | 317 | మెట్ట | పట్టా | 0.21 | బి. చిన్న చంద్రమ్మ W/o రాములు | 319 | 300 | 296 | 316 | | |
| 11 | 319 | మెట్ట | పట్టా | 0.02 | బి. చిన్న చంద్రమ్మ W/o రాములు | 321 | 317 | 323 | 316 | | |
| 12 | 319 | మెట్ట | పట్టా | 0.15 | బి. బాల్ నాగయ్య S/o కర్రెన్న | 321 | 317 | 323 | 316 | | |
| 13 | 319 | మెట్ట | పట్టా | 0.31 | R. సహదేవ్ S/o రామయ్య | 321 | 317 | 323 | 316 | | |
| 14 | 323 | మెట్ట | పట్టా | 0.01 | బి. బాలస్వామి S/o కర్రెన్న | 322 | 318 | 325 | 319 | ఈత | |
| 15 | 318 | మెట్ట | పట్టా | 0.03 | బి. లక్ష్మ మ్మ W/o శ్రీనివాసులు | | | | | | |
| 16 | 318 | మెట్ట | పట్టా | 0.31 | సౌట శ్రీశైలం S/o పెద్ద మల్లయ్య | | | | | | |
| 17 | 326 | మెట్ట | పట్టా | 0.07 | సౌట చిన్న మల్లయ్య S/o నాగయ్య | 285 | 290 | 288 | 327 | | |
| 18 | 326 | మెట్ట | పట్టా | 1.14 | తూమ్ ప్రభాకర్ రెడ్డి S/o పాండా రెడ్డి | 285 | 290 | 288 | 327 | | |
| 19 | 289 | మెట్ట | పట్టా | 0.23 | కళాసౌధ ఇన్ఫ్రా డెవలపర్లు అన్నమ్ కళ్యాణ్ ద్వారా LLP | 285 | 290 | 288 | 327 | | |
| 20 | 288 | మెట్ట | పట్టా | 0.27 | కళాసౌధ ఇన్ఫ్రా డెవలపర్లు అన్నమ్ కళ్యాణ్ ద్వారా LLP | 286 | 291 | 287 | 289 | | |
| 21 | 287 | మెట్ట | పట్టా | 0.09 1/2 | కళాసౌధ ఇన్ఫ్రా డెవలపర్లు అన్నమ్ కళ్యాణ్ ద్వారా LLP | 287 | VB | 277 | 291 | | |
| 22 | 278 | మెట్ట | పట్టా | 0.27 | కళాసౌధ ఇన్ఫ్రా డెవలపర్లు అన్నమ్ కళ్యాణ్ ద్వారా LLP | 287 | VB | 277 | 291 | | |
| 23 | 279 | మెట్ట | పట్టా | 0.10 | కళాసౌధ ఇన్ఫ్రా డెవలపర్లు అన్నమ్ కళ్యాణ్ ద్వారా LLP | 280 | 277 | 276 | 278 | | |
| 24 | 276 | మెట్ట | పట్టా | 0.13 1/2 | కళాసౌధ ఇన్ఫ్రా డెవలపర్లు అన్నమ్ కళ్యాణ్ ద్వారా LLP | 275 | 265 | 266 | 279 | | |
| 25 | 266 | మెట్ట | పట్టా | 0.29 | కళాసౌధ ఇన్ఫ్రా డెవలపర్లు అన్నమ్ కళ్యాణ్ ద్వారా LLP | 268 | 265 | 264 | 276 | | |
| 26 | 265 | మెట్ట | పట్టా | 0.17 | మారం చంద్రశేఖర్ రెడ్డి S/o కృష్ణా రెడ్డి | 266 | VB | 263 | 277 | | |
| 27 | 264 | మెట్ట | పట్టా | 0.01 | కళాసౌధ ఇన్ఫ్రా డెవలపర్లు అన్నమ్ కళ్యాణ్ ద్వారా LLP | 267 | 263 | 262 | 266 | | బోర్ |
| 28 | 263 | మెట్ట | పట్టా | 0.36 | మారం చంద్రశేఖర్ రెడ్డి S/o కృష్ణా రెడ్డి | 264 | VB | 263 | 265 | | బోర్ |
| | మొత్తం : 11.17 | | | | | | | | | | |

2013నాటి చట్టం నెంబర్ 30లోని సెక్షన్ 15 ప్రకారం ఆసక్తిగల వ్యక్తుల అభ్యంతరాలు విన్న తర్వాత, మరియు తగిన విచారణ జరిపిన అనంతరం, ఈ ప్రకటన చేయబడింది.

భూసేకరణ కారణంగా ఏ కుటుంబాలకూ పునరావాసం కల్పించాల్సిన అవసరం లేదు. సదరు భూమి కింద లేదా ఆ భూమిలోని ఏదైనా నిర్దిష్ట భాగం కింద ఉన్న బొగ్గు, ఇనుప ఖనిజం, స్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు : అయితే భూమిని సేకరిస్తున్న ప్రయోజనం కోసం ప్రాజెక్ట్ నిర్మాణ దశల్లో తవ్వడానికి, తొలగించడానికి లేదా ఉపయోగించడానికి అవసరమైన లేదా అక్కరలేని గనులు మరియు ఖనిజాల భాగాలు దీనికి మినహాయింపు ఇవ్వడమైనది.

భూమి యొక్క ప్రణాళికను మహబూబ్‌నగర్‌లోని ఇరిగేషన్ ప్రాజెక్ట్ యూనిట్-II, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R కార్యాలయంలో ఏ పనిదినంలోనైనా పరిశీలించవచ్చు.

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎల్ఎ ఆర్&ఆర్ యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్టు మహబూబ్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ మహబూబ్‌నగర్
సం/- ఖుష్బూ గుప్తా,IAS జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్

DIPR RO NO. 803/LA/PP/Advt/Pub/2026-27



తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, మిషన్ భగీరథ సర్కిల్ :: ఖమ్మం
(ఎస్.సి. బాయ్స్ హాస్టల్ పక్కన, రామాలయం వీధి, ఎన్.ఎస్.పి. క్యాంప్, ఖమ్మం)

టెండర్ నోటీసు నం. 08 to 14/2026-27, తేదీ: 31.08.2026

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా అర్హులైన సివిల్ కాంట్రాక్టర్ల నుండి ఈ క్రింది పనులకు బిడ్లు ఆహ్వానించడమైనవి: 1) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో TDWSCL గ్రాంట్ కింద, గోదావరి దుమ్ముగూడెం విభాగం పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎలక్ట్రికల్ సబ్-స్టేషన్లు మరియు ట్రాన్స్‌ఫార్మర్ యార్డుల నిర్వహణ (వివిధ ప్రాంతాలలో 5 పనులు); 2) ఖమ్మం జిల్లాలో TDWSCL గ్రాంట్ కింద, వైరా విభాగం పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎలక్ట్రికల్ సబ్-స్టేషన్లు మరియు ట్రాన్స్‌ఫార్మర్ యార్డుల నిర్వహణ (వివిధ ప్రాంతాలలో 1 పని - ST వర్గానికి కేటాయించబడింది); మరియు 3) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి మండలం, చింతోనిచెల్క గ్రామ పంచాయతీ పరిధిలోని చింతోనిచెల్క తండా (హ్యాబిటేషన్) వద్ద DMFT గ్రాంట్ కింద 20 KL సామర్థ్యం గల ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (OHSR) నిర్మాణం (SC వర్గానికి కేటాయించబడింది). టెండర్ షెడ్యూల్ వివరాలు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో 07.09.2026 నుండి 21.09.2026 మధ్యాహ్నం 3:00 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. బిడ్లు 21.09.2026 సాయంత్రం 4:00 గంటలకు తెరవబడతాయి.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ సర్కిల్, ఖమ్మం

DIPR R.O. No. : 9102-PP/CL/ADVT/2026-27, Date: 02-09-2026



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : సికింద్రాబాద్ జోన్

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| టెండర్ నోటీసు నెం. 13/EE-II/Cir-44/SBZ/GHMC/2026-27, తేది: 01.09.2026 | సివిల్ పనులు : 4 నెం.లు | రూ. 6.38 లక్షలు | 02.09.2026 మ.2.30 గం.ల నుండి 07.09.2026 మ.2.30 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - II, సర్కిల్-44, మెట్టుగూడ. సెల్ నెం. 9704405076 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-44, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 9111-PP/CL/ADVT/2026-27, Date: 02-09-2026



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్.

షార్ట్ టెండర్ నోటీసు నెం. 29/EE.Div.NO.28/GHMC/2026-27, తేది: 02.09.2026

| NIT No. | పని వివరణ | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| షార్ట్ టెండర్ నోటీసు నెం. 29/EE.Div. No. 28/GHMC/2026-27, తేది: 02.09.2026 | నిర్వహణ పనులు: (01) నెం. | రూ. 1.50 లక్షలు | ప్రారంభ తేది: 02.09.2026 మ.03.00గం.లకు, స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 03.09.2026 మ.03.00గం.ల వరకు | శ్రీమతి ఆర్.ఇందిరా బాయి, సెల్ నెం. 9963025505 |

పనుల వివరాల కాపీ జత చేయబడినది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-28, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 9178-PP/CL/ADVT/2026-27, Date: 02-09-2026



కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

| NIT No. | పని పేరు | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|
| టెండర్ నోటీసు నెం. 17/CE/QQSUDA/2026 | "హైదరాబాద్‌లోని ఓల్డ్ సిటీలో హెరిటేజ్ విలువలకు సంబంధించిన (8) నంబర్ల గేట్‌వేలు / కమాన్ల పునరుద్ధరణ మరియు పునరుద్ధరణ పనుల కోసం DPR తయారీకి సంబంధించిన కన్సల్టెన్సీ సేవలు. 1. రాణి గంజ్ కమాన్, 2. షేక్ ఫైజ్ కమాన్, 3. చత్తా బజార్ కమాన్, 4. దేవాన్ దేవ్డీ కమాన్, 5. దేవాన్ దేవ్డీ కమాన్-II, 6. డబీర్‌పురా కమాన్, 7. హుస్సేనీ ఆలం కమాన్, మరియు 8. హిమ్మత్ గంజ్ కమాన్ గేట్" | 1. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 04.09.2026 మ.3.30గం.లకు, 2. డౌన్‌లోడ్ ఆఖరి తేది: 18.09.2026 మ.3.30గం.ల వరకు, 3. బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 18.09.2026 సా.4.00గం.ల వరకు, 4. ప్రైస్ బిడ్ ప్రారంభ తేది: 18.09.2026 సా.4.30గం.లకు. | శ్రీ బి.గోపాల్, CE, QQSUDA, దారుల్‌షిఫా, హైదరాబాద్. సెల్ నెం. 9121240341, 9494462121 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- చీఫ్ ఇంజనీర్, QQSUDA

DIPR R.O. No. : 9141-PP/CL/ADVT/2026-27, Date: 02-09-2026




## దొంగతనం కేసులో ముగ్గురి అరెస్ట్

**ప్రజాపక్షం/వెంకటాపురం (నూగురు) :** వెంకటాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో గత సంవత్సరం దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వెంకటాపురం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం ఏప్రిల్ 13వ తేదీన మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ బంక్ సమీపంలో గల సంకా వేమసుందర్ గారి ఇంటి తాళం పగలగొట్టి వెండి, బంగారు అభరణాలు, 10,000 దొంగిలించినట్లు తెలిపారు. బుధవారం ఎస్ఐ తమ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నిందితులను పట్టుకున్నారు. నిందితులు పుప్పాల సాయిప్రకాష్, ప్రవీణ్ చంద్ర భంజ్‌దేవ్ గతంలో ఒక ట్రాక్టర్ దొంగతనం కేసులో జైలులో ఉండగా దుబ్బకట్ల మనోజ్ అనే వ్యక్తి పరిచయం కాగా దొంగలించిన సోత్తును అమ్మడానికి సహకరించమని కోరగా అతడు ఒప్పుకోని తనకి తెలిసిన శ్యామల శ్రీనివాస్ ద్వారా అమ్మకానికి పథకం పన్ని వారిని కలవడానికి నిందితులు బుధవారం వెంకటాపురం రాగా పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. నిందితులు నేరం అంగీకరించడంతో పోలీసులు వారి వద్ద ఉన్న వెండి, బంగారు అభరణాలు స్వాధీనపరుచుకున్నారు.

## కెజిబివిల్లో 18 పోస్టుల భర్తీకి దరఖాస్తులు

### ములుగు జిల్లావాసులకే అవకాశం.. 10 వరకు గడువు

**ప్రజాపక్షం/ములుగు :** జిల్లాలోని వివిధ 8 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు(కేజిబివిలు), బండారుపల్లిలోని టిజిఎంఎస్ బాలికల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న 18 పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్దార్థ రెడ్డి తెలిపారు. నిర్దేశిత విద్యార్హతలు కలిగి, ములుగు జిల్లా వాస్తవ్యులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను సెప్టెంబర్ 3 నుండి 10వ తేదీ సాయంత్రం 3గంటల వరకు సంబంధి మండల కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. ఏఎన్ఎం పోస్టుకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోనే సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పోస్టుల వారీగా విద్యార్హతలు, ఖాళీల వివరాలు జత చేసిన ప్రకటనలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం జిఈసిఓ బి రజితను 9666294715 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు.


## నిర్దేశించిన గడువులోపు 'సర్' ప్రక్రియ



**ప్రజాపక్షం/జనగామ :** ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్దేశించిన గడువులోపు పకడ్బందిగా పూర్తి చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం జనగామ జిల్లాలోని నర్మెట మండలం బొమ్మకూర్, రఘునాథపల్లి మండలంలోని గిద్దెబండ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ పక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల వివరాల పరిశీలన, మ్యాపింగ్, దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బిఎల్ఓలు ఎంత మంది ఉన్నారు. గ్రామంలో ఎన్ని నోటీసులు ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు సమర్పించే జిరాక్స్ ప్రతులను క్షుణంగా పరిశీలించాలని, ప్రతి జిరాక్స్ కాపీపై సంబంధిత వ్యక్తుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల ఇంటి పేర్లు, చిరునామా తదితర వివరాలు నిశితంగా పరిశీలించాలని, ఎన్నికల కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి, నర్మెట తహశీల్దార్లు రాజేష్, కెవి చారీ, బిఎల్ఓలు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఉపాధ్యాయులను ఆదేశించారు. నర్మెట మండలంలోని మచ్చుపహాడ్ గ్రామంలో జడ్పిహెచ్ఎస్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, వంటశాల, పాఠశాల అవరణను పరిశీలించారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశ్వినితో పాటు పలువురు పాల్గొన్నారు. జిల్లాలో రెండు పడకల ఇళ్ల కేటాయింపు జాబితా పారదర్శకంగా నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిసిపి రాజమహేంద్రనాయక్‌తో కలిసి గృహ నిర్మాణ శాఖ అధికారుతలో సమీక్షించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ ఎడి మాతృనాయక్, డిఈలు, ఎఈలు పాల్గొన్నారు.

## గోదావరి, కృష్ణా జలాలు చంద్రబాబుకు బహుమానం

### జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్ర విమర్శలు



**ప్రజాపక్షం/జనగామ :** కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని 6 గ్యారెంటీలు, 420 హామీలు ఏమయ్యాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. తన గురువు చంద్రబాబునాయుడుకు గోదావరి, కృష్ణా జలాలను రేవంత్‌రెడ్డి బహుమానం ఇచ్చి తెలంగాణను ఎడారి చేస్తున్నరని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సెక్రటరీ అధిత్యనాథ్ దాస్‌కు ఇద్దరు చోద్యం చేస్తున్నారే తప్ప నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లు నింపడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన సందర్భంగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. ఇంటింకీ భాకీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం జనగామలోని పల్లా క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి బోగస్ మాటలు తప్ప ఒక్కరి అమలు చేయలేదన్నారు. 22ఎ పేరుతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి నలుగురు బ్రదర్స్ దోచుకు తింటున్నారన్నారు. ఈ మున్సిపల్ మాజీ ఛైర్మన్ పోకల జమున, మున్సిపల్ వైస్ ఛైర్మన్ భూష పర్వతాలు, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, పెద్ది రాజిరెడ్డి, జనగామ పఅధ్యక్షులు తాళ్ల సురేష్ రెడ్డి, బాల్నె సిద్దిలింగం, కౌన్సిలర్లు సుగుణాకర్, సువా మాజీ కౌన్సిలర్ వాంకుడోతు అనిత, పేర్ని స్వరూపతో పాలు పలువురు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల్లో అభివృద్ధికి పెద్దపీట

### కాంగ్రెస్ పాలనపై మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా గోవిందరావుపేటలో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దనసరి సీతక్క ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల ఆశోక్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణుకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ లక్నవరం జలాశయంలోకి అవసరమైన నీటిని విడుదల చేయడంతో పాటు గోదావరి జలాలను లక్నవరం జలాశయంలోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపడుతామన్నారు. మండలాన్ని కరువు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో నూతన బస్టాండ్ ఏటూరునాగారం ఆర్టీసీ డిపో నూతన కలెక్టరేట్ మెడికల్ కాలేజీ రహదారులు వంతెనలు పైలాన్ స్థూపం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాలడుగు వెంకటకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల మహిళలు పేదలు యువత బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి గ్రామంలోని ప్రతి కుటుంబానికి వివరించాలని కోరారు. రైతు సంక్షేమమే ప్రాధాన్యత రైతులకు రూ.2లక్షల వరకు పంట రుణమాఫీ రైతు భరోసా పంటల కొనుగోళ్ల సన్నధాన్యానికి బోనస్ ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వెంకటకృష్ణ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల ఆశోక్ మాట్లాడుతూ మంత్రి సీతక్క నాయకత్వంలో ములుగు జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేస్తాయని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మంత్రి సీతక్క జిల్లా అధ్యక్షుడు ఆశోక్ ఇతర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు రైతులు మహిళలు విద్యార్థులు బలహీన వర్గాల కోసం వైఎస్సార్ చేసిన సేవలను స్మరించుకున్నారు.

**నూతన గ్రామ కమిటీ అధ్యక్షుల నియామకం**

సమావేశంలో మండలంలోని పలు గ్రామాలకు నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులను ప్రకటించి వారికి పార్టీ కండువాలు కప్పి బాధ్యతలు అప్పగించారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, స్టేట్




డైరక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, కాసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, కార్మిక శాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి ఇస్సార్ ఖాన్, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సూమన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారం నాయక్, సహకార సంఘం అధ్యక్షుడు పన్నాల ఎల్లారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తేళ్ల హరిప్రసాద్, చాపల రమాదేవి, సూదిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జంపాల చంద్రశేఖర్, చింత క్రాంతి, భైరి అబిలాష్, చొప్పదండి వసంత భూక్యరాజు తదితరులతో పాటు నూతన గ్రామ కమిటీ అధ్యక్షులు మహిళా యువజన నాయకులు ప్రజాప్రతినిధులుఅనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## డిజిటల్ లావాదేవీలపై అవగాహన

### జిడబ్ల్యుఎంసి అదనపు కమిషనర్ జోనా

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అర్హులైన వీధి వ్యాపారులకు పిఎం స్వనిధి పథకం ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డిడబ్ల్యుఎంసి అదనపు కమిషనర్ జోనా తెలిపారు. కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తెలంగాణ మెప్మా ఆధ్వర్యంలో జిడబ్ల్యుఎంసి కార్యాలయ ఆవరణంలోని మెప్మా భవనం మొదటి అంతస్తులో సెప్టెంబర్ 1 నుండి 30 వరకు లోన్ కల్యాన్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న పిఎం స్వనిధి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త రుణ దరఖాస్తులను స్వీకరించి ప్రాసెస్ చేయనున్నట్లు తెలిపారు. వీధి వ్యాపారులకు యూపిఐ, క్యూఆర్ కోడ్ ద్వారా డిటిటల్ చెల్లింపులు, పిఎం స్వనిధి మొబైల్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రెండవ విడత రుణం చెల్లించిన అర్హులైన వ్యాపారులకు క్రెడిట్ కార్డు సదుపాయం కల్పించడంతో పాటు ఆర్థిక భద్రత, బీమా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల సామాజిక, ఆర్థిక ప్రొఫైలింగ్ చేపట్టి వివిధ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేయనున్నట్లు జోనా తెలిపారు. అర్హులైన వీధి వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అధికారం పోయిందన్న అక్కసుతోనే బిఆర్ఎస్ విమర్శలు

### వరంగల్ ఎంపి కావ్య, ఎమ్మెల్యే రావూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** అధికారం కోల్పోయామన్న అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై పదేపదే విమర్శలు చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కనీసం రెండుమూడేళ్లు కూడా ఓపికగా ఉండలేకపోతోందని విమర్శించారు. "మా సమయం వస్తుంది" అని ఓపికగా వేచి చూడకుండా.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేక ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై విమర్శలు చేయడం వారి అధికార దాహాన్ని బయటపెడుతోంది అని అన్నారు. హనుమకొండ డీసీసీ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ "పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలు గుర్తుకు రాలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయిన రెండు మూడేళ్లకే ఓపిక నశిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులకు ప్రజలు తీర్పు ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారు. ఇది ప్రజలపై ప్రేమ కాదు.. అధికారం కోల్పోయామన్న అక్కసు, తిరిగి అధికారం కోసం పడుతున్న ఆరాటం" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు తాము చేసిన పనులే ప్రోగ్రెస్ రిపోర్ట్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు రాజకీయ అనుభవం ఉందని, ఆయన నిర్మాణాత్మక విమర్శలు చేస్తే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు.ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని, అధికార పక్షమైనా ప్రతిపక్షమైనా తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించేందుకు ప్రతిపక్షాలు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ ఆయూబ్, వరంగల్ మార్కెట్ చైర్మన్ ప్రియాంక, జిల్లా కాంగ్రెస్ నాయకులు మార్క విజయ్ కుమార్, వెంకట్ పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా ఆలయ పునరుద్ధరణ పనులు

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** కాళేశ్వరం క్షేత్రంలో వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం దేవాలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం దేవాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సందర్శించి ఆలయ పునర్నిర్మాణం అభివద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం క్షేత్రంలో వచ్చే ఏడాది జూన్ మాసంలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అభివద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం పనులు మే నెల వరకు పూర్తయ్యేలా అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి నెలా పూర్తి చేయాల్సిన పనులకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాలు, టైమ్‌లైన్ రూపొందించుకొని వాటి ప్రకారం పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు,కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించుకుని పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, గుత్తేదార్లు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆది ముక్తీశ్వర స్వామి వారిని, బాలాలయంలో ఏర్పాటు చేసిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు కలెక్టర్‌కు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.



## పకడ్బందీగా భూ రీ సర్వే

### కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో రీ సర్వేకు ఎంపికైన గ్రామాల్లో భూ రీ సర్వే కొనసాగుతుందని ఈ సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తొర్రూరు మండలంలోని జమస్తాన్‌పురం, ఖానాపురం, వెంకటాపురం, కర్కాల, గోపాలగిరి, మడిపెల్లి గ్రామాలు రీ సర్వేకు ఎంపికయ్యాయి. బుధవారం మండలంలోని జమస్తాన్‌పురంలో జరుగుతున్న రీ సర్వేలో కలెక్టర్ స్నేహ శబరిష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామంలో 190 ఎకరాల పట్టా భూములను సర్వే చేయడం జరిగిందని, జూలై 10 నుండి సర్వే కొనసాగుతుందని, లక్ష్యం లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అనంతరం తొర్రూరు తహశీల్దార్ కార్యాలయంలో 22ఏ, పై నిషేధిత జాబితాలో వ్యవసాయేతర భూములను సక్రమంగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో రీ సర్వేకు ఎంపికైన 70 గ్రామాల్లో సర్వే కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం 22ఏను పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యాలయ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గణేశ్, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహశీల్దార్ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారికంగా విమోచన దినోత్సవం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు



**ప్రజాపక్షం/పరకాల :** తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు ఎన్.రామచంద్ర రావు అన్నారు. సెప్టెంబర్ 2ను పురస్కరించుకొని పరకాల పట్టణంలోని అమర ధామంలో గల అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటివరకు అధికారంలో ఉన్న ఏ పార్టీ విమోచన దినాన్ని నిర్వహించడం లేదని ఆయన మండిపడ్డారు అధికారంలోకి రావడం కోసం అబద్ధాలు ఆడి అటు తర్వాత విమోచన దినాన్ని విస్మరిస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. పరకాల తాలూకా పరిధిలో సుమారు 22 మందిని నిజాం నిరంకుశ పాలకులు కాల్చి చంపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మ శాంతించాలని తెలంగాణలో బిజెపి రావాలని అప్పుడే విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించి వారి బలిదానాలకు సరైన గుర్తింపును ఇచ్చే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా పరకాల నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ కాళీ ప్రసాద్ మాట్లాడుతూ విమోచన దినం జరపాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాయింటు తడుస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ ఎంపీ బూర నరసయ్య, బిజెపి రాష్ట్ర నాయకులు ప్రేమేందర్ రెడ్డితో పాటుగా హనుమకొండ జిల్లా బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి పార్టీ జయంతి లాల్, కోశాధికారి ఎర్రం రామన్న, పరకాల మున్సిపాలిటీ కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణా చారి, కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, పరకాల పట్టణ అధ్యక్షుడు రాజుల నిరంజన్ పట్టణ కార్యదర్శితో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల అబద్ధాల దగా పాలన

### మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్



**ప్రజాపక్షం/-హనుమకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. ఇది కాంగ్రెస్ 1000 రోజుల ప్రజాపాలన కాదని, 1000 అబద్ధాల దగా పాలన అని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులను హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారిని కలిసిన అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, శాంతియుతంగా నిరసన చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు."ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? హామీలను అమలు చేయడం చేతకాక ప్రశ్నించే గొంతులను అణచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదు" అని వినోద్ కుమార్ అన్నారు. శాంతియుత నిరసనలకు అనుమతి ఇవ్వాలని, ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

### భూపాలపల్లిలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజులు పూర్తయినా ఇచ్చిన హామీలను అమలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బిఆర్ఎస్ పార్టీ జయశంకర్ జిల్లా మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, నియోజకవర్గ అన్ని మండల కేంద్రాలల్లో సమరభేరి కార్యక్రమంలో భాగంగా 420 అడుగుల ఫ్లెక్సీ ర్యాలీ ప్రదర్శన, రాస్తారోకో, బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భూపాలపల్లి పట్టణ, భూపాలపల్లి, చిట్యాల, గణపురం, మొగుళ్ళపల్లి, రేగొండ, కొత్తపల్లి గోరి, శాయంపేట మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సెగ్గం సిద్దు, మేకల సంపత్ కుమార్, కుమార్ రెడ్డి, మండల విద్యాసాగర్ రెడ్డి, మాడ హరీష్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ వేషాల రాజు, మాజీ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే మరింత వేగవంతం

### రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

### హర్షం వ్యక్తం చేసిన రైతులు

**ప్రజాపక్షం/ఐనవోలు :** భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన భూముల రీ సర్వేను మరింత వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సర్వేయర్లను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ పరిధిలో 3541 ఎకరాల భూమి ఉండగా ఇప్పటివరకు 2144 ఎకరాల భూమి రీసర్వే పూర్తి అయినట్లు సర్వేయర్లు కలెక్టర్‌కు వివరించారు. పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన భూమి విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో రైతు అనుభవిస్తున్న భూమి విస్తీర్ణానికి ఏమైనా తేడాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రైతులు రాజిరెడ్డి, రామరాజు, సంపత్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, మాధవి, సరోజన, నిర్మల, తదితర రైతులు భూముల రీ సర్వే జరుగుతున్న పంట పొలాల వద్ద ఉండగా కలెక్టర్ వారితో మాట్లాడారు. రీ సర్వే జరుగుతున్న తీరును గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. భూముల రీ సర్వే చేస్తుండడం బాగుందని, రాష్ట్ర ప్రభుత్వం మంచి కార్యక్రమాన్ని చేపట్టిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే ను మరో 15 రోజుల్లో పూర్తిచేయాలని సర్వేయర్లను ఆదేశించారు.రైతుల భూములను రీ సర్వే చేసిన వివరాలను ల్యాండ్ పార్సల్ మ్యాప్(ఎల్పీఎం)లో నమోదు ప్రక్రియ కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. రీ సర్వేతో భూముల హద్దులు, విస్తీర్ణం, పట్టాదారు వివరాల్లో స్పష్టత రావడంతో భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూ రికార్డులు అందుబాటులోకి వస్తాయని తెలియజేశారు. రోవర్లతో సర్వేయర్లు భూ రీసర్వే చేస్తుండగా కలెక్టర్ పరిశీలించి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే క్షేత్రస్థాయిలో పురోగతి బాగుండటంతో జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీరాం భూపాల్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా భూములు కొలతలు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, తహసిల్దార్ విక్రమ్ కుమార్, సర్వేయర్ సూరజ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

**ఐనవోలులో డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించిన కలెక్టర్**

రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామ పరిధిలోని చింతకుంటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే జరుగుతున్న తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్వే నంబర్ల వారీగా వివరాల నమోదు, సాంకేతిక వ్యవస్థ పని తీరు, జియో మ్యాపింగ్, పంటల ఫొటోల నమోదు, తదితర అంశాలను పరిశీలించడంతో పాటు స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఏడీఏ రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి సునీల్‌తో పాటు ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# విద్యాలయాల్లో ఆటలకు తగ్గుతున్న ప్రాధాన్యత

**చదువులకే పరిమితమవుతున్న పాఠశాలలు**
**క్రీడా మైదానాలు కరువవుతున్న వైనం**

**ప్రజాపక్షం/ తల్లాడ :** ఒకప్పుడు విద్యార్థి సమగ్రాభివృద్ధిలో చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఉండేది. పాఠశాలల్లో ఉదయం వ్యాయామం, సాయంత్రం ఆటలు నిత్యకృత్యంగా ఉండేవి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనే వారు. క్రీడల ద్వారా శారీకర ధృడత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందేవి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అనేక పాఠశాలల్లో ఆటలకు క్రమంగా ప్రాధాన్యత తగ్గుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**చదువులకే పరిమితమవుతున్న విద్యాలయాలు :**

ప్రస్తుతం విద్యార్థులపై విద్యా ఫలితాలు, పరీక్షలు, మార్కులు, పోటీ పరీక్షల ఒత్తిడి పెరుగుతుంది. దీనితో ఆటల కోసం కేటాయించే సమయం తగ్గిపోతుంది. కొన్ని పాఠశాలల్లో ఆటల పీరియడ్ ఉన్నప్పటికీ దానిని ఇతర పాఠ్యాంశాలకు ఉపయోగిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. విద్యార్థులు రోజుల్లో ఎక్కువ సమయం తరగతి గదుల్లోనే గడుపుతున్నారు. దీర్ఘకాలం కూర్చునే అలవాటు వల్ల శారీరక చురుకుదనం తగ్గే అవకాశం ఉంది.

**పాఠశాలల్లో పిఈటిల కొరత :**

క్రీడలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చే పిఈటీలు కీలక పాత్ర పోషిస్తారు. అయితే ప్రతి ప్రైవేటు పాఠశాలలో పూర్తి స్థాయి పిఈటి ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి.



కొన్ని చోట్ల ఒక ఉపాధ్యాయుడికే అనేక బాధ్యతలు అప్పగించడం వల్ల క్రీడలకు తగిన సమయం దక్కడం లేదు. నైపుణ్యం కలిగిన కోచ్‌లు లేకపోవడంతో ప్రతిభ ఉన్న విద్యార్థులు కూడా సరైన శిక్షణకు దూరమవుతున్నారు.

**క్రీడా మైదానాలు ఎక్కడ...?**

పట్టణ ప్రాంతాల్లో పాఠశాలకు విశాలమైన క్రీడా మైదానాలు లేకపోవడం మరో ప్రధాన సమస్య. భవనాలు, తరగతి గదులు, పార్కింగ్ వంటి అవసరాలకు స్థలం పెరుగుతున్న కొద్ది ఆట స్థలాలు తగ్గుతున్నాయి. చిన్న ప్రదేశాల్లో విద్యార్థులు అన్ని క్రీడలు ఆడటం సాధ్యం కాకపోవడంతో క్రీడా కార్యకలాపాలు పరిమితమవుతున్నాయి.

**సెలక్షన్లకే పరిమితమవుతున్న పాఠశాల క్రీడలు :**

కొన్ని సందర్భాల్లో పాఠశాల క్రీడలు అందరికీ అందుబాటులో ఉండాల్సిన కార్యకలాపంగా కాకుండా పోటీల్లో పాల్గొనే కొద్ది మంది విద్యార్థులకే పరిమితమవుతున్నాయి. స్కూల్ టీమ్ కోసం ఎంపికైన విద్యార్థులకే ఎక్కువ శిక్షణ లభిస్తుంది. మిగిలిన విద్యార్థులు ప్రేక్షకులుగా మిగిలిపోతున్నారు. క్రీడల అసలు ఉద్దేశం ప్రతి విద్యార్థిలో ఆరోగ్యం, చురుకుదనం, క్రమశిక్షణ పెంపొందించడమే కావాలి.

**చదువు, క్రీడలు రెండూ అవసరమే :**

విద్యార్థి భవిష్యత్తుకు మంచి మార్కులు ఎంత అవసరమో మంచి ఆరోగ్యం కూడా అంతే అవసరం. క్రీడలు ఒత్తిడని తగ్గించడంతో పాటు జట్టు భావన, ఓర్పు, నిర్ణయ సామర్ధ్యం, నాయకత్వ లక్షణాలను పెంచుతాయి. ఓటమిని స్వీకరించడం, గెలుపును సమతుల్యంగా చూడటం వంటి జీవిత పాఠాలను క్రీడలు నేర్పుతాయి. అందువల్ల క్రీడలను చదువులకు ప్రత్యామ్నాయంగా కాకుండా



చదువులో భాగంగానే చూడాల్సిన అవసరం ఉంది.

**ఏం చేయాలి...?**

ప్రతి పాఠశాలలో కనీసం ఒక పిఈటి లేదా శిక్షణ పొందిన క్రీడా ఉపాధ్యాయుడిని అందుబాటులో ఉంచాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆట స్థలాలను ఏర్పాటు చేయాలి. ప్రతి రోజు నిర్ణీత సమయాన్ని క్రీడలకు కేటాయించాలి. కబడ్డీ, ఖోఖో వంటి స్థానిక క్రీడలతో పాటు అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్ వంటి క్రీడలకు అవకాశం కల్పించాలి. ప్రతిభను కేవలం సెలక్షన్ సమయంలో కాకుండా ఏడాది పొడవునా గుర్తించాలి. మండల, జిల్లా స్థాయిలో పాఠశాలల మధ్య క్రీడా పోటీలు మరింత పెంచాలి. చదువులతో పాటు ఆటలు సాగినప్పుడే విద్యార్థి సమగ్ర వికాసం సాధ్యమవుతుంది. పాఠశాలల్లో మళ్లీ ఆటల సందడి పెరగాల్సిన అవసరం ఉంది.

## బిసి మహిళలకు వంద శాతం సబ్సిడీపై కుట్టు మిషన్లు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో బిసి మహిళలను ఆర్థికంగా స్వలంభన కలిగిన మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై ఆటోమెటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు బిసి వర్గానికి చెంది నిరుద్యోగ మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, మేరా, మేరు కమ్యూనిటీకి చెందిన మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షలకు మించకూడదని తెలిపారు. తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం క్రింద అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన బిసి మహిళలు సెప్టెంబర్ 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను tgobmms.cgg.gov.in పోర్టల్ ద్వారా సమర్పించాలన్నారు.

## ట్రాక్టర్ టైర్లు ఎత్తుకెళ్లిన దుండగులు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని రామచంద్ర రావు బంజర గ్రామానికి చెందిన కంచు ప్రసాద్ కు చెందిన ట్రాక్టర్ టైర్లు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. దమ్ము చేసేందుకు దమ్ము చక్రాలు బిగించి టైర్లను అక్కడ వదిలి వెళ్లిపోవడంతో ఇది గమనించిన కొందరు ఈ దొంగతనానికి పాల్పడ్డారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితుడు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## బైకులతో బిఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీ



**ప్రజాపక్షం/భద్రాచలం:** ఆరు గ్యారెంటీలు ఇస్తామని మాయమాటలతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ పచ్చి అబద్ధాలే అని బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మానే రామకృష్ణతోపాటు నాయకులు ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ అమలుకాని వాగ్దానాలు, వెక్కిరి టస్తున్న గ్యారెంటీలు, ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌ఛార్జ్ మానే రామకృష్ణ, సీనియర్ నాయకుడు సునీల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, నేడు ప్రజలను నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ వైఫల్యాలను క్షే త్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా ఈ ర్యాలీ చేపట్టామని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## రూ. 20 లక్షల గంజాయి పట్టివేత



**కారులో 40.560 కిలోలు, భార్యాభర్తల అరెస్ట్**
**వాహన తనిఖీల్లో వెలుగులోకి అక్రమ రవాణా నెట్‌వర్క్**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఒడిశా నుంచి షిర్డీకి కారులో తరలిస్తున్న 40.560కిలోల నిషేధిత గంజాయిని అశ్వాపురం పోలీసులు స్వాధీనం చేసుకుని, భార్యభర్తలు అరబిందో బిశ్వాస్(33), సుప్రియ బిశ్వాస్(26)ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ 20లక్షలు ఉంటుందని మణుగూరు డీఎస్‌పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌పీ రోహిత్ రాజు ఆదేశాలతో నిఘా కొనసాగుతుండగా సెప్టెంబర్ 1న అశ్వాపురం ఎస్ఐ రాజేష్ సిబ్బందితో గొల్లగూడెం శివారులోని సీతారాం కెనాల్ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఓడీ30ఈ0342టాటా నెక్సాన్‌ను తనిఖీ చేయగా డిక్కీలో గంజాయి బయటపడింది. విచారణలో కలిమెట సాలబాగ్‌కు చెందిన హరిశ్చంద్ర మిస్త్రీ, సుశాంత్ మండల్ వద్ద గంజాయి తీసుకుని షిర్డీలో రోహిత్ యాబిన్‌కు సరఫరా చేసేందుకు వెళ్తున్నట్లు వెల్లడైనట్లు డీఎస్‌పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ రాజేష్ ఫిర్యాదుతో ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య కేసు నమోదు చేసి, అక్రమ సరఫరా నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా డీఎస్‌పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## పదోన్నతి పొందిన జ్యోతిని అభినందించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా బిసి డెవలప్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన జి. జ్యోతిని కలెక్టర్ దివాకర టిఎస్ అభినందించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్‌ను జ్యోతి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన జ్యోతిని కలెక్టర్ అభినందించారు. నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని కలెక్టర్ కోరారు.

## పెంచిన నిత్యావసర ధరలు తగ్గించాలి

**సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిత్యావసర ధరలు పెరిగి పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య తెలిపారు. బుధవారం ఖమ్మం బైపాస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టి మోడీ దిష్టి బొమ్మను దగ్దం చేశారు. ఈ సందర్భంగా సివై పుల్లయ్య మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు పెట్రోల్, డీజిల్, ఆరోగ్యానికి సంబంధించిన మందులు, కరెంటు ఛార్జీలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచిందన్నారు. కార్పొరేట్ వర్గాలకు ప్రయోజనాలను కల్పించేందుకే మోడీ ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. పెంచిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామయ్య, టియుసిఐ ఖమ్మం ఏరియా కార్యదర్శి కె. శ్రీనివాస్, పివోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి. ఝాన్సీలక్ష్మి, నగర కార్యదర్శి పి. శోభ, నాయలకు జాలాది, లెనిన్, డి. చంద్, తిరపయ్య, దాసు, నాగరాజు, సైదులు, రవి, ఉపేందర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



**ఐటిడిఎ పిఒ రాహుల్**

**ప్రజాపక్షం/పాల్వంచ:** చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యే దృష్టి సారించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మండల పరిధి ఉల్వనూర్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిపిఎస్,ఏయుపిఎస్ పాఠశాలలను బుదవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాద్యాయుడి పాత్ర పోషించారు. ఉపాద్యాయులు ఉద్దీపకం వర్క్‌బుక్ సంభంధించిన అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు.ఉదీగదపకం వర్క్‌బుక్‌లోని చతుర్వేద ప్రక్రియ, గుణకారాలు, బాగాహారాలును అడిగిన వెంటనే విద్యార్థులు చెప్పటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ జిపిఎస్, ఏయుపిఎస్ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులకు పునాది నుండే మెరుగైన విద్యను అందించాలని సూచించారు. విద్యా వ్యవస్థను బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్‌బుక్‌లోని అంశాలు ప్రైమరీ విద్యార్థులకు వారధి వర్క్‌బుక్‌లోని ప్రతీ అంశం ప్రతీ విద్యార్థికి అర్ధమయ్యే రీతిలో ఉపాద్యాయులు బోధించాలని ఆదేశించారు. విద్యార్థులందరికి ఉద్దీపకం వర్ష్మబుక్‌లోని ప్రతీ అంశం తెలిసి ఉండాలన్నారు. దీనికి వర్క్‌బుక్ నిర్వాహణ ప్రతీ రోజు సక్రమంగా జరిగేలా చూడాలని, ఉద్దీపకం వర్క్‌బుక్ .3లో పిల్లలు సులభంగా అర్థం చేసుకొని వర్క్‌బుక్ రాసే విధంగా ఎక్కువ శాతం కాంపిటేషన్ పరీక్షలకు సంభంధించిన జనరల్ అంశాలను చేర్చటం జరిగిందని తెలిపారు. మహానీయుల జీవిత చరిత్ర,వ్యాసాలు, టెక్నికల్‌కు సంభంధించిన కంప్యూటర్ అంశాలు, చంద్రయాన్, రోబోటిక్స్, ఇండియాకు సంభంధించిన కల్చర్, రైతులు పంటలను పండించే విధానాలు, అధికారుల పేర్లు తెలిసే విధంగా చాప్టర్‌తో పాటు ఓఎంఆర్ షీట్లు పొందుపరిచామన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఏటిడిఓ చంద్రమోహన్, ఎస్ఆర్‌పి. హరిలాల్, పిజి హెచ్‌ఎం విజయలక్ష్మి, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి ఖమ్మం రీజియన్‌కు రూ.1.81 కోట్ల ఆదాయం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా టిజిఎస్ ఆర్‌టిసి ఖమ్మం రీజియన్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలను ఇచ్చింది. పండుగను పురస్కరించుకుని అదనపు బస్సులు నడపడం ద్వారా ఖమ్మం రీజియన్‌కు రూ.1.81 కోట్ల ఆదాయం లభించిందని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ తెలిపారు. అక్కా చెల్లెళ్లు, కుటుంబ సభ్యుల రాకపోకల దృష్ట్యా ఖమ్మం రీజియన్ పరిధిలో నడిపిన అదనపు బస్సుల ద్వారా రీజియన్‌కు రూ.1,81,74,894 (సుమారు 1.81 కోట్లు ) భారీ ఆదాయం సమకూరిందని తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా ఆగస్టు 26 నుంచి 31 వరకు ఆరు రోజుల పాటు ఖమ్మం రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరవేస్తూ 103 శాతం ఆక్యూపెన్సీ రేషియో (ఓఆర్) సాధించినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం నేపథ్యంలో పండుగ వేళ రద్దీ నెలకొందన్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా రీజియన్ పరిధిలో 325 మహాలక్ష్మి ప్రత్యేక బస్సు సర్వీసులు, 147 రిజర్వేషన్ ప్రత్యేక సర్వీసులు కలిపి మొత్తం 472 అదనపు బస్సులను నడిపినట్లు తెలిపారు.ఈ ప్రత్యేక బస్సులు మొత్తం 2,64,562 కిలో మీటర్లు ప్రయాణించాయన్నారు

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని నూతన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సత్తుపల్లి హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్ నాయక్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులతో కలిసి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. గతంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రికి అందించిన వైద్య పరీక్షల పరికరాలను పరిశీలించి, వాటి వినియోగం, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పౌష్టికాహారం నాణ్యమైనదిగా, తగిన పరిమాణంలో అందించాలని కాంట్రాక్టర్, సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. ఆహారం నాణ్యత, పరిమాణంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరికి అవసరమైన వైద్య సహాయం, సలహాలు అందించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎమ్మెల్యే స్వయంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. త్వరలోనే ఆసుపత్రిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రిహానకమల్ పాషా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఫయాజ్, సాంబ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు , కాంగ్రెస్ నాయకులు షరీఫ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే దగా, మోసం

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాలను మోసం చేసిందని అజయ్‌కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను నిరసిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ముందుగానే హెచ్చరించారన్నారు. కేసిఆర్ హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేయాలనే లక్ష్యంతో అనేక సంస్కరణలను చేపట్టి రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అరకొరగా అమలు చేస్తుందని రైతు రుణమాఫీని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి ఆందోళనకరంగా మారిందని పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయలు సక్రమంగా అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గురుకుల విద్యార్థులు కూడా అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మంలో జర్నలిస్టుల కోసం మంజూరు చేసిన 23 ఎకరాల భూమిని ఇప్పటికీ జర్నలిస్టులకు కేటాయించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బత్తుల మురళీ, కర్నాటి కృష్ణ, మగ్బూల్, నాగండ్ల కోటేశ్వరరావు, పగడాల శ్రీవిద్య, ఎండివై పాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తం


**జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు**



**ప్రజాపక్షం/సుజాతనగర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయని, ముఖ్యంగా విద్యార్థులు, యువత సోషల్ మీడియా, ఆన్‌లైన్ సేవలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టడం, నకిలీ పోలీస్ లేదా ప్రభుత్వ అధికారులుగా పరిచయం చేసుకోవడం, పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేయడం, నకిలీ యాప్‌లు, లింకుల ద్వారా డబ్బులు కాజేయడం వంటి మోసాలకు సైబర్ నెరగాళ్లు పాల్పడుతున్నారని వివరించారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు, పాస్‌వర్డ్‌లు, ఓటిపిలు తదితర సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేయడం, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల ఫొటో మార్ఫింగ్, ఆన్‌లైన్ వేధింపులు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. అదే విధంగా సినిమాల్లో కనిపించే ప్రతి విషయాన్ని అనుకరించకుండా, మంచి విషయాలను మాత్రమే స్వీకరించి చెడు ప్రభావాలకు దూరంగా ఉండాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. స్నేహితుల ఒత్తిడి, సరదా లేదా ఇతర కారణాలతో డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి, వారి ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాం స్కృతిక మరియు ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి మంచి విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యార్థులతో నేరుగా ఇంటరాక్ట్ అవుతూ ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానాలు అందిస్తూ సైబర్ నేరాలు, సోషల్ మీడియా, డ్రగ్స్, పోక్సో, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై మరింత అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సీఐ ఆర్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమణారెడ్డి, జుబేదాబేగం, కళ్యాణి, రమాదేవి, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మమకారంతో కదిలిన వైద్య బృందం

- ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సేవలు
- 53 మందికి వైద్య సేవలు
- పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం



**ప్రజాపక్షం/భద్రాచలం:** ఒకే సారి 52 మందికి పైగా చిన్నారులతో సహా అస్వస్థతకు గురై ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చారనే వార్తను తెలుసుకున్న స్థానిక ప్రయివేట్ డాక్టర్లు, చర్ల దుమ్ముగూడెం, బూర్గంపాడు, మణుగూరు, పాల్వంచకు చెందిన ప్రభుత్వ వైద్యులు వారి సిబ్బందితో సహా హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి చేరుకుని తమ వైద్య వృత్తికి వన్నెతెచ్చారు. మెరుగైన వైద్య చికిత్సలు చేసి ప్రాణాపాయ స్థితి నుండి వారిని బయటపడేశారు. దీంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మానవత్వం మరోసారి వెల్లివిరిసింది. వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామంలో మలేరియా మాత్రలు వేసుకున్న తర్వాత సుమారు 78 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పి, నీరసం వంటి లక్షణాలతో బాధపడుత్ను వారిలో ఏడేళ్ల చిన్నారి జమున మృతి చెందింది, బాధితుల్లో 52 మందిని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు చూపించిన చొరవతో వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా మారింది. విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు బాధితులను పరామర్శించారు.

## పకడ్బందీగా భూముల రీసర్వే



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని రాజన్నసిరిసిల్లా జిల్లా అదనపు కలెక్టర్ గడ్డంనగేష్ అన్నారు.బుధవారం ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లిలో భూముల రీసర్వే పరిశీలించారు.భూముల వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.భూ భారతి కింద ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లి గ్రామం రోవర్ యంత్రాలతో చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియ అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అధికారులకు సర్వేయర్లకు పలు సూచనలు చేశారు.గ్రామంలో ఉన్న రెవిన్యూ అటవీ భూముల రీసర్వేకు సంబంధించి గ్రామంలోని రైతులకు సమాచారం ఇచ్చారా లేదా అని వివరాలను తెలుసుకున్నారు.నిబంధనల మేరకు సర్వే చేపట్టాలని అధికారులు సర్వేయర్లను అదనపు కలెక్టర్ అదేశించారు.పరిశీలనలో ఏడి సర్వే అండ్ రికార్డ్స్ శ్రీనివాస్,డిప్యూటి తహాసీల్దార్ వేణు,రెవిన్యూ అధికారులు వెంట ఉన్నారు.

## విద్యార్థుల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయి ఆజాద్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల సంబరాలు చేసుకుంటున్న ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సాయి ఆజాద్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ దక్కక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేస్తూ విద్యా పరంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మిలిటెంట్ ఉద్యమాలకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## 'భగీరథ'.. నీటి వృథా..!



**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం పట్టణం టెంపుల్ సమీపాన ప్రధాన రహదారి వద్ద పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి నీటి లీకేజీలు నిలుపుదల చేయాలని, తాగునీరు వృథా కాకుండా చూడాలని, రహదారులపై రాకపోలకు ఇబ్బంది లేకుండా చూడాలని 'ప్రజాపక్షం' ద్వారా సంబంధిత అధికారులను కోరుతున్నట్లు స్థానిక నాయకుడు మాడిశెట్టి రవీందర్ తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు జరగడంతో రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్‌లు పగిలాయి. రెండు చోట్ల లీకేజీలు ఏర్పడి నీరంతా రోడ్డుపై పారుతోంది. వాహనదారులు, పాదచారులు రాకపోలకు తీవ్ర ఇబ్బందులు పడ్తున్నారు.

## మా భూములకు పట్టాలు ఇప్పించి న్యాయం చేయండి: రైతు మొర




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జనగామ శివారులో ఉన్న 427 సర్వే నెంబర్ లో ఉన్న కొంత ప్రభుత్వ భూమిని గత నలభై ఏళ్లుగా నా తండ్రి కాలం నుండి కాస్తు చేసుకుంటున్నాని నాకు ఇంత వరకు పట్టాదారు పాసు పుస్తకం రె వెన్యూ అధికారులు ఇవ్వలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పా స్ పుస్తకం ఇప్పించి న్యాయం చేయాలని రైతు జనగామ మల్లేష్ సింగరేణి భూ సేకరణ సభలో పాల్గొన్న రెవెన్యూ అధికారుల కు మొర పెట్టుకున్నా రు. బుధవారం జనగామలో జరిగిన సింగరేణి భూ సేకరణ సభలో ఆ యన మాట్లాడుతూ పట్టా దారు పాస్ పుస్తకం కోసం ఎన్నో సార్లు రామగుండం మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఇ ంత వరకు పరిష్కారం చూపకుండా నాతో పాటు పలువురు నిరుపేద రై తులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గత నల భై ఏళ్లుగా మోఖాపై ఉండి కాస్తు చేసుకుంటున్న నిరుపేద రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని ఆయన అధికారులను కోరారు.

## వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేయడంతో బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గత మూడేళ్లుగా కార్యాలయానికి సంబంధించిన నెలకు రూ. 60,000 చొప్పున అద్దె బకాయిలతో పాటు రూ. 2,00,000 కరెంట్ బిల్లు చెల్లించలేదని భవన యజమాని ఆరోపిస్తున్నారు. బకాయిలు చెల్లించకుండానే ఈ నెల 3వ తేదీన కార్యాలయాన్ని మార్కెట్ యార్డుకు తరలించేందుకు అధికారులు సిద్ధమవుతుండటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే తమకు రావాల్సిన అద్దె, విద్యుత్ బకాయిలను చెల్లించిన తర్వాతే కార్యాలయాన్ని ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేశారు. దీంతో అక్కడికి వచ్చిన ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఇంటి యజమాని కోరుతున్నారు.

## పాఠశాలల పెండింగ్ పనులు పూర్తి : కలెక్టర్



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం ప్రాంతంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం విస్తృతంగా పర్యటించారు. పలు ప్రభుత్వ పాఠశాలలు, అల్లూరు యుపిహెచ్‌సి, లక్ష్మీ పురంవీర్లపల్లి రహదారి పనులను పరిశీలించారు. పాఠశాలల్లో పెండింగ్ పునరుద్ధరణ పనులను 15 రోజుల్లో, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్ల మరమ్మతులను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గోదదావరిఖని ఉర్దూ మీడియం స్కూల్లో ప్రీప్రైమరీ తరగతిని ప్రారంభించారు. అల్లూరు యుపిహెచ్‌సిలో ఎన్‌సిడి స్క్రీనింగ్ పెంచాలని, వైద్యులు సమయానికి హాజరు కావాలని సూచించారు. లక్ష్మీ పురంవీర్లపల్లి సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరణ పనులను 3 నెలల్లో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఇందిరమ్మ ఇండ్లతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు

చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం






**ప్రజాపక్షం/గంగాధర/కరీంనగర్:** ఇందిరమ్మ ఇండ్లతో నిరుపేదల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోందని తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర ప్రజా కార్యాలయంలో బుధవారం గంగాధర మండలంలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడానికి కృషి చేస్తానని అన్నారు.సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇండ్లు రాని పేదలు ఆందోళన చెందవద్దని రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేశ్, సర్పంచులు వేముల భాస్కర్, చిందం ఆంజనేయులు, బాసవేని శ్రీనివాస్, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, ఆరే తేజశ్రీ రాజశేఖర్, గుడి రజిని ప్రవీణ్ రెడ్డి, ధీకొండ బాబలక్ష్మి మధు, ఈటవేని శ్రీనివాస్, దానే అనసూర్య, ఓదెలు, సాగి అజయ్ రావు, బైరిశెట్టి సంపత్, వేముల అంజి, దాతు అంజి, ఎగుర్ల మల్లేశం, పెద్దోళ్ల రాజేశం, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంక్షేమానికి చిరునామా వైఎస్ఆర్**

స్వర్గీయ డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి చేసి సంక్షేమానికి చిరునామాగా నిలిచారని డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత వంటి ప్రతి రంగంలోనూ చెరగని ముద్ర వేశారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్యం మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్, 108, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ఆయన హయాంలోనే ప్రవేశపెట్టారని, దేశంలో సంక్షేమం అంటే గుర్తుకొచ్చే ఏకైక పేరు వైఎస్ఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్, గడ్డం విలాస్ రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి, నాయకులు మడుపు మోహన్, బానోతు శ్రావణ్ నాయక్, వరాల నర్సింగం, పర్వత మల్లేశం, అన్నమనేని నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కల్పనపై దృష్టి

వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన కమిషనర్ రష్మీ పెరమాల్




**ప్రజాపక్షం/గజ్వేల్:** విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పిస్తూ కావేరి యూనివర్సిటీ చక్కటి ఫలితాలు సాధిస్తున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరమాల్ స్పష్టం చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా గౌరారం శివారులోని కావేరి యూనివర్సిటీలో వివిధ అభివృద్ధి పనులు ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి మరింత ప్రోత్సాహం అందించే దిశగా మరో కీలక ముందడుగు వేయడం శుభ పరిణామమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో కావేరి ఛాంపియన్స్ అరేనాను అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కావేరి యూనివర్సిటీ ఛాన్సలర్ భాస్కర్ రావు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ రావు మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతి, శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత , సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి కావేరి యూనివర్సిటీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వం మరియు సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ, విద్యార్థులు వివిధ క్రీడా కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని వివరించారు.

## విద్యాసంస్థల 100 మీటర్ల వరకు పొగాకు ఉత్పత్తులు విక్రయం నిషేధం

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** విద్యార్థుల ప్రవర్తన అసాధారణంగా ఉంటే పోలీస్ అధికారులకు సమాచారం అందించి విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల ప్రభావం చూపకుండా పోలీస్, ఎక్సైజ్, విద్య, సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖలో కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుండి జిల్లాకు వచ్చి నివసిస్తున్న వారి వలన గంజాయి తదితర మాదకద్రవ్యాలు జిల్లాలో ప్రవేశించే అవకాశం ఉన్నందున అనుమానం ఉన్న ప్రాంతాలలో ,వ్యక్తులను తనిఖీ చేయాలని అన్నారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలోపు పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నిషేధమని ఇలా విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. మెడికల్ షాప్‌లలో నిషేధిత డ్రగ్స్ అమ్మకుండా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పర్యవేక్షించాలని అన్నారు. మాదకద్రవ్యాలను వాడకం వలన కలిగే అనర్థాల గురించి విద్యా సంస్థలలో , ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, ఎక్సైజ్ సూపరింటిండెంట్ సంతోష్, డిడబ్ల్యుఓ శారదా, పోలీస్ అధికారులు, డ్రగ్ ఇన్స్పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆగ్రహం



**ప్రజాపక్షం/ముత్తారం :** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ,తన వెయ్యి రోజుల పాలనలో రాష్ట్ర ప్రజలను ఘోరంగా దగా చేసిందని మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తీవ్రస్థాయిలో విమర్శించారు.బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపులో భాగంగా బుధవారం మంథని నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి బిఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తోన్న ఈ ప్రభుత్వ తీరుపై రానున్న రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్‌కార్యకర్తలనినాదాలతోఆప్రాంతం హోరెత్తింది.

# సిఎం వెంటనే రాజీనామా చేయాలి



**ప్రజాపక్షం/గజ్వేల్:** ఆరు గ్యారెంటీల అమలు పేరుతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయని సిఎం రేవంత్ రెడ్డి గద్దె దిగాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజలను సమస్యల పట్ల పక్కదారి పట్టించి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించే గొంతుకులను అక్రమ కేసులతో వేధిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మళ్ళీ గెలవలేమనే భయంతో సిఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఎద్దేవా చేశారు. ప్రజలను చైతన్యం చేస్తూ ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు వెంట పడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, పట్టణ పార్టీ అధ్యక్షులు నవాజ్ మీరా, నేతలు శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, రమేష్ గౌడ్, కనకయ్య, బొగ్గుల సురేష్, శ్రీనివాస్ గుప్త, సంతోష్ గుప్త, ఆకుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## '1000 రోజుల' పాలనలో ఏమి సాధించింది?

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఏమి సాధించిందని సంబరాలు చేసుకుంటుందని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజు లు పూర్తయినా ఎన్నికల హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వారం రోజులపాటు చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం గోదావరిఖనిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శనని ర్వహించడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పి, ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడతారని వ్యాల హరీష్ రెడ్డి అన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో మిరియాల రాజిరెడ్డి, కోరుకంటి చందర్, కౌశిక హరినాథ్, మూల విజయ రెడ్డి, ఫ్లోర్ లీడర్ మేకల సమ్మన్న,మాజీ కోఆప్షన్ తస్లీమ్ భాను,నడిపెల్లి మురళీధర్ రావు,కర్క పద్మజ,నటుపల్లి శ్రీనివాస్, ఈదునూరి శ్రీకాంత్,రంగు దుర్గ ప్రసాద్, అనిల్ రావు,కళావతి, పర్వ స్వాతి,ఉదయ్శ్రీ, మేడం సతీష్,ఎర్రవల్లి శ్రీనివాస్,నరేష్, కొండ సురేష్, రవి లతో పాటు భారీ సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కాదు... ప్రజా వంచన

తాటిపర్తి జీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :**కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అములులో పూర్తిగా విఫలమైందని ఆరోపి స్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించా రు. జగిత్యాల కొత్త బస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు.అక్కడి నుంచి పాత బ స్టాండ్ వరకు పార్టీ జెండాలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే ప్లకార్డులతో నిరసన తెలిపారు. ర్యాలీ అనంతరం జగిత్యాల ఆర్‌డిఒకార్యాలయం ఎదుట జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వ పాలన ప్రజా పాలన కాదని, ఇది కేవలం ప్రజా వంచన పాలనగా మారిందని మండిపడ్డారు. జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## '420 హామీల' ఫ్లెక్సీతో హోరెత్తిన తెలంగాణ చౌక్





**ప్రజాపక్షం/కరీంనగర్:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా.. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలకు అండగా నిలిచేందుకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో సుమారు ఐదు వందల మంది కార్యకర్తలు, ప్రజలతో కలిసి తెలంగాణ చౌక్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలతో కూడిన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు.వారం రోజుల పాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిఆర్ఎస్ శ్రేణులు పెద్దపెట్టున నినాదాలు హోరెత్తించాయి. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల మోసాన్ని రాబోయే అసెంబ్లీ వేదికగా గట్టిగా ఎత్తిచూపుతామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే వరకు ప్రజల పక్షాన నిలబడి తీవ్ర పోరాటాలు చేస్తామని సర్కార్‌ను గట్టిగా హెచ్చరించారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బుల నుబాకీ కార్డు రూపంలో ముద్రించి బాటసారులకు వాహనాదారులకు, బస్సులోని ప్రయాణికులకు స్వయంగా ఎమ్మెల్యే అందించారు.ఈ కార్యక్రమం లో.. మాజీ మంత్రి కరీంనగర్ ఎ మ్మె ల్యే గంగుల తోపాటు మాజీ ఎమ్మెల్సీ నరాదాసు లక్ష్మన రావు, పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పెండ్యాల శ్యాం సుందర్ రెడ్డి, కాసారపు శ్రీనివాస్ గౌడ్, మైనారిటీ నగరశాఖ అధ్యక్షుడు మీర్ సౌకత్ అలీ, బారసా కార్పొరేటర్లు మాజీ ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సూర్య హాస్పిటల్‌లో ఏం జరుగుతోంది?

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లిలోని సూర్య హాస్పిటల్‌లో అర్హత లేని వైద్యుడు ఇఎన్‌టి స్పెషలిస్ట్‌గా సేవలందిస్తున్నారనే ఫిర్యాదులపై డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డా. ముస్కు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల విద్యార్హతలు, వైద్య మండలి రిజిస్ట్రేషన్,ఆసుపత్రి రికార్డులు,అనుమతులు తదితర పత్రాలను పరిశీలించారు. తనిఖీల్లో ప్రాథమికంగా గుర్తించిన అంశాలపై సూర్య హాస్పిటల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేసి, నిర్ణీత గడువులోగా వివరణ సమర్పించాలని అధికారులు ఆదేశించారు. యాజమాన్యం ఇచ్చే వివరణను పరిశీలించిన అనంతరం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, ఇతర వర్తించే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ తెలిపారు. **గత ఆరోపణలపై ప్రశ్నలు :** ఇదే ఆసుపత్రిలో గతంలో నూ అర్హత లేని వైద్యుడితో చికిత్స అందించారనే ఆరోపణలు వచ్చినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. తాజా గా మరోసారి ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించి షోకాజ్ నోటీసు జారీ చేయడంతో, గత ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే గత ఆరోపణల వాస్తవాలు, వాటిపై తీసుకున్న చర్యల వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. **ఇతర ఆసుపత్రుల్లోనూ తనిఖీలు:** సూర్య హాస్పిటల్ అనంతరం పట్టణంలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, వైద్యుల విద్యార్హత లు, వైద్య మండలి నమోదు, రికార్డుల నిర్వహణ, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలును పరిశీలించారు. అర్హత కలిగిన, నమోదిత వైద్యుల ద్వారానే వైద్య సేవలు అందించాలని డా. జైపాల్‌రెడ్డి సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో మెట్‌పల్లి మండల వైద్యాధికారి డా. అంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఖర్గేను కలిసిన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆల్ఫోర్స్ డా.వి. నరేందర్ రెడ్డి ఢిల్లీలోని ఎఐసిసి ప్రధా న కార్యాలయ ం లో బుధవారం ఎఐసిసి అధ్యక్షు డు మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టానికి చేపడుతు న్న పలు కార్యక్రమాలు అభినందనీయమని, కార్యకర్తల్లో జోష్ నింపుతుందని అన్నారు. కరీంనగర్ జి ల్లాలో పార్టీ ఆదేశానుసారంగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు.

## కోలుకుంటున్న అన్నా హజారే

**ముంబయి :** అనారోగ్య కారణంగా సామాజిక కార్యకర్త అన్నా హజారే మంగళవారం ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చేరారు. అయితే ఆయన ఆరోగ్యం మెరుగుపడిందని, వైద్యుల సలహా మేరకు ఇప్పుడు సరైన ఆహారం తీసుకుంటున్నారని ఆయన సన్నిహిత సహచరుడు బుధవారం తెలిపారు. వైద్యుల నుంచి అందిన తాజా సమాచారం ప్రకారం, 89 ఏళ్ల ఈ కార్యకర్త మరో రెండు రోజుల పాటు పర్యవేక్షణలో భాగంగా బాంబే ఆసుపత్రిలోనే ఉంటారని ఆయన పిటిఐతో అన్నారు. అహిల్యానగర్ జిల్లాలోని తన స్వగ్రామమైన రాలేగాన్ సిద్ధికి వెళ్లేలోపు ఆయన పూర్తిగా కోలుకోవాలని తాము కోరుకుంటున్నామన్నారు. రక్త పరీక్షల నివేదికలలో మూత్రపిండాల ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తేలడంతో, హజారేను సోమవారం రాత్రి దక్షిణ ముంబయిలోని బాంబే ఆసుపత్రిలో చేర్చినట్లు ఆయన సహచరుడు దత్తా అవారి ఇంతకు ముందు తెలిపారు. హజారే ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ గౌతమ్ భన్సాలీ మంగళవారం తెలిపారు. అవినీతి వ్యతిరేక పోరాట యోధుడైన ఆయనను తన స్వగ్రామమైన రాలేగాన్ సిద్ధి నుండి ముంబయికి తీసుకువచ్చారు. మొదట చికిత్స కోసం స్థానిక వైద్య కేంద్రంలో చేరారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం ముంబయిలోని ఆసుపత్రిలో హజారేను కలిసి ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. నీటి వనరుల శాఖ మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ కూడా అంతకుముందు ఆసుపత్రిని సందర్శించి ఆయన పరిస్థితిని తెలుసుకున్నారు. మాజీ సైనికుడిగా ఉండి సామాజిక కార్యకర్తగా మారిన పద్మ భూషణ్ అవార్డు గ్రహీత అయిన హజారే, గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడానికి, ప్రభుత్వ పనితీరులో పారదర్శకతను పెంచడానికి, అవినీతిని అరికట్టడానికి గత కొన్నేళ్లుగా అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

## గత ఏడాది ప్రభుత్వ సంస్థలపై
# 70 వేల అవినీతి ఫిర్యాదులు

- సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ:** దేశంలో ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో అవినీతికి పాల్పడుతున్నారు. ఏ శాఖలో చూసినా లంచం లేనిదే పనులు చేయడం లేదు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) నివేదిక ప్రకారం, గత ఏడాది ప్రభుత్వ సంస్థలపై 70,500కు పైగా అవినీతి ఫిర్యాదులు అందాయి. వీటిలో బ్యాంకులు, రైల్వేలు అగ్రస్థానంలో ఉన్నాయి. కమిషన్ తరపున క్షేత్రస్థాయిలో పని చేసే చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లకు (సివిఒలు) అందిన మొత్తం 70,584 ఫిర్యాదులలో, 2025 డిసెంబర్ 31 నాటికి 64,905 ఫిర్యాదులు పరిష్కరించబడ్డాయని నివేదిక పేర్కొంది. మిగిలిన 5,679 ఫిర్యాదులు 2025 చివరి నాటికి ఇంకా పరిశీలనలో ఉన్నాయి; వీటిలో 2,002 ఫిర్యాదులు మూడు నెలల కంటే ఎక్కువ కాలం పాటు పెండింగ్‌లో ఉన్నాయి అని సివిసి వార్షిక నివేదిక 2025 తెలిపింది. సివిఒలు సాధారణంగా మూడు నెలల వ్యవధిలో విచారణను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదుల సత్వర పరిష్కారాన్ని నిర్ధారించడానికి, సివిఒలు వద్ద పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై కమిషన్ క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తుందని నివేదిక పేర్కొంది. బ్యాంకుల సివిఒలకు అత్యధికంగా 9,933 ఫిర్యాదులు అందగా, వాటిలో 9,520 పరిష్కారమయ్యాయి. 413 పెండింగ్‌లో ఉన్నాయి (వీటిలో 52 ఫిర్యాదులు మూడు నెలల కంటే ఎక్కువ కాలం




పెండింగ్‌లో ఉన్నాయి). రైల్వేలకు సంబంధించి సివిఒలకు 9,381 ఫిర్యాదులు అందగా, 2025 డిసెంబర్ 31 నాటికి వాటిలో 8,754 పరిష్కరించబడ్డాయి. 627 పెండింగ్‌లో ఉన్నాయి (వీటిలో 10 ఫిర్యాదులు మూడు నెలల కంటే ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్నాయి). మొత్తం 6,531 ఫిర్యాదులు గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలకు సంబంధించినవి కాగా, 4,834 ఫిర్యాదులు స్థానిక సంస్థలపై (ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ప్రభుత్వం జిఎన్‌సిటిడి మినహా) వచ్చాయి. ఈ స్థానిక సంస్థలలో ఢిల్లీ జల్ బోర్డ్ (డిజెపి), ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (డిఎస్ఐఐడిసి), ఢిల్లీ ట్రాన్స్‌కో లిమిటెడ్ (జిటిఎల్), ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డిటిసి), ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్ (డియుఎస్ఐబి), ఢిల్లీ టూరిజం అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (డిటిటిడిసి), మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసిడి), న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డిఎంసి) ఉన్నాయి. అవినీతి నిరోధక పర్యవేక్షక సంస్థ (సివిసి) ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం, గత ఏడాది అందిన ఫిర్యాదులలో 4,118 బొగ్గు రంగ ఉద్యోగులకు సంబంధించినవి కాగా, 3,107 ఆర్థిక రంగానికి, 2,804 ఢిల్లీ ప్రభుత్వానికి, 2,722 పెట్రోలియం మంత్రిత్వ శాఖకు సంబంధించినవిగా ఉన్నాయి. ఢిల్లీ పోలీసులపై మొత్తం 2,633 ఫిర్యాదులు, రోడ్డు రవాణా, రహదారుల శాఖపై 2,139, అలాగే ఢిల్లీ పోలీసులను మినహాయించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సంబంధించి 2,036 ఫిర్యాదులు నమోదయ్యాయని ఆ నివేదిక పేర్కొంది. మానవ వనరుల అభివృద్ధి శాఖపై 2,030 అవినీతి ఫిర్యాదులు, కార్మిక మంత్రిత్వ శాఖపై 1,894, బీమా సంస్థలపై 1,536, టెలికమ్యూనికేషన్ రంగానికి సంబంధించి 1,469 ఫిర్యాదులు వచ్చినట్లు నివేదిక తెలిపింది. రక్షణ మంత్రిత్వ శాఖకు సంబంధించి 1,410 ఫిర్యాదులు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖపై 1,123, ఉక్కు మంత్రిత్వ శాఖకు సంబంధించి 1,023, తపాలా శాఖపై 1,003 ఫిర్యాదులు నమోదయ్యాయని అందులో పేర్కొన్నారు. అవసరమైన చర్యల కోసం సివిసి నుండి సివిఒలకు (చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లు) అందిన ఫిర్యాదుల వివరాలను కూడా ఈ నివేదిక వెల్లడించింది. మొత్తం 18,651 ఫిర్యాదులలో, అత్యధికంగా 4,110 ఫిర్యాదులు జిఎన్‌సిటిడి(ఢిల్లీ ప్రభుత్వం) మినహా ఇతర స్థానిక సంస్థలకు సంబంధించినవి కాగా, 1,749 బ్యాంకులపై, 1,428 రైల్వేలకు సంబంధించి, 1,318 పెట్రోలియం మంత్రిత్వ శాఖపై, 1,307 ఢిల్లీ ప్రభుత్వానికి సంబంధించి, 1,016 రక్షణ మంత్రిత్వ శాఖపై నమోదయ్యాయని నివేదిక తెలిపింది.

## ఆర్థిక వ్యవస్థను అందంగా మార్చలేరు

- మోదీ ప్రభుత్వం, వారి మీడియా ఎంతగా డప్పు కొట్టుకున్నా త్వరలో నిజం బయటపడుతుంది : జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ :** జిడిపి గణాంకాలపై మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ పార్టీ బుధవారం మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించింది. 'పిఆర్ ద్వారా జిడిపి గణాంకాలను అందంగా మార్చవచ్చేమో కానీ, అసలు ఆర్థిక వ్యవస్థను మార్చలేరు. ఈ విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి' అని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా గార్గ్ మాట్లాడిన వీడియోను పంచుకుంటూ ఈ ఘాటు విమర్శలు చేశారు. 'మోదీ ప్రభుత్వం, వారి మీడియా ఎంతగా డప్పు కొట్టుకున్నా, అంకెల గారడీతో సృష్టించిన జిడిపి వృద్ధి అసలు నిజం త్వరలో బయటపడుతుంది. ఎందుకంటే వారు చెబుతున్న దానికి, సామాన్య ప్రజలు అనుభవిస్తున్న పరిస్థితులకు అస్సలు పొంతన లేదు. మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ గార్గ్ ఇప్పుడు ఈ అబద్ధపు ప్రచారాన్ని బట్టబయలు చేశారు. ఆయన అంచనా ప్రకారం, దేశ నిజమైన జిడిపి వృద్ధి రేటు 7.8 శాతం కాదు, కేవలం 2.6 శాతం మాత్రమే. అయితే ఆర్థిక వ్యవస్థ నిజంగా బలంగా ఉండాలని మేము కోరుకుంటున్నాం. కానీ బలమైన ఆర్థిక వ్యవస్థ అనేది అబద్ధాల పునాదిపై సృష్టించిన అంకెలను అందంగా చూపించడం ద్వారా రాదు. నిజాన్ని ఒప్పుకోవడం




ద్వారానే వస్తుంది. అందువల్ల ప్రభుత్వం మొదట మన అసలు ఆర్థిక పరిస్థితిని అంగీకరించి, ఆ తర్వాత తగు సంస్కరణలు చేపట్టాలి. ఇందుకోసం యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి. చిన్న పరిశ్రమలను, ప్రైవేటు పెట్టుబడులను పెంచాలి. ప్రజల ఆదాయం, వస్తువుల కొనుగోళ్లు పెరగాలి. పేదధనిక వ్యత్యాసాలు తగ్గాలి. మోదీ ప్రభుత్వం కొద్ది మంది పారిశ్రామికవేత్తలకే కొమ్ముకాయకుండా, మార్కెట్లో అందరికీ సమాన పోటీ ఉండేలా చూడాలని' అని జైరాం రమేశ్ అన్నారు. 'మోదీ ప్రభుత్వం ఒకటి అర్థం చేసుకోవాలి. పిఆర్ ద్వారా జిడిపి చిత్రాన్ని అందంగా మార్చవచ్చు. కానీ ఆర్థిక వ్యవస్థను కాదు. ఏ జిడిపిని చూసి ప్రజలందరినీ దీపావళి జరుపుకోవాలని, పటాకులు కాల్చాలని మిస్టర్ మోదీ కోరుతున్నారో, అదే జిడిపిపై ఆయన ప్రభుత్వంలో పనిచేసిన మాజీ ఆర్థిక కార్యదర్శే తీవ్రమైన ప్రశ్నలు అడుగుతున్నారు' అని జైరాం రమేశ్ విమర్శించారు.

# దీక్ష విరమించండి

- మనోజ్ జరాంగేకు జాల్నా కలెక్టర్ విజ్ఞప్తి



**జాల్నా :** మరాఠా రిజర్వేషన్ సమస్యపై కార్యకర్త మనోజ్ జారంగే చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం నాటికి ఐదవ రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేయగా, జాల్నా జిల్లా కలెక్టర్ దీక్షను విరమించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. జారంగే ఆరోగ్య పరిస్థితులను పరిశీలించిన వైద్య అధికారి కార్యకర్త రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయాయని తెలిపారు. నిరసన ప్రదేశంలో ఉన్న వైద్యుల బృందం ఆయనకు ఐవి ద్రవాలు తీసుకోవాలని సూచించినప్పటికీ, ఆయన నిరాకరించారని ఆ వైద్యుడు చెప్పారు. మరాఠాలకు రిజర్వేషన్ కల్పించడం, గెజిట్ రికార్డుల ఆధారంగా తక్షణమే కున్బీ కుల ధృవీకరణ పత్రాలను జారీ చేయడం వంటి డిమాండ్లతో జారంగే ఆగస్టు 29న జాల్నా జిల్లాలోని అంతర్వాలి సరతి వద్ద ఈ నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. తన డిమాండ్లు నెరవేరకపోతే ఆందోళనను ఉధృతం చేసి, దానిని ముంబైకి తీసుకెళ్తానని కూడా ఆయన హెచ్చరించారు. దీక్షను విరమించేలా ఒప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా, జాల్నా కలెక్టర్ అషిమా మిట్టల్ మంగళవారం రాత్రి నిరసన ప్రదేశంలో జారంగేను కలిశారు. ఈ సమావేశంలో, మరాఠా రిజర్వేషన్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలను మిట్టల్ వివరించారు. అయితే, ఆమె ప్రభుత్వ వైఖరిని సమర్థించడానికి వచ్చారా అని ప్రశ్నించిన జారంగే, ఈ డిమాండ్లు రాష్ట్ర స్థాయి నిర్ణయాలకు సంబంధించినవని పేర్కొంటూ, ఆమె ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని కోరారు. తనకు ఆమె పట్ల గౌరవం ఉందని, కానీ ఈ సమస్యపై ఆమె ఇచ్చిన వివరణను అంగీకరించబోనని జారంగే మిట్టల్‌తో చెప్పారు. తనతో చర్చలు జరపడానికి ప్రభుత్వం ఆమెను అనవసరంగా పంపుతోందని ఆరోపించిన ఆయన, ఇకపై ఈ ఆందోళనకు సంబంధించి తనను కలవడానికి రావద్దని ఆమెను కోరారు. మరాఠాలు, కున్బీల మధ్య వంశావళి సంబంధాలను ధృవీకరించే 58 లక్షల రికార్డులు లభించాయని జారంగే పేర్కొన్నారు, అలాగే ప్రభుత్వం ఆ సంఖ్యను తగ్గించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

## నేపాల్‌కు భారత్ మరింత
# సహాయక సామగ్రి పంపిణీ




**న్యూఢిల్లీ :** వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత్ ఆపన్న హస్తం అందిస్తోంది. అందులో భాగంగా బుధవారం 11 మంది సభ్యుల సహాయక బృందంతో పాటు ఐదు టన్నులకు పైగా అత్యవసర మందులను పంపింది. నేపాల్ అధికారుల సమాచారం ప్రకారం, ప్రభావిత ప్రాంతాల నుండి సహాయక సిబ్బంది మరిన్ని మృతదేహాలను వెలికితీయడంతో గత వారం సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 1,000 దాటింది. అత్యవసర బృందాలు 12,000 మందికి పైగా ప్రజలను రక్షించినప్పటికీ, గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతుండగా సుమారు 4,000 మంది ఇంకా ఆచూకీ లేకుండా పోయారు. 'ఐదవ భారతీయ విమానం నేపాల్‌కు బయలుదేరింది. ఇందులో ప్రత్యేక పరికరాలతో కూడిన 11 మంది సభ్యుల సహాయక బృందం, 5.5 టన్నుల అత్యవసర మందులు ఉన్నాయి' అని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సోషల్ మీడియాలో తెలిపారు. భారత్ ఇప్పటికే నేపాల్‌కు మొత్తం 68.5 టన్నుల సహాయక సామగ్రిని అందించింది. గాలింపు, సహాయక చర్యల కోసం అవసరమైన పరికరాలతో పాటు, వైద్యులు, పారామెడిక్స్ బృందాన్ని అలాగే సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా న్యూఢిల్లీ పంపింది. హిమాలయ దేశమైన నేపాల్‌ను ఆకస్మిక వరదలు తాకిన ఆగస్టు 26న, ప్రధాని నరేంద్ర మోదీ తన నేపాల్ సహచరుడు బాలేంద్ర షాతో మాట్లాడిన కొద్ది గంటలకే భారత్ మొదటి విడత సహాయక సామగ్రిని పంపింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి సాధ్యమైనంత మానవతా సహాయం అందిస్తామని మోదీ షాకు హామీ ఇచ్చారు. స్థానిక అధికారుల ప్రకారం, ఈ వరదల వల్ల ప్రధానంగా మధ్య నేపాల్‌లో 35 వాహనాల రాకపోకలకు అనువైన వంతెనలు, 45 సస్పెన్షన్ వంతెనలు, 40 కిలోమీటర్ల తారు రోడ్లు దెబ్బతిన్నాయి.

## హామీల అమలుపై ఎన్‌సి, బిజెపి
# పోటాపోటీ నిరసనలు




**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లో 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత తొలిసారి బుధవారం పెద్ద రాజకీయ పార్టీలు నిరసనలు వ్యక్తం చేశాయి. కశ్మీర్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విఫలం చెందారని అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ప్రతిపక్ష బిజెపి ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకున్నాయి. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామన్న హామీని బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని నేషనల్ కాన్ఫరెన్స్ ఆరోపించగా, ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ఎన్‌సి ప్రభుత్వం విఫలమైందని బిజెపి ఆరోపించింది. రాజ్‌బాగ్‌లోని గిందున్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద భారీ సంఖ్యలో సమావేశమైన ఎన్‌సి మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర హోదా పునరుద్ధరణను డిమాండ్ చేస్తూ జవహర్ నగర్‌లోని బిజెపి ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణలో జాప్యంపై కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు బిజెపి కార్యాలయాన్ని ముట్టడించాలని (ఘెరావ్) ఆ పార్టీ తలపెట్టింది. అయితే, భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు, ఇతర భద్రతా దళాలు నిరసనకారులు జవహర్ నగర్ వైపు వెళ్లకుండా అడ్డుకున్నాయి. ఈ క్రమంలో తమ ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఎన్‌సి ఆరోపించింది. జెకెఎన్‌సి చేపట్టిన శాంతియుత నిరసనను ముందుకు సాగకుండా అడ్డుకున్నారని, ప్రజలు ఇందులో పాల్గొనకుండా చేశారని, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఎన్‌సి ట్విట్టర్ వేదికగా మండిపడింది. అయితే సచివాలయం బయట బిజెపి నిరసన చేపట్టినప్పుడు మాత్రం వారిని అనుమతించడం సిగ్గుచేటు అని మండిపడింది. అయితే ఎన్‌సి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు వందలాది మంది బిజెపి నాయకులు, కార్యకర్తలు లాల్ చౌక్‌లోని క్లాక్ టవర్ వద్ద సమావేశమయ్యారు. నిరసనకారులు జమ్ముకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన సివిల్ సెక్రటేరియట్‌ను ముట్టడించాలని ప్రణాళిక వేసినప్పటికీ, హరి సింగ్ హై స్ట్రీట్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. పార్టీ కార్యకర్తలనుద్దేశించి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ మాట్లాడుతూ ప్రజలు కష్టాలు పడుతున్నారని, కానీ వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఏమీ చేయడం లేదన్నారు. నిష్పక్షపాత నియామకాలు జరపకుండా ఉద్యోగాలను అమ్ముకోవడం; స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం; విచ్చలవిడి అవినీతి, విద్యుత్ ఛార్జీల పెంపు ఈ నిరసన నాలుగు సమస్యల చుట్టూ కేంద్రీకృతమై ఉందని ఆయన అన్నారు. రాష్ట్ర హోదా అంశాన్ని అబ్దుల్లా, అతని పార్టీ కేవలం చిలుకలా వల్లెవేస్తున్నారని, పరిపాలనపై దృష్టి పెట్టడం లేదని కూడా శర్మ ఆరోపించారు.

## రైతులు, ఉపాధ్యాయులపై డిఎంకె పెట్టిన
# కేసులను ఎత్తివేస్తున్నాం

- అసెంబ్లీలో తమిళనాడు సిఎం ప్రకటన



**న్యూఢిల్లీ :** తమిళనాడులో అధికారంలోకి వచ్చిన టివికె ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత డిఎంకె ప్రభుత్వ హయాంలో రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసులను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా నిరసనకారులకు భారీ ఊరట లభించినట్లయింది. 2021 మే నుంచి 2026 మధ్య కాలంలో ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రభుత్వం.. సిప్‌కాట్ పారిశ్రామిక వాడ, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిపై అమానుషంగా వ్యవహరించిందని విజయ్ విమర్శించారు. ఆ సమయంలో రైతులు, ఉపాధ్యాయులపై పలు కేసులు నమోదు చేశారని, అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని విజయ్ స్పష్టంచేశారు. కేసుల ఎత్తివేత నిర్ణయం ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. ఇదిలాఉండగా, 'నీట్' కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై కేసులను ఉపసంహరించుకోవాలని సిపిఐ, ఎన్ఎల్‌సి ఆందోళనకారులపై కేసులను రద్దు చేయాలని పిఎంకె పార్టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే ఆ డిమాండ్లపై టివికె ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 145 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA -II Branch**

**... Disputant**

AND

**Sri. Cheruku Vishisht Reddy & Others**

**... Opponents**

3. Sri. Saindla Srikanth, S/o, Srinivas, Age: 32 Yrs,Occ: Private Employee, H.No: 2-11-12/A, Saraswathi Nagar,Gopalpur -X-Roads,Hanamkonda.
4. Smt. Alajpuri Radhika, W/o, Madhan Kumar, Age: 46 Yrs, Occ: Private Employee, R/o: H.No: 2-11-12/A, Saraswathi Nagar, Gopalpur-X-Roads, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 146 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA -II Branch**

**... Disputant**

AND

**Mr. Banothu Padma & Others**

**... Opponents**

1. Mr. Banothu Padma, W/o, Devula, Age: 27 years, Occ:House Wife, H.No:2-69, Suryanayak Thanda, Gangirenigudem, Shyampet, Warangal.
2. Mr. Porika Ramesh, S/o, Haridas, Age: 42 Years, Occ:TGT Hindi, O/o.TS Modal School, Bandarupally, Mulugu, H.No:3-20, Annampally, Jaggannapet, Mulugu.
3. Mr. Mandapelly Krishna, S/o, Sanjeeva, Age: 40 Years, Occ:PGT Economics, O/o: T.S. Model School, Bandarupally, Mulugu, H.No:2-197, Athmakur, Penchikalapeta, Warangal.
4. Mr. Malothu Ramesh, S/o, Lalu, Age: 40 Years, Occ: PGT Botony, O/o. TS Model School, Bandarupally, Mulugu, H.No:2-69, Suryanayak Thanda, Gangirenigudem, Shyampet, Warangal.
5. Mr. Malothu Jawahar, S/o, Lalu Nayak, Age: 36 Years,Occ: Police Conistable, O/o. Police Station Warangal Trafic, H.No: 2-4-843/1, Gokul Nagar, Hanamkonda.
6. Mr. Bolle Ramesh, S/o, Sambaiah, Age: 38 Years, Occ: Police Conistable, O/o:Police Station Subedari, H.No:4-54, Ambedkar Colony, Puligilla, Madikonda,Hanumakonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 179 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., WARANGAL-II Branch**

**... Disputant**

AND

**Mr. VADLURI SHYAM KUMAR & Others**

**... Opponents**

1. Mr. VADLURI SHYAM KUMAR, S/o. VENKATESHWARLU, aged about: 42 years, Occ:Business, R/o. H.No: 10-4-118, FLAT No: 202, VIJAYA LAXMI COMPLEX, GIRMAJIPET, WARANGAL.
2. Mr. PUSALA SATYANARAYANA, S/o. RAMA CHANDRAM, aged about 40 years, Occ: Business, R/o. H.No. 15-6-134, NEAR PEDDAMORI, PAPAIPET, WARANGAL.
3. Mr. KALVACHARLA NAGA RAJU, S/o. VENKATARAMANA, aged about 41 years, Occ: Business, R/o. H.No. 16-4-464/A/1, BACK SIDE WALL MART, SHIVA NAGAR, WARANGAL.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 126 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Vaddepally Akhil, & Others**

**... Opponents**

1. Mr. Vaddepally Akhil, S/o, Ramesh, Age: 26 Years, Occ: Auto Driver, H.No: 13-172, Ambedkar Nagar, Seethampet, Hasanparthy, Warangal.
2. Mr. Cheripalli Umesh, S/o, Chinnaiah, Age: 29 Years, Occ:Private Employee, H.No:6-57, Shanigaram, Kamalapur, Warangal.
3. Mr. Cheripalli Dinesh, S/o, Chinnaiah, Age: 20 Years, Occ: Private Employee, H.No: 6-57, Laxmipur, Parkal Road, Shanigaram, Kamalapur, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 125 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mrs. Esampally Kalpana& Others**

**... Opponents**

1. Mrs. Esampally Kalpana, W/o, Mahender, Age:38 Years, Occ: House Wife, H.No: 4-60, S.C. Colony, Kaniparthy, Warangal.
2. Mr. Esampally Mahender, S/o, Uppalaiah, Age:42 Years, Occ: Police Constable, O/o.Karimnagar Traffiic, H.No: 4-60, S.C. Colony, Kaniparthy, Warangal.
3. Mr. Uppu Vidya Sagar, S/o, Sadaiah, Age:43 Years, Occ:Police Constable, O/o. Vangara, H.No: 4-89,Yadava Nagar, Gudur, Kamalapur, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 127 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Burra Sharath Chandra & Others**

**... Opponents**

3. Mr. Arelly Bunny, S/o, Nagaraju, Age: 27 Years, Occ: Private Employee, H.No:1-44, Duggondi, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 128 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Thota Raghunandan& Others**

**... Opponents**

1. Mr. Thota Raghunandan, S/o, Papaiah, Age: 47 Years, Occ: Business, H.No: 1-115, Kapuwada, Gudur, Kamalapur, Hanamkonda.
2. Mr. Adla Kumaraswamy, S/o, Venkatamallu, Age: 54 Years, Occ: SGT, O/o: Zpss, Atmakur, Hanamkonda, H.No: 11-26-121, Kothawada, Warangal.
3. Mr. Chepuri Sree Rama Rao, S/o, Laxminarsimha Rao, Age: 60 Years, Occ: SA, O/o: ZPHS Velisa, Tekumatla, H.No:2-8-742, Bhavani Nagar, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 131 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA -II Branch**

**... Disputant**

AND

**Ms. Vallem Radha, & Others**

**... Opponents**

2. Mr. Vallem Indrasena Reddy, S/o, Venkat Reddy, Age:46 years, Occ:Suprintendent CPO,H.No:1-7-156, Revenue Colony, Subedari, Hanamkonda, Wranagal.
3. Mr. Mysa Srinivasulu, S/o, Veeraswamy, Age: 53 Years, Occ:SuprintendentCPO, H.No:3-14-342, Durga Colony, KUC Road, Hanamkonda.
4. Mr. Odela Srinivas, S/o, Eshwaraiah, Age:46 years, Occ:Police Constable, ccs Peddapally, H.No.17-5-22, Santhoshnagar, Godavarikhani, Ramagundam.
7. Mr. Vallem Mamatha, W/o, Indrasena Reddy, Age: 45 years, Occ:House Wife, H.No.1-7-156, Revenue Colony, Subedari, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 132 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA Branch**

**... Disputant**

AND

**Ms.Mohammad Gousiya Begum & Others**

**... Opponents**

2. Mr. Mohammed Asif, S/o, Yousuf Ali, Age: 36 years, Occ: Jr. Linemen, O/o. SPDCL, Nalgonda, R/O. H.No: 4-10-360/1, Shanthi nagar, Mushyampally road, Nalgonda.
3. Mr. Mohammed Habeed Shareef, S/o. Khaja Shareef, Age:45 Years, Occ: Police Constable, Emp Id. 1903111,O/o. SHO, Devarakonda, Nalgonda, H.No:19-1-15, Hanumannagar, Devarakonda, Near Govt. College, Nalgonda.
5. Mr. Kasturi Ashok, S/o, Laxminarayana, Age: 55 Years, Occ: Panchayath Secretary ,O/o. MPDO, Nampally, Nalgonda, H.No: 4-33, Koppolu, Gurrampode, Nalgonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 134 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA Branch**

**... Disputant**

AND

**Best Choice True Cars Prop: Jangam Srikanth & Others**

**... Opponents**

2. Ms. Teegala Sravanthi, W/o, Satheesh Kumar, Age: 35 years, Occ: Business, H.No.1-85, Keshavapur, Elkathurthy, Hanumakonda.
3. Mr. Aenugula Praveen, S/o, Manik Prabhu, Age: 48 Years, Occ: Business, H.No: 13-2-445,446,Jai Hanumannagar,Near Mahankali temple, Asif nagar, Hyderabad.
4. Mr. Ksheerasagar Sudhir, S/o, Krishna, Age: 52 Years, Occ: Business, H.No: 2-4-1023, Kachiguda, Himayath Nagar, Hyderabad.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

# అమెరికాకు శిక్ష తప్పదు : ఇరాన్

### హోర్ముజ్ వద్ద వివాహ వేడుకపైకి క్షిపణులు...టెహ్రాన్ ప్రతీకార దాడులు



**టెహ్రాన్/న్యూయార్క్ :** చేసిన నేరాలకు శిక్ష తప్పబోదని అమెరికాకు ఇరాన్ తేల్చిచెప్పింది. హోర్ముజ్ జల సంధి వద్ద పౌరులపై దాడులతో ఆగ్రహం వ్యక్తంచేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెంచే విధంగా ఇరాన్‌పై అమెరికా తాజా దాడులు చేసింది. సిరిక్ కౌంటీలో వివాహ వేడక జరుగుతుండగా దాడి చేసి పౌర హత్యలకు పాల్పడింది. పెళ్లి వేడుక జరుగుతున్న ఇంటిపై క్షిపణి శకలాలు పడి ఓ చిన్నారి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది గాయపడ్డారు. ఈ దాడులను ఇరాన్ తీవ్రంగా పరిగణించింది. మానవ హక్కుల పరిరక్షులమని చెప్పుకునే వారి కపటత్వానికి ఈ ఘటన నిదర్శనమని వ్యాఖ్యానించింది. మినాబ్, లామెర్డ్‌లో హింసాత్మక సన్నివేశం మళ్లీ సిరిక్‌లో కనిపించిందని పేర్కొంది. హోర్ముజ్ జలసంధి కోస్తా ప్రాంతంలో సిరిక్ ఉన్నది.

గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్ వ్యవస్థలు, మేరీటైమ్ ఆస్తులు, మైన్‌లు పరిచే సామర్థ్యాల, కమ్యూనికేషన్ కేంద్రాలు దెబ్బతీసే విధంగా అమెరికా దాడులు చేసినట్లు ఎక్స్ మాధ్యమంగా యుఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనుకున్న లక్ష్యాలను తమ దళాలు ధ్వంసం చేసినట్లు పేర్కొంది. ఈ దాడులలో చిన్నారి సహా అనేక మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ఇరాన్ అత్యున్నత రాయబారి మహమ్మద్ బాఘెర్ గాలిబాఫ్ మండిపడ్డారు. 'అమెరికా ఓ సైతాను. ఈ దేశం తన శక్తిని ఓ సైతాను వలే వాడుకుంటోంది. సైతాను తరహా లక్ష్యాలు ఎంచుకుంటోంది.

**ఇరాన్ ప్రతీకార దాడులు :** అమెరికా దాడులకు ఇరాన్ దీటుగా బదులిచ్చింది. బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా ఆస్తులపై విరుచుకుపడింది. యుఎఇలోని అల్ దాఫ్రా, అల్ మిన్హాద్ వద్ద అమెరికా దళాల స్థావరాలు, రాడార్ వ్యవస్థలు లక్ష్యంగా పదుల సంఖ్యలో డ్రోన్లు ప్రయోగించినట్లు ఇరాన్ సైన్యం వెల్లడించింది. భీకరంగా ప్రతీకార దాడులు జరిగాయని పేర్కొంది.

**మొజ్తాబా ఖామేనీ హెచ్చరికలు :**
మర్చిపోలేని గుణపాఠం చెబుతామంటూ అమెరికాను ఇరాన్ అధినేత మొజ్తాబా ఖామేనీ హెచ్చరించారు. ఇరాన్‌పై అసలు ఎందుకు దాడి చేశామంటూ అమెరికా తలబాదుకునే పరిస్థితిని తమ సాయుధ దళాలు కల్పిస్తాయన్నారు. హోర్ముజ్ పరిధి రవాణా మార్గాల్లో సీ మైన్స్ తొలగించినట్లు ప్రకటించిన అమెరికా... ఆ వెంటనే ఇరాన్ మళ్లీ సీ మైన్స్ పరిచేందుకు సిద్ధమైందని ఆరోపిస్తూ క్షిపణి దాడులు చేసింది. నెల రోజులుగా ఆగిన ఘర్షణలు తిరిగి మొదలయ్యే పరిస్థితి తెచ్చింది. దక్షిణ ఇరాన్‌తో పాటు హోర్ముజ్ వెంబడి దాడులు చేసింది. వివాహ వేడుకతో పాటు చాబహార్, కొనరాక్ ప్రాంతాలపై క్షిపణులు ప్రయోగించింది. దీంతో మొజ్తాబా ఆగ్రహం వ్యక్తంచేశారు.

**కుప్పకూలిన ఇరాన్ ఆర్థిక వ్యవస్థ : ట్రంప్ :** ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, హోర్ముజ్ జల సంధి దాదాపుగా తమ నియంత్రణలోకి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌ను బలవంతంగా చర్చలకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వచ్చిన వార్తలను ఆయన ట్రూత్ సోషల్ మాధ్యమంగా తోసిపుచ్చారు.

**ఇరాన్‌కు రష్యా సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ టెక్నాలజీ :** ఇరాన్‌కు రష్యా రహస్యంగా సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్లను అభివృద్ధి సహకరిస్తున్నట్లు తెలిసింది. సి430ఎల్ పేరుతో ఈ మిషన్ చేపట్టినట్లు సమాచారం. రష్యన్ ఇంటెలిజెన్స్ నుంచి లీకైన సమాచారం ఆధారంగా అమెరికా యుద్ధ నౌకలను ఎదుర్కొనే విధంగా ఈ క్షిపణుల అభివృద్ధి జరుగుతున్నట్లు అంచనా వేశారు. 2023 నుంచి కార్యాచరణ కొనసాగుతోందని... రామ్‌జెట్ ప్రొపల్షన్ సిస్టమ్ అభివృద్ధి జరుగుతోందని సమాచారం. ధ్వనికి మించిన వేగంతో దూసుకెళ్లే క్రూయిజ్ క్షిపణుల ఇంజిన్లను ఈ టెక్నాలజీతో తయారు చేయవచ్చని తెలుస్తోంది. రామ్‌జెట్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను ఇరాన్ సొంతంగా తయారు చేసిందని, రష్యా ఆ సాంకేతికను అందించలేదన్న వాదన వినిపిస్తోంది.

# నేపాల్‌కు తొలగని ముప్పు

### మళ్లీ భారీ వర్షాలు, వరదలు : ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు – ప్రజలు బిక్కుబిక్కు



**ఖాట్మండు :** హిమాలయ దేశానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. మరోమారు భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రకృతి విపత్తు నుంచి తేరుకోని ప్రజలు తాజా పరిస్థితులతో బిక్కుబిక్కుమంటున్నారు. రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ప్రధాన నదుల ప్రవాహం ప్రమాద స్థాయికి చేరుకుంది. దీంతో దేశమంతటా వరద హెచ్చరికలు జారీ అయ్యాయి. అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలకు అధికారులు సూచనలు చేశారు.

నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ ప్రకారం బుధవారం ఉదయం 6 గంటలప్పటికి ప్రధాన నదుల్లో నీటి మట్టాలు ప్రమాద స్థాయిని దాటాయి. సింధూలి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదులు ఉప్పొంగాయి.

లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యంగ్డి నదిలో ప్రవాహం ప్రమాద స్థాయిని మించిపోయింది. అది ఇంకా పెరుగుతూనే ఉంది. దాంతో నదీ పరివాహక ప్రాంతాల్లో ముప్పు ఏర్పడింది. మర్స్యంగ్డి నది దిగువ ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు. రాజధాని ఖాట్మండు సహా అనేక ప్రాంతాను వర్షాలు ముంచెతుండటంతో అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. పరిస్థితులను నిశితంగా గమనిస్తూ, ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరికలు/గమనికలు జారీచేస్తోంది.

**1,127కు చేరిన మృతుల సంఖ్య :**
నేపాల్ ఆకస్మిక వరదల్లో మృతిచెందిన వారి సంఖ్య 1,127కు చేరుకున్నది. మృతదేహాలకు తాత్కాలిక ఖననం కొనసాగుతోంది. ఖాట్మండులోని గోకర్ణలో శవాల పాక్షిక ఖనన కార్యక్రమం జరుగుతోంది. మృతుల డిఎన్ఎ నమూనాలు, ఫోటోలు, ఇతర కీలక సమాచారాన్ని భద్రపరుస్తున్నారు. చిత్వాన్‌లో 348 మృతదేహాలు లభ్యం కాగా నావల్‌పారసి ఈస్ట్‌లో 217, 190 నావల్ పారసి వెస్ట్‌లో, నువాకోట్‌లో 155, గూర్ఖాలో 66, దాడింగ్‌లో 59, రసువాలో 45, తానాహులో 36 చొప్పున మృతదేహాలను వెలికితీశారు. 1,113 మృతదేహాలకు శవపరీక్షలు, గుర్తింపు ప్రక్రియలు పూర్తి చేశారు. మరో 95 మృతదేహాలను బంధువులకు అప్పగించారు. గుర్తు తెలియని 911 మృతదేహాల వివరాలను నేపాల్ పోలీసులు తమ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. కాగా, 6,541 మందిని భద్రతా సిబ్బంది కాపాడారు. ఇంతవరకు ఆచూకీ లభించని 4,858 మంది కోసం గాలింపులు కొనసాగుతున్నాయి.

# రామాలయ తొలి సిఇఓగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సింధూర్ సమయంలో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు నేతృత్వం వహించిన ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్రా, రామ మందిర నిర్వహణ, కార్యకలాపాలను పర్యవేక్షించే శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు తొలి సిఇఓగా బుధవారం నియమితులయ్యారు. ఈ పోస్టు కోసం వచ్చిన 5,585 దరఖాస్తుల నుండి ముగ్గురిని ఎంపిక చేయగా, అందులో మిశ్రా పేరును ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. మందిర విరాళాల చోరీ ఆరోపణలపై చెలరేగిన వివాదం నేపథ్యంలో 62 ఏళ్ల మిశ్రాను సిఇఓగా నియమించారు. ఈ వివాదంలో ఎనిమిది మందిని అరెస్టు చేయడం, ప్రధాన కార్యదర్శిగా చంపత్ రాయ్ రాజీనామా చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. రిటైర్డ్ జస్టిస్ ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలో, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది, మాజీ శాస్త్రవేత్త సురేష్ హవారే సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీ మంగళవారం తన తుది నివేదికను ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్‌గిరికి సమర్పించింది. వారి నాయకత్వం, నిర్వహణ నైపుణ్యం, నిజాయితీ, దార్శనికతను అంచనా వేసిన తర్వాత, కమిటీ ముగ్గురు అత్యంత అర్హతగల నిపుణులను సిఫార్సు చేసిందని కమిటీ కార్యదర్శి సమీర్ పాండా తెలిపారు. విరాళాల దుర్వినియోగం ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పటి నుండి ట్రస్ట్‌కు ఇది మూడవ సమావేశం. సిఇఓ ఎంపిక ప్రక్రియలో ఎఐ సహాయంతో స్క్రీనింగ్, అలాగే మాన్యువల్ అసెస్‌మెంట్ కూడా జరిగాయని ట్రస్ట్ అధికారులు తెలిపారు. అందిన 5,585 దరఖాస్తులలో, 600 మార్కుల ఫ్రేమ్‌వర్క్ కింద మూల్యాంకనం కోసం 3,577 మంది అభ్యర్థులు తమ వివరాలను సమర్పించారు. తదనంతరం, 470 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన 108 మంది అభ్యర్థులను వర్చువల్ ఇంటరాక్షన్‌ల కోసం ఎంపిక చేశారు. ఆ తర్వాత, ఆగస్టు 11, 12 తేదీలలో అయోధ్యలో 16 మంది అభ్యర్థులను వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని డియోరియా జిల్లాకు చెందిన మిశ్రా, ఆపరేషన్ సింధూర్‌లో తన పాత్రకు గాను సర్వోత్తమ్ యుద్ధ సేవా పతకాన్ని అందుకున్నారు. తన సుదీర్ఘ సైనిక వృత్తిలో ఆయనకు అతి విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకం కూడా లభించాయని ఒక ప్రకటనలో తెలిపారు. 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా నియమితులైన మిశ్రా, 2026 ఏప్రిల్ 30న పదవీ విరమణ చేసే ముందు 39 సంవత్సరాలకు పైగా సేవలందించారు. పశ్చిమ వైమానిక దళ కమాండ్ అధిపతిగా, ఆపరేషన్ సింధూర్ సమయంలో ఐఎఎఫ్ యొక్క కీలక ఆపరేషనల్ కమాండ్‌లలో ఒకదానికి ఆయన బాధ్యత వహించారు. తద్వారా కమాండ్ విమానయానం, పరీక్షలు మరియు వ్యూహాత్మక బాధ్యతలతో కూడిన తన సుదీర్ఘ రికార్డుకు కార్యాచరణ కోణాన్ని జోడించారని ఒక ప్రకటన తెలిపింది. ఆయన పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్, అమెరికాలోని ఎయిర్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, యుకెలోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ పూర్వ విద్యార్థి. 3,000 గంటలకు పైగా విమానయానం చేసిన తన కెరీర్‌లో, ఆయన ఒక ఫైటర్ స్క్వాడ్రన్‌కు, రెండు ఫ్రంట్‌లైన్ ఎయిర్ బేస్‌లకు కమాండ్‌గా వ్యవహరించారు. ఆయన ఎయిర్‌క్రాఫ్ట్ అండ్ సిస్టమ్స్ టెస్టింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎఎస్‌టిఇ) కమాండెంట్‌గా కూడా పనిచేశారు. మిశ్రా ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆపరేషనల్ ప్లానింగ్ అండ్ అసెస్‌మెంట్ గ్రూప్ డైరెక్టర్‌తో సహా పలు ఉన్నత పదవులను కూడా నిర్వహించారు. జనవరి 1, 2025న వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ బాధ్యతలు స్వీకరించడానికి ముందు, ఆయన ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ (ఆపరేషన్స్) డిప్యూటీ చీఫ్‌గా పనిచేశారు.

### కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి..
# దృఢంగా కట్టుబడి ఉండాలి

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు రాహుల్ గాంధీ పిలుపు**

**నాసిక్ (మహారాష్ట్ర) :** పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉంటూ, ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ అభ్యాసకుడైన రాహుల్‌గాంధీ శిక్షణా శిబిరంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల కోసం కరాటే, జుజుట్సు ప్రదర్శన కూడా ఇచ్చారు. జుజుట్సు అనేది ఒక సాంప్రదాయకమైన జపానీస్ యుద్ధకళ. సమీప పోరాట వ్యవస్థ. ఇది ప్రత్యర్థిని ఓడించడానికి పట్లు, విసిరే పద్ధతులు, దాడులను ఉపయోగిస్తుంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఆరిఫ్ నసీమ్ ఖాన్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ కొత్తగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులను, వారి కుటుంబ సభ్యులను కూడా కలిశారని చెప్పారు. 'వారు కాంగ్రెస్ సిద్ధాంతానికి దృఢంగా కట్టుబడి, ప్రజలకు న్యాయం జరిగేలా పోరాడాలనే సందేశాన్ని వారికి ఇచ్చారు' అని ఆయన అన్నారు.

బుధవారం ఉదయం తొలుత, రాహుల్‌గాంధీ నాసిక్‌కు చేరుకుని, మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులను కలుసుకున్నారు. గిరిజన విద్యార్థులతో మాట్లాడిన తర్వాత ఆయన శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. అనంతరం, ఆయన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో సుమారు రెండు గంటల పాటు ముచ్చటించారని, వారి కోసం జుడో, కరాటేలలో ప్రదర్శన ఇచ్చి, మానసికంగా, శారీరకంగా ఎలా బలంగా ఉండాలనే దాని గురించి మాట్లాడారని కాంగ్రెస్ కార్యకర్త ఒకరు చెప్పారు.

# వైఎస్ ప్రారంభించిన ప్రాజెక్టులు పూర్తి చేస్తా

ఆగిపోయిన ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బిసి, కల్వకుర్తి పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం ఇస్తాం
వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవార్డ్స్ 2026 కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి
రానున్న రోజుల్లో రాహుల్‌ను ప్రధానిని చేయాలని పిలుపు



**న్యూఢిల్లీ :** తెలంగాణ ప్రాంతంలో సాగునీరు అందించేందుకు ప్రాణహిత–చేవెళ్ల, కల్వకుర్తి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రాజెక్టులను ప్రారంభించింది వైఎస్ రాజశేఖర్ రెడ్డేనని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆనాడు ఆగిపోయిన ప్రాణహిత–చేవెళ్ల, ఎస్ఎల్‌బిసి, కల్వకుర్తి ప్రాజెక్టులను నూటికి నూరు శాతం పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్ఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్న ఆయన, రానున్న రోజుల్లో రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే వైఎస్ఆర్‌కు అర్పించే అత్యున్నత నివాళి అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవార్డ్స్ 2026 కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేశారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆనాడు రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేసి, రైతులపై ఉన్న కేసులను ఎత్తివేసి వారి గుండెల్లో రారాజుగా నిలిచారన్నారు. అదే విధంగా వైఎస్ అభిమానులకు ఒక చారిత్రక సత్యాన్ని గుర్తుచేస్తున్నానంటూ సిఎం స్పష్టం చేశారు. రెండోసారి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేయడమే తన జీవిత లక్ష్యమని వైఎస్ఆర్ స్పష్టంగా చెప్పారని, కానీ ఆ కోరిక తీరకుండానే కన్నుమూశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశ ప్రజలు కష్టాల్లో ఉన్నారని, ఈ చారిత్రక సందర్భంలో దేశానికి రాహుల్ గాంధీ వంటి బలమైన నాయకుడి అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో మనమంతా కలిసికట్టుగా శ్రమించి, రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసి వైఎస్ఆర్ ఆఖరి కోరికను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటిపారుదల రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని, ఆయన ముందుచూపు వల్లే దేశం ఆకలి కేకల నుంచి ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అగ్రికల్చర్ యాక్ట్ తెచ్చి అసైన్డ్ భూములను పేదలకు పంపకం చేయడమే కాకుండా, రైతుల పంటలకు మద్దతు ధరను తీసుకొచ్చిన ఘనత సాధించారన్నారు. అలాగే సోనియా గాంధీ తెచ్చిన ఆహార భద్రత చట్టం, కాంగ్రెస్ హయాంలో వచ్చిన పిడిఎస్ రేషన్ వ్యవస్థ వల్లే నేడు తెలంగాణలో 3 కోట్ల 48 లక్షల మందికి సాంబబియ్యం అందించగలుగుతున్నామని గుర్తుచేశారు.

### వైఎస్‌కు రేవంత్‌రెడ్డి నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని సిఎం అధికారిక నివాసంలో వైఎస్ఆర్ చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. సాగు నీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగు రోడ్డు వంటి అభివృద్ధి పనులు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో పరిపాలనపై చెరగని ముద్ర వేసిన నాయకుడు డాక్టర్ వైఎస్ఆర్ సేవలను సిఎం స్మరించుకున్నారు. కీ.శే. వైఎస్ఆర్‌కు నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపిలు డాక్టర్ మల్లు రవి, ఎం.అనిల్ కుమార్ యాదవ్, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్ ఉన్నారు.

## వేగిరపరచండి

(మొదటి పేజీ తరువాయి)

పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలిపారు. తెలంగాణలో చాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెప్పారు. హుస్సేన్ సాగర్‌లో సిప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపిలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం సెక్రటరీ మాణిక్ రాజ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గ్లోబల్ సమ్మిట్– రక్షణ ఎక్స్‌పోలో భాగస్వాములు కండి**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్‌వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో బుధవారం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్ఠాత్మక ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సిఎం తెలిపారు. దేశ వ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్ యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. రక్షణ ఎక్సపో2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనే విధంగా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సిఎం విజ్ఞప్తి చేశారు. హెచ్ఎఎల్, బిఈఎల్, బిడిఎల్, ఎండిఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డిఆర్‌డిఓ ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూ సేకరణ చేపట్టిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. రక్షణ శాఖ మొత్తం 1500 ఎకరాలు కోరినందున, మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డిఆర్‌డిఓ) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టిజిఐఐసి అంగీకరించిందని రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండు సార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపిలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేష్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

## జల సంరక్షణ పనులు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలను ఏకీకృత ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు.ఎన్ని నిర్మాణాలు చేపట్టామన్నదానికంటే ఎంత నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది, ఎంత భూగర్భ జల పునరుద్ధరణ జరిగింది, నీటిమట్టాలు ఎంత మెరుగయ్యాయి, ఏడాది పొడవునా ఎంత నీరు అందుబాటులోకి వచ్చిందనే ఫలితాల ఆధారంగా పనితీరును అంచనా వేయాలని పేర్కొన్నారు.

**తెలంగాణలో 22,428 జలవనరుల పునరుద్ధరణ :**
తెలంగాణలో 44,360 చెరువులు, జలవనరులు ఉండగా 28,739లో పనులు చేపట్టి, 22,428 జలవనరుల పునరుద్ధరణ పూర్తిచేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2026–29 మూడేళ్ల ప్రణాళికలో 17.28 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడం,స్థిరీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు రూ.46,110.35 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు చెప్పారు. చెరువుల గొలుసుకట్టు వ్యవస్థలను ఫీడర్, మిగులు నీటి కాలువలతో సహా సమగ్రంగా పునరుద్ధరించాలని కోరారు. ఆక్రమణలు, అడ్డంకులను తొలగించి ఎఫ్‌టీఎల్ పరిధిని పరిరక్షించాలని, అధికారిక రికార్డులను నవీకరించాలని సూచించారు. భూగర్భజలాల అధిక వినియోగం ఉన్న ప్రాంతాలు, కరవు ప్రభావిత ప్రాంతాలు, తాగునీటి కొరత ఉన్న గ్రామాలకు జల సంరక్షణ పనుల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.తెలంగాణలోని 159 భారీ, మధ్యతరహా జలాశయాల మొత్తం నిల్వ సామర్థ్యం సుమారు 929 టీఎంసీలు కాగా, 18 ప్రాజెక్టులపై నిర్వహించిన అధ్యయనంలో 222.90 టిఎంసిల సామర్థ్యంలో 40.97 టిఎంసిలు పూడిక కారణంగా కోల్పోయినట్లు తెలిపారు. దిగువ మానేరు, మధ్య మానేరు, కడెం జలాశయాల్లో ప్రయోగాత్మకంగా పూడికతీత చేపట్టి 9.51 లక్షల మెట్రిక్ టన్నుల పూడికను తొలగించి 3.74 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే లక్ష్యమన్నారు.

**ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన కింద ఆర్థిక సహాయం :**
ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన కింద అర్హత కలిగిన తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహాయం అందించాలని, పర్యావరణ అనుమతులను నిర్దిష్ట కాలపరిమితిలో మంజూరు చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. అంతర్రాష్ట్ర జల వివాదాలను సకాలంలో పరిష్కరించడంతోపాటు జలాశయాల సామర్థ్య అధ్యయనాలు, పునరుద్ధరణకు సాంకేతిక, ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

వర్షపాతం, నదీ ప్రవాహాల అంచనా, జలాశయాల నిర్వహణలో కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికతను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రతి గ్రామం, పట్టణానికి జలభద్రతా ప్రణాళిక రూపొందించి,వాటిని రాష్ట్రస్థాయి ఏకీకృత జల ఆస్తుల రిజిస్టర్, ఉమ్మడి పనితీరు కొలమానాల వ్యవస్థతో అనుసంధానించాలని ప్రతిపాదించారు. ఖర్చు చేసే ప్రతి రూపాయి, నిర్మించే ప్రతి జల సంరక్షణ ఆస్తి కొలవగలిగే, శాశ్వతమైన జల ప్రయోజనాన్ని అందించేలా చర్యలు ఉండాలని స్పష్టం చేశారు.

## పూర్తి విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. వాన వస్తే వాతలు మానిపోవని, ప్రస్తుత తమ వెయ్యి రోజుల పాలనను విమర్శిస్తే గతంలో 3,475రోజుల పాలనలో బిఆర్ఎస్ చేసిన అన్యాయాలు, అక్రమాలు మాసిపోవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను కొనసాగిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను పరిశీలించి,అర్హమైన బిల్లులను చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సర్పంచులు, కాంట్రాక్టర్లు, వివిధ అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను కూడా తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి వెయ్యి కోట్లను, ఉస్మానియా యూనివర్సిటీకి నిధులను మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికలే తమకు రెఫరెండమని, ప్రజలు ఎవరి వైపు ఉన్నారో వరుస ఎన్నికల్లో ఇచ్చిన తీర్పులే చెబుతున్నాయన్నారు.

**త్వరలో మూడు లక్షల పెన్షన్లు..**
త్వరలో మూడు లక్షలకుపైగా పెన్షన్లను ప్రజలకు మంజూరు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, విత్తనాలు, ఎరువుల సబ్సిడీలు, పంటలకు ప్రోత్సాహకాలు తదితర కార్యక్రమాలను కలిపి వెయ్యి రోజుల్లో సుమారు రూ.1.76 లక్షల కోట్లను రైతు సంక్షేమానికి వెచ్చించామన్నారు. బతుకమ్మ చీరలో కూడా బిఆర్ఎస్ కమీషన్లకు పాల్పడిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం నాణ్యమైన చీరలను పంపిణీ చేసిందని, రాబోయే రోజుల్లో మహిళలకు చిలుక పచ్చ చీరలను పంపిణీ చేయనున్నామన్నారు.

**బిజెపి, బిఆర్ఎస్ మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్..**
బిజెపి, బిఆర్ఎస్ మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ ఉన్నదని, ఈ రెండు పార్టీలు ఒక తాను ముక్కలేనని, ఈ విషయం అందరికి తెలుసని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. మళ్లీ అధికారంలోనికి వస్తామని బిఆర్ఎస్ పగటికలలు కంటుందన్నారు. తాను ఒక కాంట్రాక్టర్‌గా అంచలంచలుగా ఎదిగానని, కానీ ఆయనకు (హరీశ్‌రావు) వేలకోట్ల రూపాయాలు ఎలా వచ్చాయని, పాలను విక్రయించి డబ్బులు సంపాదించారా, బిఆర్ఎస్‌కు రూ.14వందల కోట్లు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ప్రధానప్రతిపక్ష నేతకు వెయ్యి రోజుల్లో రూ. 21 కోట్ల వరకు బదిలీ అయ్యాయని, కానీ ఆయన ప్రజల కోసం 21 పైసల పనినైనా చేశారా? అని ఎద్దేవా చేశారు.

# గెలిపించిన తిలక్ వర్మ.. ఫైనల్‌కు సౌత్ జోన్



ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ–2026లో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం ముగిసిన సెమీఫైనల్ –2లో సమష్టిగా రాణించిన సౌత్ జోన్ 7 వికెట్ల తేడాతో నార్త్ జోన్‌ను ఓడించింది. కెప్టెన్ తిలక్ వర్మ(116 నాటౌట్, 51 నాటౌట్) అద్వితీయమైన బ్యాటింగ్‌తో సౌత్ జోన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 181 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ 43.1 ఓవర్లలో 3 వికెట్లకు 182 పరుగులు చేసి గెలుపొందింది. తిలక్ వర్మ(79 బంతుల్లో 8 ఫోర్లతో 51 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. రవిచంద్రన్ స్మరణ్(32 నాటౌట్), నారయణ జగదీషన్(43), రికీ భూయ్(42) ఫర్వాలేదనిపించారు. నార్త్ జోన్ బౌలర్లలో అబిద్ ముస్తాక్ రెండు వికెట్లు తీయగా.. గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ పడగొట్టాడు.

**నార్త్ జోన్ 297 ఆలౌట్..** అంతకుముందు 256/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్ 297 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్‌కు 41 పరుగులు మాత్రమే జోడించి చివరి మూడు వికెట్లు కోల్పోయింది. సనత్ సంగ్వాన్(148 బంతుల్లో 8 ఫోర్లతో 76), ఆయుష్ డోసెజా(76 బంతుల్లో 5 ఫోర్లతో 52) హాఫ్ సెంచరీలో రాణించారు. ఓప్నట్ బ్యాటర్ అన్షుల్ కాంబోజ్ 36 పరుగులే చేశాడు. సౌత్ జోన్ బౌలర్లలో నిదీష్(5/56) ఐదు వికెట్లతో సత్తా చాటగా.. కావురి సాయితేజ, శ్రేయాస్ గోపాల్ తలో రెండో వికెట్లు పడగొట్టారు. విద్వత్ కావేరప్ప ఒక వికెట్ తీసాడు. తొలి ఇన్నింగ్స్లో సౌత్ జోన్‌కు 117 పరుగుల ఆధిక్యం దక్కడంతో లక్ష్యం 182 పరుగులే అయ్యింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నార్త్ జోన్ 59.1 ఓవర్లలో 195 పరుగులకు కుప్పకూలింది. ఖమ్రాన్ ఇక్బాల్(182 బంతుల్లో 10 ఫోర్లు, సిక్సో 76) ఒక్కడే హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. కన్హయ వధవాన్(35) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సౌత్ జోన్ బౌలర్లలో విద్వత్ కావేరప్ప(4/64) నాలుగు వికెట్లు తీయగా.. నిదీష్(2/36), తనయ్ త్యాగరాజన్ (2/31)రెండేసి వికెట్లు పడగొట్టగా, కావురి సాయితేజ, శ్రేయాస్ గోపాల్‌కు చెరో వికెట్ దక్కింది.

**తిలక్ వర్మ అజేయ శతకం..** అనంతరం సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 100.3 ఓవర్లలో 312 పరుగులకు కుప్పకూలింది. తిలక్ వర్మ(250 బంతుల్లో 9 ఫోర్లతో 116 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. శ్రేయస్ గోపాల్(169 బంతుల్లో 11 ఫోర్లతో 87) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. నార్త్ జోన్ బౌలర్లలో గుర్నూర్ బ్రార్ (4/88) నాలుగు వికెట్లు తీయగా.. అర్షదీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అబిద్ ముస్తాక్‌కు ఒక వికెట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో అజేయ శతకం.. రెండో ఇన్నింగ్స్‌లో అజేయ హాఫ్ సెంచరీతో రాణించిన కెప్టెన్ తిలక్ వర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ అమీతుమీ తేల్చుకోనుంది. చెన్నై వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.

# నేడు బిసిసిఐ కీలక సమావేశం..తేలిపోనున్న రోహిత్ భవితవ్యం



భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) అత్యున్నత స్థాయి సమావేశానికి సిద్ధమైంది. గురువారం ముంబైలోని బిసిసిఐ హెడ్ క్వార్టర్స్‌లో ఈ మీటింగ్ నిర్వహించనుంది. సమావేశానికి సంబంధించిన ఎజెండాను అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఐర్లాండ్, ఇంగ్లండ్, శ్రీలంక పర్యటనల్లో భారత జట్టు ప్రదర్శనపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సిఒఇ హెడ్ వివిఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్మన్ గిల్ హాజరుకానున్నారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వర్చువల్గా పాల్గొననున్నాడు. ఐసిసి టి–20 ప్రపంచ కప్ విజయానంతరం.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ జట్టు దారుణంగా విఫలమైంది. వరుసగా 6 టీ20 మ్యాచ్‌లోనూ విజయం సాధించలేకపోయింది. ఈ ఫలితాలపై బిసిసిఐ అప్పట్లోనే ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వైఫల్యాలపై ఖచ్చితంగా సమీక్ష చేస్తామని సెక్రటరీ దేవజిత్ సైకియా అప్పట్లోనే మీడియాకు తెలిపారు.

**తేలిపోనున్న రోహిత్ భవితవ్యం..** టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ భవితవ్యంపై బిసిసిఐ, సెలెక్షన్ కమిటీల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. వన్డే ప్రపంచకప్ 2027 వరకు రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం కష్టమని వార్తలు వచ్చాయి. రోహిత్ రిటైర్మెంట్ అంటూ కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ వార్తలను బిసిసిఐ ఖండించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ భవితవ్యంపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. జట్టులో కొనసాగించాలా? వద్దా? అనేదానిపై బిసిసిఐ, మేనేజ్మెంట్ ఏకాభిప్రాయానికి రానుంది. అప్‌కమింగ్ న్యూజిలాండ్ పర్యటనలో అనుసరించాల్సి వ్యూహాలపై కూడా చర్చ జరగనుంది. అంతేకాకుండా జట్టు వేధిస్తున్న ఆటగాళ్ల గాయాల బెడద గురించి సుదీర్ఘంగా చర్చించనున్నారు. ముఖ్యంగా సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌ను వివరణ కోరనున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడగింపుతో పాటు, భారత జట్టు నిర్వహణలో వీవీఎస్ లక్ష్మణ్‌కు మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించే అంశంపై కూడా చర్చలు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సెప్టెంబర్ 18న బిసిసిఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కంటే ముందే ఈ ఉన్నత స్థాయి భేటీ జరుగుతుండటంతో.. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు భారత క్రికెట్ భవిష్యత్తును నిర్దేశిస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ప్రాచీన నగరం 'పెర్గె'






తూర్పు అంటాల్యా సమీపంలోని అక్సు జిల్లాలో ఉన్న పెర్గె అనేది ప్రాచీన పాంఫిలియా ప్రాంతంలోని అత్యంత ముఖ్యమైన పురాతన నగరాలలో ఒక్కటి. క్రీస్తుపూర్వ 12వ శతాబ్దంలో దీనిని స్థాపించినట్లు అంచనా. ఈ నగరం, రోమన్ సామ్రాజ్య కాలంలో అత్యంత వైభవాన్ని సాధించింది. దీని ప్రశాంత శిలాజాలు, విస్తారమైన వీధులు, నీరుతో ప్రవహించే నదీ మార్గాలు, ఘనమైన సాంస్కృతిక వారసత్వం నేడు కూడా కాలానికి సాక్ష్యంగా నిలిచాయి. రోమన్ యుగపు వైభవంరోమన్ కాలంలో పెర్గె కళ, వాణిజ్యం, క్రీడలు, ధర్మపరమైన కార్యక్రమాలకు కేంద్రంగా ఎదిగింది. ఇక్కడి థియేటర్, అగోరా (వాణిజ్య మార్కెట్ చౌరస్తా), స్టేడియం, మహాఫౌంటెన్స్ (నైంఫియం) వంటి నిర్మాణాలు ఆ కాలంలో నగర ప్రజల సామాజిక జీవనశైలిని ప్రతిబింబిస్తాయి. నగర సువిశాలమైన వీధులు కనీసం రెండు వేల సంవత్సరాల తరువాత కూడా ఆకారం మార్చుకోకుండా మిగిలివున్నాయి. ఆర్టెమిస్ ఆలయం పవిత్రకు ప్రతీక. ఈ దేవాలయం ఈ నగరానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. వేట, ప్రకృతి, స్త్రీశక్తికి సాక్ష్యంగా ఉన్న దేవతకు అంకితమైన ఈ ఆలయం పాంఫిలియా ప్రజల ఆధ్యాత్మిక జీవితంలో ప్రధానమైంది. ఇది హెలీనిస్టిక్ శిల్పకళా సౌందర్యాన్ని స్పష్టంగా చూపిస్తుంది. నేడు పెర్గెలో జరుగుతున్న పురావస్తు తవ్వకాలు నగర చరిత్రకు కొత్త వెలుగులు చూపిస్తున్నాయి. విరిగిన తలపాగాలు, రాతి శిల్పాలు, నీరు ప్రవహించే పురాతన కాలువలు, పాంఫిలియన్ లిపిలో చెక్కిన శాసనాలు ప్రాచీన నాగరికతల ఆధ్యాత్మిక, వాణిజ్య జీవన విధానాలను వివరిస్తున్నాయి. ప్రకాశించే వారసత్వంపెర్గె కేవలం శిలాజాల సమాహారంగానూ, మానవ నాగరికత ప్రతిభ, సృజనాత్మకత, సమయాన్ని దాటి నిలిచిన సాంస్కృతిక జ్ఞాపకంగానూ నిలుస్తాయి. ఇక్కడి ప్రతి శిలా శృతిలో కాలం మాటాడుతుంది. ప్రతి స్తంభంలో చరిత్ర దాగి ఉంది. భూమి తల్లి గర్భంలో నిలిచిన ఈ శిలా నగరం మనిషి సృష్టించిన శిల్పకళా చరిత్రను వినిపించే ప్రాణవంతమైన వాక్యం. పాంఫిలియా ప్రపంచానికి చిరస్థాయిగా మిగిలిన గొప్ప వారసత్వం.

## ప్రాచీన ఈజిప్ట్ నాగరికత



ప్రాచీన ఈజిప్ట్ నాగరికతకు చెందిన కనోపిక్ జార్స్. ఇవి న్యూ కింగ్‌డమ్ కాలానికి (క్రీ.పూ.1550–1070) చెందినవిగా పేర్కొంటారు. ఫరావోల సమాధుల్లో వీటిని పూజార్థంగా భద్రపరిచేవారు. ఎందుకంటే ఇవి మృతదేహంలోని ముఖ్య అవయవాల రక్షకులు అని నమ్మకం. ఈ పాత్రలను సాధారణంగా అలబాస్టర్ లేదా సున్నపురాయితో తయారు చేశారు. వాటి మూతలు దేవతల తలల ఆకారంలో లేదా మృతుని రూపంలో చెక్కి ఉన్నాయి. ప్రతిపాత్రలో వేరువేరు అవయవాలను భద్రపరచే వారు. కాలేయం, ఊపిరి తిత్తులు, ఉదరం, పేగులు అనే నాలుగు కీలక అవయవాలను మానవుని ఆత్మపరలోక యాత్రలో ముఖ్యమైనవని ప్రాచీన ఈజిప్టియన్లు విశ్వసించారు. అందుకే, కనోపిక్ జార్స్ రూపకల్పనలో దేవతల రక్షణ భావన అంతర్లీనంగా ఉంటుంది. ప్రతిపాత్రపై ఉన్న దేవత తల, ఆ అవయవాన్ని కాపాడే దేవుని ప్రతీక. ఇవి మరణానంతర జీవితంపై ఈజిప్టియన్ విశ్వాసం, శాశ్వత జీవితం సాధనపై మానవ తపన, శరీర, ఆత్మ పునరేకీకరణపై ధార్మిక నమ్మకంను ప్రతిబింబిస్తాయి. ఈనిర్జీవ పాత్రలు, నిశ్శబ్దంగా మరణశాశ్వతతను కాపాడే సాక్షులుగా నిలిచాయి. వాటి లోపల నిక్షిప్తమైనది కేవలం అవయవాలు మాత్రమే కాదు... మానవుడి అమరత్వ స్వప్నం, మరణంతో చేసే ఒప్పందం, కాలాం తరాల తాత్త్విక నిశ్శబ్దం కూడా. ప్రతి కనోపిక్ జార్, ఈజిప్ట్ నాగరికతలోని మరణం అనేది అంతం కాదు, మార్పుమాత్రమే అన్నభావనకు శాశ్వత ప్రతీకగా నిలుస్తోంది.

## ఎవరు, ఎందుకు నిర్మించారో?



ఇది మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉన్న ఓ కట్టడం. దీనిని ఎవరు, ఎప్పుడు, ఎందుకు నిర్మించారన్నది తెలియడం లేదు. ఇది ఒక కొండ ఆకారంలో ఉన్న శిఖరం. శతాబ్దాల క్రితమే దీని నిర్మాణం జరిగి ఉంటుందని అంచనా. దీనిని చూస్తే, వివిధ సామ్రాజ్యాల చరిత్రను నిశ్శబ్దంగా తనలో ఇముడ్చుకున్నట్టు కనిపిస్తుంది. ఈ శిఖరం సూర్యుని వేడికతో ఎండిపోయిన మట్టి ఇటుకలతో నిర్మితమై ఉంది. గాలితో, కాలంతో చెక్కబడిన ముఖంలా గోచరిస్తుంది. ఇలాంటి నిర్మాణాలు ప్రాచీన కట్టడ నైపుణ్యాలను వివరిస్తాయి. అవి ఎంత స్థిరంగా నిలిచాయో సూచిస్తాయి. కొండాకార శిఖర ఆకారం, సమాంతరమైన గోడల క్యూబిక్ ఆకారంతో కడియంగా భిన్నంగా ఉంది. ఈ శిఖరం నిశ్శబ్దంగా మానవ ఆశయానికి, సృజనాత్మకతకు ప్రతీక గా నిలుస్తుంది. ఇది మనలో చరిత్రలో మునిగిపోయిన కథలను గుర్తు చేసి, ఈ వారసత్వ గోడల్లో దాగిన అనేక అంతర్గత కథలను తెలుసుకునే ఆసక్తిని తెలియజేస్తుంది. ఈ శిఖరం మనల్ని ఎంతోకాల ప్రాచీనత, మానవ సంస్కృతి, ఆత్మవిశ్వాసం, ఆశయాల హేతుబద్ధతపై ఆలోచనలకు ఆహ్వానిస్తుంది. ఇది మన చరిత్ర పొరల్ని ఊహించే ఒక నిశ్శబ్ద వేదిక.

# పోరాట ఫలితమే కార్మికుల అగ్రిమెంట్ల సాధన

పెరిక్స్‌పై ఇన్‌కమ్ టాక్స్ రద్దుకు అంగీకరించిన యాజమాన్యం
సొంతింటి కల సహకారానికి మార్గం సుగమం
ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఎఐటియుసి పోరాట ఫలితమే కార్మికుల అగ్రిమెంట్ సాధన అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. సింగరేణి కార్మికులకు పెరిక్స్‌పై ఇన్‌కమ్ టాక్స్ రద్దుకు యాజమాన్యం అంగీకరించిందని ఆయన వెల్లడించారు. బుధవారం కెటికె ఓసి 3 (యూజి) గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. కెటికె ఓసి యూజి గనిలో పిట్ సెక్రటరీ ఎల్.శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎల్‌సి సమావేశంలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను 21 డిమాండ్లను యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న కార్మికుల సొంతింటి కల త్వరలోనే నెరవేరబోతుందని యాజమాన్యం సొంతింటి పథకం అమలుకు ఒప్పందం జరిగిందన్నారు. కార్మికులు సొంత ఇల్లు నిర్మించుకోవడానికి సంబంధించిన అంశంపై అధ్యయనం చేసి, నివేదిక సమర్పించేలా అధ్యయన కమిటీని ఏర్పాటు చేయడానికి యాజమాన్యం అంగీకరించారన్నారు. అలాగే 2016 17 జెఎంఇటిలకు ఓవర్ మాన్ ప్రమోషన్లు కల్పించేందుకు అంగీకరించారన్నారు. ముఖ్యంగా కార్మికులు ఎదుర్కొంటున్న మారు పేర్ల సమస్యను పరిష్కరించేందుకు అంగీకరించారని తెలిపారు. కార్మికుల సహజ మరణం సంభవించిన సందర్భాల్లో కార్మికుల కుటుంబాలకు బ్యాంకు, కంపెనీ ద్వారా మొత్తంగా రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే విధంగా ఒప్పందం చేసుకున్నారని వివరించారు. 149 మంది డిపెండెంట్లకు ఆఫీస్ ఆర్డర్ పెండింగ్‌లో ఉన్న149 మంది డిపెండెంట్లకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వడం కోసం చర్చించడం జరిగిందన్నారు. కార్మికుల రక్షణకు సంబంధించిన పరికరాలు, ఇతర పనిముట్లు త్వరితగతిన అందించడానికి ఒప్పందం చేసుకున్నారన్నారు. మైనింగ్ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్, సూపర్వైజర్, మెడికల్ బోర్డు ఇట్లా అనేక సమస్యలపై యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. కార్మికుల పక్షాన నిత్యం నిరంతరం పోరాటాలు చేసేది ఎఐటియుసి గుర్తింపు సంఘం మాత్రమేనని రాజ్‌కుమార్ అన్నారు. సమావేశంలో ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, నాయకులు నూకల చంద్రమౌళి, జగత్‌రావు, కృష్ణారెడ్డి, లింగయ్య, సోమిరెడ్డి, వెంకటస్వామి, హరీష్, శ్రీనివాస్, మహేందర్‌రావు, లింగయ్య, నగేష్, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శిరీష హంతకుడిని కఠినంగా శిక్షించాలి





ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజన యువతి ఊకే శిరీషపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష విధించాలని ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేశాయి. ఈ మేరకు జిల్లాకేంద్రంలని పోస్టాఫీస్ నుంచి బస్టాండ్‌లోని అమరవీరుల స్థూపం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఫహీమ్ దాదా, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్ మాట్లాడుతూ శిరీష కుటుంబాన్ని విడిచి ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లి విగతజీవిగా తిరిగి రావడం బాధాకరమన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలపై అత్యాచారాలను అరికట్టేందుకు చట్టాలను పటిష్టం గా అమలు చేయాలని, నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనముల సాయి, సహాయ కార్యదర్శి ఎస్‌కే.ఖయ్యూమ్, రవి కిరణ్, నాదీమ్, కొచ్చెర్ల రాకేష్, జావీద్, కొయ్యడ రవి, శివ, బాబా, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు కొరిమి సంజయ్, చిన్ను, అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు

ఎఐటియుసి నేతల పిలుపు
ఎఐటియుసి రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ







**జైనూర్ :** కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు చేయాలని, అందుకు కరీంనగర్‌లో సెప్టెంబర్ 6,7, 8 తేదీల్లో జరిగే ఎఐటియుసి రాష్ట్ర నాలుగో మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. బుధవారం జైనూర్ ఆసుపత్రిలో కార్మికులతో కలిసి ఆయన మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించి, నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, కె. దేవ్ రావు, శంకర్, లలిత, మారుతి, ప్రశాంత్, పరమేశ్వర్, దొందే రావు తదితరులు పాల్గొన్నారు.

**మోటకొండూర్ :** సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో కరీంనగర్‌లో ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభ విజయవంతం చేయాలని మండల కేంద్రంలో యాదాద్రి జిల్లా ఎఐటియుసి అధ్యక్షుడు బొలగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీరకాయల మల్లేష్‌తో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, ఎఐటియుసి మండల అధ్యక్షులు బొట్ల శీను, ప్రధాన కార్యదర్శి బోల శ్రీనివాసు, నాయకులు ఆలేటి బాలరాజు, జీవికలపల్లి గణేష్, కొల్లూరు మల్లేష్, బీరకాయల మధు, జీవికలపల్లి పాండు, ఎత్తరి యాదగిరి,కట్ల శీను, గిరబోయిన సుదర్శన్ పాల్గొన్నారు

**గన్నేరువరం :** కరీంనగర్‌లో జరగబోయే ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, టేకుమల్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం గన్నేరువరం మండల కేంద్రంలో మహాసభల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, నాయకులు పిప్పల కనకయ్య, కూన మల్లయ్య, బుర్ర శ్రీను, ముడికే శ్రీను, దాసరి శ్రీనివాస్, కొర్వి మల్లయ్య, మంగరపు రవి, ఒల్లాల రవి, దుర్మట్ల మల్లేశం, ఒల్లల కనుకయ్య, ముని కంటి రాములు, శ్రీధర్ నర్సింగాపూర్ రవి పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కార్మికులను ఏకం చేసి పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. అచ్చంపేట పట్టణం లో ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి మాదుగుల నరసింహ, నాయకులు నర్ర తిరుపతమ్మ, ఎండి.బషీర్, సత్యం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**కీసర :** సెప్టెంబర్ 6, 7, 8 తేదీలలో కరీంనగర్‌లో నిర్వహించనున్న ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కె.రవిచంద్రన్ పిలుపునిచ్చారు. బుధవారం అల్వాల్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి అల్వాల్ మండల అధ్యక్షుడు బి.నరేందర్, నాయకులు సిహెచ్.తులసి, అమరావతి బాబు, సయ్యద్ కౌసర్, ఏ.నరసింహ, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.










## ప్రజల భాగస్వామ్యంతో ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు విరాళాల సేకరణ




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేసేందుకు యువత, ప్రజల భాగస్వామ్యంతో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ మాట్లాడుతూ విద్య, ఉపాధి, సమానత్వం, ప్రజాస్వామ్యం, శాంతి, శాస్త్రీయ సోషలిజం కోసం నిరంతరం పోరాడుతున్న ఎఐవైఎఫ్ మహాసభలు కేవలం ఒక సంస్థ కార్యక్రమం కాకుండా యువత భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే రాజకీయ, సామాజిక వేదికగా నిలవాలన్నారు. ప్రజల నుంచి స్వచ్ఛందంగా సేకరించిన ప్రతి రూపాయి ఉద్యమ నిర్మాణానికి, మహాసభల నిర్వహణకు వినియోగించబడుతుందని తెలిపారు. ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐవైఎఫ్ అని తెలిపారు. ఈ నెల 8 నుండి 10 తేదీలలో జరిగే రాష్ట్ర మహాసభలలో రాష్ట్రంలో ఉన్న యువజన సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సెప్టెంబర్ 8న జరిగే యువజన ప్రదర్శన, బహిరంగ సభకు యువత పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి, కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, నాయకులు పేరబోయిన పెంటయ్య, పేరబోయిన బంగారు, గోపగాని రాజు, మాటూరి మల్లయ్య, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, అనంతుల నరసింహ, తోటకూరి రాజశేఖర్, సంగీ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 5న నకిరేకల్‌కు సిఎం రేవంత్ రెడ్డి రాక

### పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ** : ఈ నెల 5న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలకు హాజరుకానున్న దృష్ట్యా పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ముఖ్యమంత్రి ఈ నెల 5న హెలికాప్టర్ ద్వారా నకిరేకల్‌కు చేరుకుంటారని,ముందుగా ఏరియా ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేసి అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆయా శాఖల ద్వారా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని,కార్యక్రమానికి జిల్లాకు చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసనసభ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని డీఆర్‌ఓను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్‌ఓ దశరథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## క్యాంప్ ఆఫీస్‌పై బిజెపి దాడి హేయం

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడిన ఘటనను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేయడం హేయమైన చర్య.. ఇది రాజకీయం కాదు.. ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు చేయాలని, ప్రత్యర్థులపై నిర్మాణాత్మక విమర్శలు చేయాలి తప్ప దాడులు, హింసకు పాల్పడటం ప్రజాస్వామ్య సంస్కృతి కాదని అన్నారు. మారణాయుధాలతో క్యాంప్ కార్యాలయంపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా వేదిక అని, భువనగిరిలో ఇలాంటి దాడుల సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు. ఢిల్లీ నుంచి అమిత్ షా డైరెక్షన్లో బండి సంజయ్, బీజేపీ నాయకులు గుండా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇటీవల నల్గొండలో మంత్రి ఇంటిపై జరిగిన దాడిని కూడా ప్రస్తావిస్తూ, బీజేపీ హింసాత్మక రాజకీయాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పట్టణ కౌన్సిలర్లు, పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్స్,పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అప్పుల కుప్ప

### మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని భారీగా అప్పులపాలు చేసిందని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలో విద్యానగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే మహిళలు, రైతులు, పేదలు, మధ్య తరగతి వర్గాలు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజాసమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత ఉందని, అయితే ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ బైరు శైలేందర్, ఎల్గూరి ఇందిర వీరయ్య గౌడ్, నాయకులు కుందమల్ల శేఖర్, షేక్ అబ్దుల్ కరీం, శనగాని రాంబాబు, పందిరి మల్లేష్ గౌడ్, రమాదేవి, నకిరేకంటి వెంకన్న పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్త : డిఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : విద్యార్థులు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ తెలిపారు. సూర్యాపేట పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, విద్యార్థుల ఉత్తమ ప్రవర్తనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గుర్తు తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దని, ఓటిపిలు, వ్యక్తిగత వివరాలను ఎవరికి షేర్ చేయకూడదని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. పట్టణ సిఐ వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన ఉత్తమ ప్రవర్తనను అలవర్చుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్‌జిఓస్ నుండి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం తగ్గింపు కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక పథకం కింద సూర్యాపేట జిల్లాలో 2026/27 సంవత్సరంకి జిల్లా డిస్ట్రిక్ట్ డిఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం కోసం ఆసక్తి, అర్హత కలిగిన స్వచ్ఛంద ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జిఓస్) నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహా రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన సంస్థలు ఈఅనుదాన్ పోర్టల్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కొరకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో నందు పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

# నకిరేకల్ 'పుర'పై ఆశలు

డిసెంబర్‌లో మున్సిపాలిటీ ఎన్నికలు

చైర్మన్ కుర్చీ జనరల్ కేటాయింపు

ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఆశావహులు

'పుర' పీఠంపై ఎవరి గురి..? సిఎం పర్యటనతో.. ఎన్నికలపై చర్చ






**ప్రజాపక్షం/నకిరేకల్** : ఎన్నికలు జరుగుతాయో.. లేదో తెలియదు! తేదీ ఖరారు కాలేదు.. నోటిఫికేషన్ ఊసే లేదు! అయినా నకిరేకల్‌లో పుర' రాజకీయ సందడి మొదలైంది. డిసెంబరులో రెండో దశ మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. దీంతో నకిరేకల్‌లోని ఆశావహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో చురుగ్గా పాల్గొంటూ.. ప్రజలకు చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు చైర్మన్ స్థానం జనరల్ కేటగిరీకి కేటాయించడంతో పుర' పీఠంపై పోటీపై ఆసక్తి పెరిగింది. ఈ నెల 5న సిఎం రేవంత్‌రెడ్డి నకిరేకల్ పర్యటన నేపథ్యంలో ఎన్నికలపై ఏదైనా స్పష్టత వస్తుందా? అన్న చర్చ మొదలైంది.

**రెండో దశలో..11 స్థానిక సంస్థల ఎన్నికలు**

రాష్ట్రంలో గత ఫిబ్రవరిలో పట్టణ స్థానిక సంస్థల (యూఎల్‌బీ) సాధారణ ఎన్నికలు జరిగాయి.అయితే ఐదు కార్పొరేషన్లు సైబరాబాద్, మల్కాజ్‌గిరి,హైదరాబాద్, వరంగల్, ఖమ్మంతో పాటు వివిధ కారణాలతో అచ్చంపేట,మందమర్రి,మణుగూరు, నకిరేకల్, కొత్తూరు, సిద్ధిపేట ఆరు పురపాలికలకు ఎన్నికలు జరగలేదు. వీటన్నింటికీ ఈ ఏడాది డిసెంబరులో ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల ప్రక్రియకు కదలిక వచ్చే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.

**పట్టణం.. ఓటర్ల లెక్క**

2011 జనగణన ప్రకారం నకిరేకల్ పురపాలక జనాభా 29,126. ఇందులో పురుషులు 14,345, మహిళలు 14,781 మంది. ప్రస్తుతం జనాభా సుమారు 35 వేల వరకు ఉంటుందని అంచనా. మున్సిపాలిటీ విస్తీర్ణం 17.10 చదరపు కిలోమీటర్లు. సుమారు 9,232 నివాసాలు ఉన్నాయి. తాజా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 21,820 మంది. వీరిలో పురుషులు 10,631, మహిళలు 11,189. మొత్తం 20 వార్డులు ఉన్నాయి. 2026/27 వార్షిక బడ్జెట్ రూ.26.20 కోట్లుగా ఉంది.

**ఎస్ఐఆర్‌లో.. ఆశావహుల హడావుడి**

ఓటర్ల జాబితా సవరణలో కొందరు ఆశావహులు బీఎల్‌వోలతో కలిసి చురుగ్గా పనిచేస్తున్నారు. ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, వాటిని పూరించడంలో సహకారం, నోటీసులు అందిన ఓటర్లకు సమాచారం చేరవేయడం వంటి పనుల్లో పాల్గొంటున్నారు. ఇందిరమ్మ చీరలు, చేయూత పింఛన్ల దరఖాస్తులు తదితర కార్యక్రమాల్లోనూ అర్హులకు సహకరిస్తూ ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు.

**చైర్మన్ స్థానం.. జనరల్**

రానున్న ఎన్నికల్లో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు ప్రభుత్వం జనవరిలోనే గెజిట్‌లో ప్రకటించింది. 2021లో ఈ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు కాగా..ఈసారి జనరల్ కేటాయింపుతో ఆశావహుల్లో ఆసక్తి పెరిగింది. వార్డుల రిజర్వేషన్లు ఎన్నికల ముందు ఖరారు కానున్నాయి.2020లో ఏర్పడిన నకిరేకల్ మున్సిపాలిటీకి 2021 ఏప్రిల్ 30న తొలిసారి ఎన్నికలు జరిగాయి. తొలి పాలకవర్గం గడువు ఈ ఏడాది మే 6తో ముగియడంతో ప్రత్యేక అధికారి పాలన అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో నకిరేకల్ పాలకవర్గం గడువు కొనసాగుతుండటంతో ఇక్కడ ఎన్నికలు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం జిల్లాలో పాలకవర్గం లేని ఏకైక మున్సిపాలిటీగా నకిరేకల్ ఉంది.

**గత అనుభవాలు.. కొత్త లెక్కలు**

తొలి పాలకవర్గం కాలంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఐదేళ్లలో ఇద్దరు చైర్మన్లు పనిచేశారు. బీఆర్ఎస్ నుంచి చైర్మన్ కొనసాగిన అనంతరం అవిశ్వాస పరిణామాలతో కాంగ్రెస్ నుంచి చైర్మన్ పదవి కొనసాగింది.ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్ శ్రేణులు తమకు అనుకూల ఫలితాలపై ధీమాగా ఉన్నట్లు, బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ పనితీరు, స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నట్లు చర్చ జరుగుతోంది. వామపక్షాలు,బీజేపీ, ఇతర పార్టీలు ఒంటరిగా బరిలోకి దిగుతాయా? లేక స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇతర పక్షాలతో కలిసి పనిచేస్తాయా? ప్రతిపక్ష ,అధికార పార్టీల రెబల్స్ ఎటువైపు అన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

**సిఎం పర్యటన.. ఎన్నికలకు నాందేనా**

ఈ నెల 5న సీఎం రేవంత్‌రెడ్డి నకిరేకల్‌లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలపై ఏదైనా ప్రస్తావన ఉంటుందా? డిసెంబరు ఎన్నికలపై సంకేతం ఇస్తారా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే ఎన్నికల నిర్వహణపై అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిపై స్పష్టత లేదు.ఎన్నికల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా.. డిసెంబరు అవకాశాల నేపథ్యంలో నకిరేకల్‌లో రాజకీయ కదలికలు మొదలయ్యాయి. చైర్మన్ స్థానానికి జనరల్ రిజర్వేషన్, ఓటర్ల జాబితా సవరణ, ఆశావహుల కదలికలు, సిఎం పర్యటనతో 'పుర' రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఎన్నికల ముహూర్తం ఎప్పుడొచ్చినా.. నకిరేకల్ పుర' పీఠం ఎవరిదన్నదే ఇప్పుడు చర్చ జోరుగా సాగుతుంది.

## పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థాయి

### యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/యాదాద్రి** : విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని, పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరి మండలం అనంతారం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజనం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పరీక్షలకు సిద్ధమవుతున్న విధానం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి క్రీడలు, ఐటీ, సాంకేతికత, కళలు తదితర వివిధ రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల విషయంలో విద్యార్థులు అనవసరమైన ఒత్తిడికి గురికావద్దని తెలిపారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, విద్యార్థుల విద్యా ప్రగతిపై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లు, తరగతి గదులు, ఇతర మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఉందని తెలిపారు. మరుగుదొడ్లను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కిచెన్లో ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రతను పరిశీలించారు. స్టోర్ రూమ్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలను తనిఖీ చేశారు. విద్యార్థులకు గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలు అందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి మాధవి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న జెల్ల, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మండలం జలాల్పురం గ్రామంలో ఉన్న రామానంద తీర్థ శిక్షణ సంస్థలో ఉచిత ఉపాధి శిక్షణకు అర్హులైన యువతి యువకుల నుండి దరఖాస్తులను ఆహ్వానించేందుకు ప్రవేశ ప్రకటన బుధవారం విడుదల చేసింది. పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ తెలంగాణా ప్రభుత్వం అధ్వర్యంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా గ్రామీణ యువతీ యువకులకు ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ ఇవ్వబడుతుందనీ తెలిపారు.శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలల కాల వ్యవధితో ఎకౌంట్స్ ఎక్సిక్యూటివ్ (బి.కామ్ పాస్), పదవ తరగతి ఉత్తీర్ణతతో సోలార్ టెక్నిషియన్,ఎలక్ట్రిషియన్ ( హోమ్ అప్లయిన్స్, మోటార్ వైండింగ్, హౌస్ వైరింగ్), ఆటోమొబైల్ టూ వీలర్ సర్వీస్ టెక్నిషియన్,మొబైల్ టెక్నిషియన్ సి.సి టివీ ఇన్ స్టాలేషన్, ఇంటర్ పాస్ తో కంప్యూటర్ హర్డ్ వేర్ డాట ఎంట్రీ ఆపరేటర్ (డిజిటల్ మిత్ర) అభ్యర్థులు అర్హులు వయసు 18 నుండి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.విద్యార్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్స్, ఆధార్, క్యాస్ట్, ఫొటోలతో సంస్థలో 16న హజరు కావాలని సంస్థ డైరెక్టర్ డా ఎన్ కిషోర్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9133908000, 9133 908 111, 9133908222, 9948466111 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

## చివరి పంటలకూ సాగునీరు

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ**: సరైన సమయంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో నీటి లభ్యతపై దృష్టిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అందుబాటులో ఉన్న డిండి ప్రాజెక్టు నీటిని పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించి ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు చివరి వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఆదేశించారు. రైతులు కూడా నీటిని వృధా చేయకుండా పొదుపుగా వినియోగించేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో రైతులు, ప్రజలకు ఎక్కడా విద్యుత్ అంతరాయం కలగకుండా, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన వెంటనే మరమతులు చేసి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. రైతులకు విద్యుత్ , సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంఎల్‌ఏ తెలిపారు. ఈ సమీక్షలో విద్యుత్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



## శాంతియుతంగా వినాయక ఉత్సవాలు



అందరూ కలిసి మెలిసి ఉత్సవాలు నిర్వహించాలని
జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందరూ కలిసిమెలిసి ఈ సంవత్సరపు వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో గతంలో అన్ని ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలను కూడా శాంతియుతంగా నిర్వహించేలా అందరూ సహకరించాలని కోరారు.గత ఏడాది ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని,నిమజ్జనం చేసే ప్రదేశాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఎల్ నినో ప్రభావం వల్ల చెరువులు,కుంటలు,కాలువల్లో నీరు లేనందున ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని,ఈ విషయాన్ని విగ్రహాలు ప్రతిష్టించే వారికి, ప్రజలకు ముందుగానే తెలియజేయాలన్నారు.నల్లగొండ మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆఫీజ్ ఖాన్ మాట్లాడుతూ పండగలు అందరివని, అందరూ కలిసి శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఇంఛార్జ్ కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,డిఆర్‌ఓ దశరథ్,ఆర్‌డిఓలు అశోక్ రెడ్డి,రమణారెడ్డి,శ్రీదేవి,అడిషనల్ ఎస్‌పి రమేష్,డిఎస్‌పిలు,శాంతి కమిటీ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, వీర్ల చంద్రశేఖర్,గుమ్మల మోహన్ రెడ్డి,మాజీ జెడ్‌పిటీసీ లక్ష్మయ్య, పిచ్చయ్య, మహమ్మద్ సలీం,పశువుల సారయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్,గేమింగ్‌కు బానిసై వరుస దొంగతనాలు

### ఎంబిఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ యువకుడి నేర బాట

### రూ.22.10 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు,ద్విచక్ర వాహనం స్వాధీనం



**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి:** ఆన్‌లైన్ ట్రేడింగ్,ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై భారీగా డబ్బు కోల్పోయి అప్పుల పాలైన ఓ యువకుడు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు.జిల్లాలో జరిగిన చోరీ కేసులను ఛేదించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.22.10 లక్షల విలువైన బంగారం, వెండి,నగదు,ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నా వివరాలను నల్లగొండ డిఎస్‌పి కె.శివారెడ్డి పత్రికా సమావేశంలో వెల్లడించారు.మండలంలోని జువ్విగూడెం గ్రామానికి చెందిన అలుగుబెల్లి రాము అలియాస్ జయరాం రెడ్డి (29) ఎంబిఏ పూర్తి చేశాడు. గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన అతను ప్రస్తుతం సేల్స్ అండ్ మార్కెటింగ్ రంగంలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ ట్రేడింగ్,గేమింగ్‌కు అలవాటుపడి భారీగా డబ్బులు నష్టపోయాడు.దీంతో అప్పుల పాలై వాటిని తీర్చేందుకు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో దొంగతనాల బాట పట్టినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. గ్రామాల్లో పెళ్లిళ్లు,నిశ్చితార్థాలు,ఇతర శుభకార్యాలకు కుటుంబ సభ్యులు వెళ్లిన సమయంలో ఇళ్లకు పగటిపూట తాళాలు వేసి ఉండటాన్ని నిందితుడు గమనించేవాడు. ముందుగా పరిసరాలను పరిశీలించి,ఎవరూ లేని సమయం చూసుకుని తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారం,వెండి,నగదు తదితర విలువైన వస్తువులను అపహరించేవాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి 12 తులాల బంగారం,16 తులాల వెండి, రూ.2.50 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ సుమారు రూ.22.10 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. వరుస చోరీలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని సేకరించి నిందితుడిని గుర్తించారు.ఈ కేసు ఛేదనలో సీఐ సిరికొండ సురేష్,నార్కెట్‌పల్లి ఎస్ఐ పి. విష్ణుమూర్తి,పోలీసు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

## విజయానికి మధ్య మార్గాలు ఉండవు

### ఎస్‌పి కె. నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** విజయానికి మధ్య మార్గాలు ఉండవని నిరంతర కృషి, సాధన చేస్తూ లక్ష్యంతో శ్రమిస్తే జీవితంలో మంచి విజయాలు వస్తాయని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. పోలీసు ప్రజాభరోసా కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి బాలెంల గ్రామ సమీపంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల డిగ్రీ కళాశాల నందు సామాజిక అంశాలు, సైబర్ జాగ్రత్త అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి ముఖ్య అతిధిగా హాజరై సామాజిక భద్రత, సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా భద్రత, లక్ష్య సాధన, ఉన్నత లక్ష్యాలు మొదలు అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గొప్ప గొప్ప లక్ష్యాలు, పెద్ద ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని యువత విద్యార్థులు ముందుకు సాగి జీవితంలో మంచిగా స్థిరపడాలన్నారు. సమాజానికి సేవ చేసే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సోషల్‌మీడియా ప్రభావం వల్ల యువత ఏకాగ్రతను లక్ష్యాలను కోల్పోతున్నారని తెలిపారు ఈ విషయాల పట్ల తల్లి దండ్రులను, ఇతరులను విద్యార్థులు చైతన్యవంతం చేయాలన్నారు. విద్యార్థులు మహిళల రక్షణలో పోలీస్ అక్క కార్యక్రమం ద్వారా పటిష్టంగా పనిచేస్తున్నామని షీ టీమ్స్ భరోసా సెంటర్ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి, షీ టీమ్స్ ఎస్ఐ నీలిమ, పోలీసు సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/భైంసా :** రాబోయే గణేష్ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని, ప్రజలు ఎలాంటి సైబర్ మోసాలకు గురికాకుండా సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'బి సైబర్ వైస్–లార్డ్ గణేశ టీచెస్ అస్' అవగాహన పోస్టర్‌ను జిల్లా ఎస్‌పి డా. జి. జానకి షర్మిల ఆవిష్కరించారు.గణేష్ ఉత్సవాల సమయంలో ప్రజలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరే అవకాశం ఉన్నందున, అదే సమయంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి సూచించారు. ఒటపిలు, ఎటిఎం/బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు.సైబర్ నేరాల నివారణలో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో, గణేష్ మండపాల వద్ద, కళాశాలలు, విద్యాసంస్థల్లో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ప్రజలు యువతకు సైబర్ నేరాలపై జాగ్రత్తలు,ఆన్‌లైన్ మోసాల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులకు జిల్లా ఎస్‌పి ఆదేశాలు జారీ చేశారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చే విరాళాల అభ్యర్థనలు, నకిలీ క్యూఆర్ కోడ్‌లు,ఫేక్ అకౌంట్లు, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ ఆఫర్లు వంటి వాటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, అలాగే 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని జిల్లా ఎస్‌పి తెలిపారు.అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ – ఆలోచించి క్లిక్ చేయండి, సురక్షితంగా ఉండండి" అనే సందేశాన్ని గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో భైంసా ఎఎస్‌పి సాయి కిరణ్, సైబర్ క్రైమ్ ఎస్‌ఐ ముత్యం,ఎస్‌ఐ శ్రావణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** భారత ఎన్నికల సంఘం ఆదేశాలు మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్నందున అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఓటరు జాబితాలో తమ పేరు ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఎస్‌ఐఆర్ షెడ్యూల్ భాగంగా 2026 ఆగస్టు 17 న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందని తెలిపారు. ముసాయిదా జాబితాలో తమ పేరు వయస్సు చిరునానా తదితర వివరాలను పరిశీలించుకోవాలని ఏవైనా తప్పులు , మార్పులు, లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్ధేశిత గడువులోగా సంబందిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వద్ద క్లెయిమ్‌లు అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరారు. క్లెయిమ్స్ అభ్యంతరాలు స్వీకరణకు గడువు 16 వరకు ఉందని తెలిపారు. అర్హత కలిగిన పౌరులు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు వివరాల సవరణ తదితర అంశాల సంబందించిన క్లెయిమ్‌లు అభ్యంతరాలను ఇఆర్‌ఒ వద్ద నిర్దేశిత విధానంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు. క్లెయిమ్ అభ్యంతరంపై సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి తీసుకున్న నిర్ణయంపై సంతృప్తి చెందిన వారు రెండవ అప్పీల్ అధికారిగా చీఫ్ ఎలక్టోరల్ అధికారికి అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

## అర్హత కలిగిన ప్రతీ ఓటు నమోదై ఉండాలి: కలెక్టర్ ప్రతిమాసింగ్



**ప్రజాపక్షం/శివ్వంపేట :** అర్హత కలిగిన ప్రతీ ఓటు నమోదై ఉండాలని, అనర్హత కలిగిన ఓటును తొలగించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఎస్‌ఐఆర్ హియరింగ్ కేసులను నర్సాపూర్ ఆర్‌డిఒ రామకృష్ణ, తహసీల్దార్ కమలాద్రితో కలసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో సందర్శించి సర్‌కు సంబంధించి ఓటరు జాబితాలో గుర్తించబడిన తప్పుల సవరణకు జారీ చేసిన నోటీసులను విచారణ ప్రక్రియను, బిఎల్‌ఒ యాప్‌నందు నమోదు చేసి పంపు విధానం, ఎఇఆర్‌ఒ లాగిన్ నందు ధృవీకరణ ప్రక్రియను పరిశీలించడం జరిగింది. అర్హత కలిగిన ప్రతీ ఓటు నమోదై ఉండాలని, అనర్హత కలిగిన ఓటును తొలగించాలని సర్ ప్రక్రియను ఖచ్చితంగా జరగాలని ఆమె అధికారులను సూచించారు. కొత్తపేట గ్రామానికి సంబంధించిన 187 అనామలీస్ పేరు, వయస్సు పొరపాట్లు 2002 సంవత్సరానికి సంబందించి ఓటరు వారి పూర్వీకుల పేరుతో జత చేయలేకపోవడం వంటి మొత్తం 227 తప్పులను గుర్తించడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు 78 మంది వారికి సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పించగా ఆన్‌లైన్ నందు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగనబోయిన రాములు, అధికారులు పాల్గొన్నారు.

## ఆలయ ప్రహరీ నిర్మాణానికి నిధులు



**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం బాలనగర్ గ్రామంలోని హనుమాన్ ఆలయ ప్రహరి గోడ నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు గ్రామ సర్పంచ్ కొమిరె రాజు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయ ప్రహరి గోడ నిర్మాణం కోసం రూ. 3 లక్షల నిధులు మంజూరు చేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీని అందచేశారన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారని, ప్రహరి గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమిరె రాజు, ఉప సర్పంచ్ బోడాస్ శ్రీనివాస్, వార్డు సభ్యులు బోడాస్ బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పుంజు గంగా నర్సయ్య, టిఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పెద్ద మల్లేష్, విడిసి సభ్యులు గంగాధర్, హన్మండ్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల ప్రజాపాలన భేష్



**ప్రజాసంక్షేమాభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట**
**ఎమ్మెల్యే భూపతిరెడ్డి**

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాంగ్రెస్ వెయ్యి రోజుల ప్రజాపాలన బేష్‌గా ఉందని, ప్రజాసంక్షేమం అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. బుధవారం రూరల్ క్యాంప్ కార్యాలయంలో మాజీ సిఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్థంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారంతో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుందని, ప్రజల ఆదరాభిమానాలను చూరగొందన్నారు. ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యం ఏర్పడి వెయ్యి రోజులలో ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. బిఆర్‌ఎస్ తొమ్మిదిన్నర ఏళ్ల పాలించి ధనిక తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారన్నారు. కాళేశ్వరం కూలేశ్వరంగా మార్చారని, లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. కాళేశ్వరం వద్ద గేట్లు లేకుండా నీళ్లు స్టోర్ చేయవచ్చని లిఫ్ట్ చేయవచ్చని బిఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారని, అక్కడ ఎందుకు గేట్లు పెట్టారని ప్రశ్నించారు. తెలంగాణ వస్తే నీళ్ల నిధులు నియామకాలు జరుగుతాయని ఆశించిన ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దొరల గడీల రాజ్యం కెసిఆర్ కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎద్దేవా చేశారు. తొమ్మిదిన్నర ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి సెక్రటేరియట్‌కు రాకుండా ఒక ఎమ్మెల్యేని కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. నిర్బంధంతో కూడిన పాలన మంచి ప్రజలు విముక్తి కోరుకున్నారని కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని రంగాల్లో పునఃనిర్మాణం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయిలో నెంబర్ వన్‌గా మార్చే విషయంలో కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, సాయిరెడ్డి, బాగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చిన్నబాల్‌రాజ్, కుమార్‌రెడ్డి, మోహన్, అంబర్‌సింగ్, నరేష్, రవి పాల్గొన్నారు.

**కవితలా ఫాంహౌస్, వ్యాపారాలు నాకు లేవు ..**

తెలంగాణ ఉద్యమంలో ఆస్తులు అమ్ముకుని తెలంగాణ కోసం పని చేశానని డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. పాంచ జన్య సభలో భూపతిరెడ్డిపై విమర్శలు కురిపించిన కవిత వ్యాఖ్యలపై స్పందించారు. వృత్తిరీత్యా డాక్టర్‌గా ఉద్యోగాన్ని వదిలేసి ప్రజాసేవ కోసం పరితపిస్తున్న తనపై మాట్లాడటం హాస్యస్పదమన్నారు. కవిత కుటుంబ ఆస్తుల పంపకంలో వచ్చిన సమస్యలతో ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎవరికి వ్యాపారాలు, దందాలు ఉన్నాయో ప్రజలకు తెలుసన్నారు. ఈ విషయంపై మాట్లాడాల్సిన అవసరం తనకు లేదన్నారు.

## పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**



**ప్రజాపక్షం / మెదక్ :** పేద,మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం మెదక్ మండలంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ద్వారా నిత్యావసర సరుకులు అందించడంతో పాటు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆరోగ్య సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ తహసీల్దార్ లక్ష్మ ణ్ బాబు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడువులోగా సిలబస్ పూర్తి చేయాలి


**కలెక్టర్ కె. హరిత**



**ప్రజాపక్షం / రెబ్బెన :** ఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వారిని వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. బుధవారం మండలంలోని ఇందిరానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల హాజరు, బోధన తీరును పరిశీలించిన కలెక్టర్, వంద శాతం హాజరు నమోదయ్యేలా చూడాలని, కంప్యూటర్ శిక్షణ అందించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వలు, వార్డులను తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. చిన్న కారణాలతో రోగులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేయకుండా స్థానికంగానే మెరుగైన వైద్యం అందించాలన్నారు. గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని, వైద్యులు సమయపాలన పాటిస్తూ నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి**



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలు, రైతుల సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా బుధవారం రామకృష్ణాపూర్‌లో పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్‌తో కలిసి ఆయన వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలతో వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన ఆశయాల స్ఫూర్తితోనే సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, దాముక శిరీష, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, మహిళా నాయకులు దీప, శనిగరపు అనూష, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ప్రజా పక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రజలకు 24 గంటల పాటు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆసుపత్రిని బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు.బుధవారం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం పలు సమావేశాలు నిర్వహించి సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని,ఇప్పటికే కొత్తగా కొంతమంది వైద్యులు విధుల్లో చేరారని, మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే సంబంధిత మంత్రులతో చర్చలు జరిపినట్లు, భూమికి సంబంధించిన సమస్యలు, అంతర్గత మౌలిక వసతులు, మరమ్మతులకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రికి అవసరమైన ఏ అంశమైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత,ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ స్వర్ణ రెడ్డి, డాక్టర్ వంశీ మాధవ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం..**

ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సేవలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగపడేలా ఉచిత అంబులెన్స్ సేవలను ఏర్పాటు చేసిన సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డిని అభినందించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 1000 రోజుల్లోనే ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, రైతు రుణమాఫీ, రైతు భరోసా,సన్నబియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. బిఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేయడం మానుకుని ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

**అట్రాసిటీ కేసుల పరిష్కారంలో వేగం, పారదర్శకత**
**ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**ప్రజాపక్షం /మెదక్ :** జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాల అభ్యున్నతికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బుధవారం ఐడిఒసిలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్‌పి శ్రీనివాసరావు, కమిషన్ సభ్యుడు లక్ష్మీ నారాయణతో కలిసి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలుపై వెంకటయ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని సూచించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగంగా, పారదర్శకంగా పూర్తి చేసి బాధితులకు నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. ప్రతి నెల చివరి వారంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి ప్రజలకు చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి మూడు నెలలకు జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎస్‌బిఐ ఖాతాలు తెరిపించి బీమా సౌకర్యం కల్పించాలని తెలిపారు. అధికారులు మానవీయ కోణంలో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యాసంస్థల్లో కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంబదాసు రాజేశ్వర్, డిఎఫ్‌ఒ జోజి, జడ్‌పి సిఇఒ ఎల్లయ్య, డిఆర్‌డిఒ పిడి శ్రీనివాసరావు, హౌసింగ్ పిడి మాణిక్యం, ఆర్‌డిఒలు రమాదేవి, బవయ్య , రామకృష్ణ, డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, నరేందర్, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ అధికారులు సింధు, విజయ లక్ష్మి , నీలిమ, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విధ్వంసాన్ని వీడి అభివృద్ధి వైపు నడవండి

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**



**ప్రజాపక్షం/చెన్నూరు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకొని రాజధాని కేంద్రంలో కూల్చివేతలు నిర్వహిస్తుంటే చెన్నూరు నియోజకవర్గంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పోలీసులను అడ్డం పెట్టుకొని విధ్వంసాలకు పాల్పడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై అసహనం వ్యక్తం చేస్తూ బిఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ గద్దెనెక్కేవరకు అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను నమ్మించి నయవంచన చేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజధాని నగరంలో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడమే కాకుండా నేడు లక్ష ఎకరాలకు పైగా భూములను నిషేధిత జాబితాలో చేర్చి రైతులను మోసం చేసాడని బాల్క సుమన్ ధ్వజమెత్తాడు. రేవంత్ సర్కార్ చేస్తున్న అకృత్యాలను ప్రధాన ప్రతిపక్షమైన తాము చూస్తూ ఉండబోమని ఈ సందర్భంగా బాల్క సుమన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / చెన్నూర్ :** ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం చెన్నూర్ మండలంలో కొనసాగుతున్న పలు నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 100 పడకల సామాజిక ఆసుపత్రి, బిసి వసతి గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. ఆసుపత్రి వద్ద అనుమతిలేని తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. కత్తరశాలలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించి, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా చూస్తామని తెలిపారు. సోమనపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, తహసీల్దార్ మల్లికార్జున్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి

**కలెక్టర్ భవేష్ మిశ్రా**



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిషేధిత 22(ఎ) భూములకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను తుచ తప్పకుండా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమగ్ర ఆధారాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే సహేతుక నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి 22ఎ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 22ఎ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చటం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఒక్కో మండలం వారిగా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఎ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే సర్వే నెంబర్ వారిగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. 22ఎ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ విధిగా పాటించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఎ సమస్యలను పారదర్శకంగా వేగంగా పరిష్కరించాలని హితవు పలికారు. నిషేధిత భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, శిక్షణ కలెక్టర్ సురేష్, డిఆర్‌ఒ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్‌డిఒలు రాజేంద్రకుమార్, విజయకుమారి, శిక్షణ ఆర్‌డిఒ సందీప్, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కొలాం గిరిజనులకు పంచాయతీ కార్యదర్శి అండ

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆదర్శంగా తీసుకుంటూ ఉద్యోగ విధులతో పాటు అమాయక కొలాం గిరిజనులకు సేవా కార్యక్రమాలు అందిస్తూ పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్కల శ్రీనివాస్ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం దాహిగూడ గ్రామానికి చెందిన 20 మంది పివిటిజి (కొలాం) పిల్లలకు పుట్టుక ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆధార్‌కార్డులు అందలేదు. దీనివల్ల రేషన్ కార్డులతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. ఈ సమస్యను గుర్తించి కలెక్టర్ ఆదేశాల మేరకు జిపి కార్యదర్శి అక్కల శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తన సొంత ఖర్చులతో దగ్గరుండి 'నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్లు' తీయించి, పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు ఇప్పించారు. గిరిజన పిల్లల భవిష్యత్తు కోసం సొంత నిధులు వెచ్చించి గుర్తింపు కార్డులు ఇప్పించిన కార్యదర్శి శ్రీనివాస్‌ను అధికారులు, స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గోవింద్, సర్పంచ్ కుమ్ర లక్ష్మీ బాయి, మీ సేవా ఈడిఎం రవి, జిపిఓ ఆనందర్‌రావు పాల్గొన్నారు.

హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్' మోస్ట్ అవెటెడ్ సీక్వెల్ 'సర్దార్ 2'తో సెప్టెంబర్ 10న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది.

# 'మా రాముడు అందరివాడు'లో సీఎంగా సుమన్



అనుముల ప్రొడక్షన్స్, శ్రీరామ్ క్రియేషన్స్ బ్యానర్లపై అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మిస్తున్న చిత్రం 'మా రాముడు అందరివాడు'. యద్దనపూడి మైకిల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీరామ్, స్వాతి మందాడి జంటగా నటించారు. సుమన్, సమ్మెట గాంధీ, నాగ మహేష్, బాహుబలి ప్రభాకర్ కీలక పాత్రలు పోషించారు. సెప్టెంబర్ 4న థియేట్రికల్ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది.ఈ సందర్భంగా నటుడు సుమన్ మాట్లాడుతూ 'సినీ ఇండస్ట్రీలో గ్లామర్ కంటే టాలెంట్ ముఖ్యమని ఇప్పటికే చాలా మంది నిరూపించారు. ఈ సినిమా హీరో శ్రీరామ్‌లో కూడా మంచి టాలెంట్ ఉంది. డ్యూయెల్ రోల్‌లో ఆయన పెర్ఫార్మెన్స్ బాగా చేశారు. ముఖ్యమంత్రిగా మంచి మెసేజ్ ఇచ్చే పాత్రలో కనిపిస్తాను. దర్శకుడు మైకిల్ చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. నిర్మాత లక్ష్మణ్ ఇందులో విలన్‌గా కూడా నటించారు. ఆయన యాక్టింగ్ చాలా బాగా చేశారు. ఇది చాలా మంచి కథ. ట్విస్టులు ఇంటరెస్టింగ్‌గా ఉంటాయి. కచ్చితంగా అందరికీ నచ్చేలా సినిమా ఉంటుంది అని అన్నారు.నిర్మాత అనుముల లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ చిత్రాన్ని నిర్మిస్తూనే, ఇందులో విలన్ పాత్ర పోషించా. ఫస్టాఫ్‌లో వైల్ విలన్‌గా కనిపిస్తా. 20 ఏళ్లు ఎమ్మెల్యేగా చేసి అరాచకంగా ఆ ఊరిని ఎలా కంట్రోల్ పెట్టుకుంటాడనేది నా క్యారెక్టర్. సుమన్ ఇందులో సీఎంగా నటించారు. మా మధ్య వచ్చే సన్నివేశాలు అందర్నీ అలరిస్తాయి. మారేడుమిల్లి ఫారెస్ట్‌లో షూటింగ్ చేశాం. మనీష్ కుమార్ మ్యూజిక్ అందించిన నాలుగు పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. 200పైగా థియేటర్స్‌లో సెప్టెంబర్ 4న ప్రేక్షకులముందుకు రాబోతున్నామని అన్నారు.దర్శకుడు యుద్ధనపూడి మైకిల్, నిర్మాత వెంకట్ దుగ్గిరెడ్డి, దర్శకుడు శ్రీనివాస తేజ , హీరో శ్రీరామ్ , హీరోయిన్ స్వాతి మందాడి తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 27న 'మైసా'



రష్మిక మందన్న తాజా పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా'. ఈ చిత్రంలో గోండ్ గిరిజన మహిళ పాత్ర పోషిస్తున్న రష్మిక , ఆ పాత్రలో ఒదిగిపోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్ఫార్ములా ఫిలమ్స్ నిర్మిస్తున్న 'మైసా' ఆకట్టుకునే ఫస్ట్ గ్లింప్స్‌తో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తించింది. నవంబర్ 27, 2026న 'మైసా' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. పోస్టర్‌లో రష్మిక ఒక పెద్ద ఇటె పట్టుకుని నిలబడి ఉండగా, ఆమె ముఖంపై యుద్ధ గాయాలు కనిపిస్తాయి. ఆమె వెనుక భారీ జనసమూహం, మండుతున్న పరిసరాలు ఇంటెన్స్ గా ఉన్నాయి. ఈ పోస్టర్‌కు స్ట్రాంగ్ పీరియడ్‌యాక్షన్ లుక్ ఇస్తుంది. ఇటీవల సెట్స్‌లో ఒ హైఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా గాయపడిన రష్మిక మందన్న.. పాత్ర కోసం తన అంకితభావం, పట్టుదలను చూపించారు. కోలుకున్న తర్వాత త్వరలోనే ఆమె తిరిగి షూటింగ్‌లో పాల్గొని చివరి దశ షూటింగ్‌ను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం ఇంకా 12 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది.పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. .ఈ చిత్రంలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా శ్రేయాస్ పి. కృష్ణ, మ్యూజిక్ కంపోజర్‌గా జేక్స్ బిజోయ్ పని చేస్తున్నారు. ఇంటర్నేషనల్ స్టంట్ స్పెషలిస్ట్ ఆండీ లాంగ్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. 'మైసా' తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

# 'సర్దార్ 2' ట్రైలర్ రిలీజ్



హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్' మోస్ట్ అవెటెడ్ సీక్వెల్ 'సర్దార్ 2'తో సెప్టెంబర్ 10న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించారు. సర్దార్‌తో ఏర్పడిన స్పై యూనివర్స్‌ను మరింత పెద్ద కాన్వాస్‌పైకి తీసుకెళ్లిన ఈ సీక్వెల్‌లో డేంజర్, కాన్ఫ్లిక్ట్, యాక్షన్ నెక్స్ట్ లెవల్ కి వెళ్ళిందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. గతంలో జరిగిన సంఘటనలను, ప్రస్తుతం ఎదురవుతున్న ప్రమాదాన్ని కలిపి కథను ప్రజెంట్ చేయడం అద్భుతంగా ఉంది. కార్తీ మరోసారి రెండు విభిన్న పాత్రలతో అదరగొట్టారు. తండ్రి, కొడుకులను లుక్స్, మేనరిజమ్స్, బాడీ లాంగ్వేజ్‌తో చాలా డిఫరెంట్‌గా చూపించారు. ముఖ్యంగా యంగ్ సర్దార్‌గా కార్తీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆకట్టుకుంటోంది. విజయ్ పాత్రలో మరో డిఫరెంట్ ఎనర్జీ కనిపిస్తోంది. ఎస్.జే. సూర్య విలన్గా ఇంటెన్స్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయన అనూహ్యమైన బిహేవియర్ కథలో టెన్షన్‌ను మరింత పెంచుతోంది. మాళవిక మోహనన్, ఆశికా రంగనాథ్, రజిషా విజయన్, అచ్యుత్ కుమార్, యోగి బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జార్జ్ సి. విలియమ్స్ సినిమాటోగ్రఫీ సినిమాకు స్లిక్, ఎక్స్‌పాన్సివ్ విజువల్ స్టైల్‌ను తీసుకొచ్చింది. ఇంటర్నేషనల్ లొకేషన్స్‌తో పాటు హైఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్‌లను భారీ స్కేల్లో చూపించారు. సామ్ సీఎస్ ఎలక్ట్రిఫైయింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టెన్షన్‌ను మరింత పెంచింది. కీలక సన్నివేశాలకు బిజిఎం మంచి ఇంటెన్సిటీని ఇచ్చింది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

# 10న 'మారెమ్మ'



రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా 'మారెమ్మ'తో హీరోగా పరిచయం అవుతున్నారు. మంచాల నాగరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, మోక్ష ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మయూర్ రెడ్డి బండారు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సెప్టెంబర్ 10 ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు వస్తోంది. తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకకు దర్శకుడు శివ నిర్వాణ హాజరయ్యారు. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ట్రైలర్‌ని డిజిటల్‌గా లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ షూటింగ్ సమయంలో అల్యూమినియం ఫ్యాక్టరీలో మాధవ్ని కలిశాను. నాకు అప్పుడు 'మారెమ్మ' సినిమా చేస్తున్నానని చెప్పాడు. 'మారెమ్మ' టీజర్ని చూపించాడు. చాలా ఇంటెన్సిటీ ఉంది. నిజానికి ఒక డెబ్యూ హీరో తొలి సినిమా చేస్తున్నప్పుడు పాటలు, ఫైట్లు అన్నీ ప్రూవ్ చేసుకోవాలని ఉంటుంది. ఒక ప్రేమకథతో రావాలి అనుకుంటారు అన్నారు. హీరో మాధవ్ మాట్లాడుతూ బేసిగ్గా అన్నదమ్ముల మధ్య ఒక ఎమోషన్ ఉంటుంది. కానీ ఇందులో ఒక దున్నపోతుకు మరొక మనిషికి ఉండే అనుబంధం ఎలా ఉంటుందో సెప్టెంబర్ 10న మీకు కనిపించబోతుంది. ఈ కథని నా దగ్గరికి తీసుకొచ్చిన మా నిర్మాతలకు థాంక్యూ. రవి తేజ ఈ సినిమా చూశారు. ఆయనకి క్లైమాక్స్ చాలా అద్భుతంగా నచ్చింది. చాలా ఎమోషనల్ అయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ దీప , డైరెక్టర్ మాంచాల నాగరాజు , నిర్మాత మయూర్ , వికాస్ వశిష్ట తదితరులు పాల్గొన్నారు.

## రోమాంచకం హీరో సుమంత్ ప్రభాస్



సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 3న రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో హీరో సుమంత్ ప్రభాస్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. తెలంగాణ నేపథ్యంతో మేమ్ ఫేమస్ అనే సినిమా చేశాను. ఇక్కడి ఆడియెన్స్ బాగా చూశారు. ఆంధ్ర నేపథ్యంతో గోదారిగట్టుపైన సినిమా చేశాను. ఆ సినిమాను ఏపీ వాళ్లు ఆదరించారు. ఈ రెండు చిత్రాలతో నటుడిగా వెర్సటాలిటీ చూపించే అవకాశం దక్కింది.

## అన్నిరకాల చిత్రాల్లో నటించాలని ఉంది

రోమాంచకం సినిమా హైదరాబాద్ నేపథ్యంగా సాగుతుంది.ఇంజినీరింగ్ కంప్లీట్ చేసి ఒక స్టార్టప్ కంపెనీ పెట్టాలని ప్రయత్నించే యువకుడిగా ఈ చిత్రంలో కనిపిస్తాడు. ఆ క్యారెక్టర్ క్యూట్ గా, ఇన్నోసెంట్ గా ఉంటుంది. రియల్ లైఫ్ లో నేను ఎస్ ఐ కావాలని మా నాన్నకు ఉండేది. డిగ్రీ చదువుతున్నప్పుడే మేమ్ ఫేమస్ మూవీలో అవకాశం వచ్చింది.వర్క్ షాప్స్ అంతా కంప్లీట్ అయ్యాక మొదటి నుంచి చివరి దాకా నా పర్ ఫార్మ్ చూసుకుంటే ఎంతో మార్పు కనిపించింది. కొన్నిసార్లు ఒకే సీన్ రెండు మూడు నెలలు ప్రాక్టీస్ చేసిన సందర్భాలున్నాయి. విజయ్ దేవరకొండ అన్న మా మూవీ ప్రీ రిలీజ్ కు రావడం చాలా హ్యాపీగా అనిపించింది. ఇప్పుడు లవ్ స్టోరీస్ వస్తున్నాయి. హీరోగా పేరొచ్చాక యాక్షన్, కమర్షియల్ ఆఫర్స్ వస్తాయేమో చూడాలి. నెకట్స్ ఏషియన్ బ్యానర్ లో రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు కంపాటితో ఒక మూవీ చేయబోతున్నా. ఈ నెలలోనే ఆ మూవీ స్టార్ట్ కానుంది.

# మహానేత వైఎస్‌ఆర్‌కు ఘన నివాళులు

17వ వర్ధంతి సందర్భంగా
తెలంగాణ వ్యాప్తంగా సంస్మరణ సభలు
ప్రజా సంక్షేమమే వైఎస్ఆర్ రాజకీయ వారసత్వమంటూ నేతల నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి (వైఎస్ఆర్)ను ఆయన 17వ వర్ధంతి సందర్భంగా తెలంగాణలో ఘనంగా స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్, వైఎస్సార్ అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు వైఎస్ఆర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఏటా అభిమానులు, రాజకీయ నేతలు ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. వైఎస్ఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా నేతలు గుర్తు చేసుకున్నారు. ఆయనకు ప్రజల సమస్యలపై ఉన్న అవగాహన, పేదల పట్ల చూపిన మానవతా దృక్పథాన్ని కొనియాడారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, బలహీన వర్గాల కోసం



అనేక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకునే విధానం వైఎస్సార్ రాజకీయ శైలిలో ప్రత్యేకతగా నిలిచింది. వైఎస్ఆర్ మరణించి 17 ఏళ్లు గడిచినా ఆయనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని పలువురు నేతలు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతి కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు ఆయనను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయని అన్నారు. తెలంగాణలోనూ వైఎస్ఆర్ అభిమానులు, ఆయనతో అనుబంధం ఉన్న నాయకులు వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించి ఆయన సేవలను స్మరించుకున్నారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణలో జరిగిన కార్యక్రమాలు రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లో వైఎస్ఆర్‌తో అనుబంధం ఉన్న పలువురు నాయకులు ఆయనతో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. మరోవైపు వైఎస్సార్ కుటుంబ సభ్యులు కూడా ఆయన సమాధి వద్ద నివాళులు అర్పించారు. వైఎస్సార్ కుమారుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు.

**వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: మంత్రి పొన్నం ప్రభాకర్**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పంజాగుట్టలోని వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు వైఎస్ఆర్‌తో తమకున్న అనుబంధాన్ని, ఆయన ప్రజా సేవలను స్మరించుకున్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సాగునీరు, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడం వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఆయన పాలనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని అన్నారు.

# ప్రపంచ శాంతి సాధనకు కృషి

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నేతల పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ ప్రపంచ శాంతి సాధనకు కృషి చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) జాతీయ అధ్యక్ష వర్గ సభ్యుడు డాక్టర్ డి సుధాకర్,రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్‌లు పిలుపునిచ్చారు. వియత్నాం నేషనల్ డే సందర్భంగా హైదరాబాదులోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి నాగేశ్వరరావు అధ్యక్షతన శాంతి సంఘీభావ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్,కె వి ఎల్, వెంకట్, జి .నాగేశ్వరరావు మాట్లాడుతూ హోచిమిన్ నాయకత్వంలో వియత్నాం ప్రజలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటం, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి సైన్యాన్ని తరిమికొట్టిన ఘనత వియత్నాం ప్రజలదేనని పేర్కొన్నారు.ఇటీవల క్యూబాలో పర్యటించిన వెంకట్ మాట్లాడుతూ వియత్నాం, క్యూబా ప్రజలు తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు సామ్రాజ్యవాదానికి లొంగకుండా పోరాడుతున్నారని తెలిపారు. అమెరికా ఆంక్షలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్యూబా ప్రజలకు ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు వై వెంకట్రాంరెడ్డి, ఏ.అనూష ,గురు బచ్చన్ సింగ్, రామనారాయణ, నరహరి, జె.కె.శ్రీనివాస్, పోలా గాని రవి కిషోర్, జావేద్, రామచంద్రారెడ్డి, ఎ ఎత్తం శివ, వెంకట్ గౌడ పి వెంకటేశ్వర్లు, శివయ్య, శిరీష, బాలయ్య, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## నన్ను బాధ్యులను చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడతారని అందులో సుస్మిత కూడా ఒకరని కొండా సురేఖ అన్నారు. తన బిడ్డ కనుక తనను బాధ్యురాలిని చేయడం సరికాదని ఆమె వివరించారు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయనన్నారు. తన వివరణను మీనాక్షి నటరాజన్‌కు చెప్పానట్లు వెల్లడించారు. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారని సురేఖ వివరించారు. పార్టీలో కొంతమందితో తనపై ఆరోపణలు చేయించారన్నారు. ఎవరు అలా చేయించారో తనకు తెలుసని కొండా సురేఖ పేర్కొన్నారు. పేర్లు చెబితే వివాదం అవుతుందన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని సురేఖ అభిప్రాయపడ్డారు. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలని ఆమె కోరారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే అసలు తప్పు అని అన్నారు. రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. రేవంత్ పాలనపై మంత్రులు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఎఐసిసి సభ్యురాలిగా ఉన్నానని అందుకే ఇక్కడికి వచ్చి తన బాధ చెప్పుకొన్నానన్నారు. రాహుల్, ప్రియాంక, కెసి వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చానని, పార్టీ తీసుకునే నిర్ణయం ఆధారంగా తన ఆలోచన ఉంటుందని కొండా సురేఖ అన్నారు.

## 'సర్' లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గెలుపును అందించే లక్ష్యంతోనే సాగుతోందని మాజీ కేంద్ర మంత్రి ఆరోపించారు. జార్ఖండ్‌లోని గొడ్డా జిల్లాలో బీజేపీ ఏజెంట్లు ప్రధానంగా మైనారిటీ వర్గానికి చెందిన ఓటర్ల పేర్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన నివేదిక ఆధారంగా సిబల్ ఈ వ్యాఖ్యలు చేశారు. జెఎంఎం – కాంగ్రెస్ కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులైన బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ఈ విషయంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 'మినహాయింపు రాజకీయాలు. బిజెపి ఏజెంట్లు: ముస్లింలను లక్ష్యంగా చేసుకుని, భారీగా పేర్ల తొలగింపునకు ప్రయత్నిస్తున్నారు. సుప్రీంకోర్టు దీనిని అడ్డుకోవాలి' అని సిబల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సర్ ఓటర్ల జాబితాను తారుమారు చేసే ప్రక్రియ అని, ఎన్నికల్లో బిజెపి గెలిచేలా సహాయపడే చర్య అని స్వతంత్ర రాజ్యసభ ఎంపి వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలోనూ ఆయన మాట్లాడుతూ జార్ఖండ్‌లో బిజెపి కార్యకర్తలు 'ఫారం–7' ద్వారా భారీ సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేస్తున్నారని తెలిపారు. 'మీరు భారీ సంఖ్యలో ఫారమ్‌లను దాఖలు చేయవచ్చు అంటే 45, 100 లేదా 400 ఫారమ్‌లను కూడా తీసుకోవచ్చు. ఆ ఫారమ్‌లను సమర్పించి, ఫలానా పేరును తొలగించాలని కోరవచ్చు. దీనికి ఎటువంటి కారణం చెప్పాల్సిన అవసరం లేదు, ఒకవేళ అది అవాస్తవమని తేలినా పర్వాలేదు' అని సిబల్ అన్నారు. ఒక జాతీయ వార్తాపత్రికలో వచ్చిన ఈ కథనంపై విచారణ జరిపినప్పుడు, లక్ష్యంగా చేసుకున్న పేర్లు ముస్లిం వర్గానికి చెందినవేనని తేలిందని ఆయన చెప్పారు. ఆ వ్యక్తులను ఇంటర్వ్యూ చేసినప్పుడు, తాము, తమ కుటుంబాలు అక్కడ ఏళ్ల తరబడి నివసిస్తున్నామని వారు చెప్పారు. కాబట్టి పనులు ఇలాగే జరిగితే, ఇక ఎన్నికలు జరపడంలో అర్థం ఏముందిని ప్రశ్నించారు. బిజెపి కార్యకర్తలు ఫారం–7 ద్వారా తొలగించాలని కోరిన ముస్లింలు వాస్తవానికి అక్కడ ఏళ్ల తరబడి నివసిస్తున్నారని, వారిలో చాలామంది స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచే అక్కడ ఉంటున్నారని తేలిందని ఆయన పేర్కొన్నారు. కాబట్టి ఇది చాలా తీవ్రమైన సమస్య అని, ఒకవేళ న్యాయస్థానాలు దీనిపై దృష్టి సారించకపోయినా, సర్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం పూర్తిగా నిష్పక్షపాతంగా నిర్వహిస్తోందని భావించినా మనం తీవ్రమైన ప్రమాదంలో పడతామని, మన ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుందని తాను భావిస్తున్నానన్నారు. ఉదాహరణకు ఢిల్లీలో సుమారు 45 నుండి 47 లక్షల పేర్లను తొలగించారని, వాటిలో ఎన్ని తిరిగి పునరుద్ధరించబడతాయో తనకు తెలియదన్నారు. కానీ ఇది ఢిల్లీలోని మొత్తం ఓటర్ల సంఖ్య (1.5 కోట్లు)లో దాదాపు 23–24 శాతం అని ఆయన పేర్కొన్నారు. సర్ ప్రక్రియ మొదలైనప్పటి నుండి ఇప్పటివరకు మొత్తం మీద దాదాపు ఐదు నుండి ఆరు కోట్ల పేర్లు తొలగించబడ్డాయన్నారు. ఇవన్నీ బిజెపి కార్యకర్తల ద్వారా ఉద్దేశపూర్వకంగా పెద్ద సంఖ్యలో దాఖలు చేయబడుతున్న దరఖాస్తులేనని విచారణలో తేలిందని, సోషల్ మీడియాలోని ఆధారాలు, జాతీయ వార్తాపత్రికల కథనాల ద్వారా ఇది రుజువైందన్నారు.

## అవునో కాదో తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమశాఖకు అప్పగించడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీలుపై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. బాలల సంరక్షణ, దత్తత కేంద్రాలు, బాల నేరస్తుల కోసం ప్రత్యేక గృహాలపై అధికారులను ప్రశ్నించింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి శ్రుతి ఓజా, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి ఆన్‌లైన్‌లో విచారణకు హాజరయ్యారు. దత్తతలో కారా మార్గదర్శకాలు పాటిస్తున్నామని అధికారులు తెలిపారు. జువైనల్ జస్టిస్ పనిచేయాలని సూచించిన ధర్మాసనం, క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక ఇచ్చేందుకు సీనియర్ న్యాయవాది బి. మయసూరి రెడ్డిని అమికస్ క్యూరీగా నియమించి, విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

## సాంస్కృతిక విద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

సుంకిశాల ఎస్ఎల్‌బిసి టన్నెల్ వంటి అనేక ప్రమాదాలు జరిగిన ఒక్కరిపైన కూడా చర్యలు తీసుకోలేదన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైందని కెటిఆర్ ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి సోదరులు ఎంత బాహాటంగా దోపిడీ చేస్తున్నారో మంత్రి కొండ సురేఖ కూతురే బహిరంగంగా చెప్పిందన్నారు. ఢిల్లీకి మూటలు, పదవుల కోసం కీచులాటుల తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు . పేదల భూములను నిషేధం జాబితాలో పెట్టి, కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. తన్నీరు హరీశ్ రావు మాట్లాడుతూ పదేళ్లు కెసిఆర్ ఎంతో కష్టపడి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దిన తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా కుప్పకూలుస్తోందని ఆరోపించారు. ప్రజల పక్షాన, 'ప్రజా వ్యతిరేక' విధానాలపైన ప్రధాన ప్రతిపక్షంగా పోరాటం చేస్తామన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో బాండు పేపర్లు రాసిచ్చి, వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు గడుస్తున్నప్పటికీ ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.

## వాళ్లను ఖాళీ చేయించొద్దు
## మూసీ భూసేకరణపై హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు కోసం దర్గాఖలీసాఖాన్ గ్రామంలో చేపట్టిన భూసేకరణలో పిటిషనర్లను ఖాళీ చేయించరాదని హైకోర్టు బుధవారం మధ్యంతర ఆదేశాలను జారీ చేసింది. భూసేకరణ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలతో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేసును జస్టిస్ కె. శరత్ విచారించగా, పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వకేట్ కె. వివేక్ రెడ్డి, అడ్వకేట్ ప్రతీక్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి వాదించారు. తమకు చెందిన 9.08 ఎకరాల భూమి హిమాయత్‌సాగర్ బండ్‌కు అర కిలోమీటరు దూరంలో, బయో కన్జర్వేషన్ జోన్‌లో ఉందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. భూసేకరణ చట్ట నిబంధనలు పాటించకుండా, సామాజిక ప్రభావ అధ్యయనం లేకుండా ప్రక్రియ చేపడుతున్నారని, తమ అభ్యంతరాలను సక్రమంగా పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను ప్రచురించలేదని, అది అందుబాటులో లేకపోవడంతో భూసేకరణపై సమర్థవంతంగా అభ్యంతరాలు తెలిపే అవకాశం లేకుండా పోయిందని న్యాయవాదులు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com